ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 82 పేజీలు: 10+4 వెల: 6.50

**ఉగ్రవాదానికి భారత్ తలవంచదు: ప్రధాని మోడీ**

**మాలెగావ్ కేసు: నలుగురు నిందితులపై కేసు కొట్టివేత**

5లో

ఉమ్మడి ఎపి మాజీ సిఎం

## నాదెండ్ల కన్నుమూత



నాదెండ్ల భాస్కరరావు(ఫైల్)

### కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స

1980 దశకంలో టిడిపి, కాంగ్రెస్‌లో నాదెండ్ల కీలకపాత్ర

1984లో నెలరోజులు సిఎం బాధ్యతలు

సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మరికొందరు ప్రముఖుల ప్రగాఢ సంతాపం

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

**విజయవాడ, ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ రాజకీయవేత్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ నాదెండ్ల భాస్కరరావు హైదరాబాద్ ఆసుపత్రిలో కన్ను మూశారు. కొంత కాలం నుంచి భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాదెండ్ల భాస్కర్ రావు 1935 జూన్ 23లో గుంటూరులో జన్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతి తక్కువ కాలం 1984 ఆగస్టు 16నుంచి సెప్టెంబరు 16 వరకు 31 రోజులు ముఖ్యమంత్రిగా >>2

# నెలలోగా పిపిపి మెడికల్ కాలేజీలు

మొదటిదశలో 4, తర్వాత 6 కాలేజీల నిర్మాణం

త్వరలో స్టేట్‌హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ విధానం

శరవేగంగా సంజీవని ప్రాజెక్టు విస్తరణ

అమరావతిలో నేచురోపతి సంస్థ కోసం కేంద్రానికి లేఖ: సిఎం చంద్రబాబు



బుధవారం సంజీవని, పాపులేషన్ మేనేజ్మెంట్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 2.1 వృద్ధికి చేరుకోవడమే లక్ష్యం కావాలని ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు స్పష్టం చేసారు. మానవ వనరుల వృద్ధి అధికంగా కావాల్సిన అవశ్యకత ఇప్పుడు ఉందన్నారు.. రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీల పనులు నెల రోజుల్లో ప్రారంభించేలా ఆయా సంస్థలకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముందుగా ఫేజ్ 1లోని 4మెడికల్ కాలేజీలు మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. ఫేజ్ 2లో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 7 పిల్లర్లతో ఏపీ స్టేట్ హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ 202631 త్వరలోనే తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. ఇందులో భాగంగా మెడికల్ కాలేజీలు, మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్, మెడ్ టెక్ ఉత్పాదనలు, స్టార్టప్‌ఇన్నోవేషన్, మెడికల్ టూరిజం కింద ఇంటిగ్రేటెడ్ వెల్నెస్ ఫెసిలిటీస్ అందించడం, స్కిల్లింగ్, అమరావతివీఈఆర్‌లో మెడిసిటీలు ఏర్పాటుచేయాలన్నారు. అమరావతిలో నేచురోపతి సంస్థ కేంద్ర నెలకొల్పేలా ఆయుష్ శాఖ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సచివాలయంలో బుధవారం సంజీవని ప్రాజెక్టు,పాపులేషన్ మేనేజ్మెంట్‌పై సిఎం సమీక్ష నిర్వహించారు.

**సంజీవని ప్రాజెక్టు ద్వారా లక్ష మందికి పైగా సేవలు:** ప్రజలకు వైద్య ఖర్చులు భారం తగ్గించేలా ప్రివెంటివ్ హెల్త్ విధానం, సిటిజెన్ హెల్త్ స్క్రీనింగ్‌పై దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. ఇందుకోసం పబ్లిక్ హెల్త్ డేటాను వినియోగించుకోవాలన్నారు. సంజీవని ప్రాజెక్టు కింద ఇప్పటివరకు 1.08 లక్షల మందికి వైద్య సేవలు పొందారని, 2.8లక్షల మందికి మందులు పంపిణీ చేయగా, 19 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంజీవని ప్రాజెక్టు వేగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళికలు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవల్ని డిజిటలైజ్ చేసినా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆశించిన స్థాయిలో పనిచేయకుంటే ఫలితాలు రావని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రజారోగ్య రక్షణకు సంబంధించి ప్రచారం జరగడం లేదని, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గించుకునేందుకు అవకాశం కలుగు తుందని సీఎం అన్నారు. అనీమియా, డయాబెటిస్ >>2

## విఓఎలకు రూ.22.67కోట్ల ప్రోత్సాహక నిధులు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**సచివాలయం,ఏప్రిల్ 22,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వివోఏలకు రూ. 22.67 కోట్ల ప్రోత్సాహక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంతి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా విడుదల కావాల్సిన ఈ నిధులకు సంబంధించి మంత్రి కీలక సూచనలు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,336 గ్రామ సంఘాల్లో పనిచేసే >>2

# సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధి



సింగపూర్ ప్రతినిధులతో రాష్ట్రమంత్రుల బృందం భేటీ దృశ్యం

సింగపూర్ హోంమంత్రి షణ్ముగంతో రాష్ట్ర మంత్రుల భేటీ

నగరాభివృద్ధి విధానాలు, ప్రణాళికలపై అధ్యయనం

ఇండియన్ హైకమిషనర్‌తో కూడా మంత్రుల భేటీ

**విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** సింగపూర్‌లో జరుగుతున్న ఏపీ మంత్రుల అధ్యయన పర్యటనలో భాగంగా రెండో రోజు కార్యక్రమాలు సుసంపన్నంగా కొనసాగాయి. 'జాతీయ విధానాల్లో పారదర్శకత .జవాబుదారీ తనం, రాజకీయ బాధ్యత,ప్రజల నమ్మకం. విశ్వసనీయత' అనే ప్రధాన అంశంపై మంత్రుల బృందం వివిధ సమావేశాల్లో పాల్గొని సింగపూర్ పరిపాలనా విధానాలను అధ్యయనం చేసింది. ఉదయం నలాన్ లిటిల్ ఇండియా ప్రాంతంలో సింగపూర్ హోంమంత్రి శన్ముగంతో బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రాధాన్యత ఆధారిత పరిపాలన, బాధ్యతాయుత రాజకీయ వ్యవస్థ, ప్రజల రక్షణకు చర్యలు, చట్టాలపై ఆయన తన అనుభవాలను ఏపీ మంత్రులతో పంచుకున్నారు. తదుపరి సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్‌లో డాక్టర్ ప్రేమ్ కుమార్ సమన్వయంతో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సమగ్ర సమన్వయ విధానంపై మాజీ హెడ్ ఆఫ్ సివిల్ సర్వీస్ పీటర్ హో ఏపీ మంత్రులకు వివరించారు. ప్రభుత్వ విభాగాల సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధిని ఎలా సాధిస్తున్నారో ఆయన వివరణ ఇచ్చారు. అనంతరం యూఆర్ఏ గ్యాలరీను సందర్శించిన మంత్రులు పట్టణ ప్రణాళిక, భూవినియోగ పాలనపై అవగాహన పొందారు. సింగపూర్ నగరాభివృద్ధి విధానాలు, దీర్ఘకాలిక ప్రణాళిక, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై సింగపూర్ ప్రతినిధులు వివరించారు. తరువాత నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో జరిగిన సెషన్‌లో దీర్ఘకాలిక పట్టణ ప్రణాళిక, సమగ్ర ప్రణాళిక, సమన్వయ వ్యవస్థలు వంటి అంశాలపై నిపుణులు వివరించారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా ప్రజా నమ్మకాన్ని పెంపొందించే విధానాలు, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు వంటి అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుంటున్నారని ఏపీ మంత్రులు తెలిపారు. ఈ అనుభవాలను మన రాష్ట్రంలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రుల బృందంలో పి. నారాయణ, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బి.సి జనార్ధన్ రెడ్డి, ప్లానింగ్ సెక్రటరీ అనంత్ శంకర్, తిశిళీదిశిళీ నిదీ ఆలపర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇండియన్ హై కమిషనర్‌తో ఏపీ మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది.

**సింగపూర్ మారిటైం వీక్ 2026 లో పాల్గొన్న మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి:** సింగపూర్ పర్యటనలో భాగంగా మారిటైం వీక్ 2026 ను రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి సందర్శించారు. సింగపూర్ మారిటైం >>2

## వాడలెత్తిస్తున్న వడగాడ్పులు

**విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 202 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇవాళ కడపలో గరిష్ఠంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొన్నారు. గురువారం 95మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 101మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 19,విజయనగరంలో 24, పార్వతీ పురం మన్యం జిల్లాలో 3, అల్లూరి జిల్లాలో 5, పోలవరంలో 8, విశాఖపట్నంలో 1, అనకాపల్లిలో 13, కాకినాడలో 10, తూర్పుగోదావరి జిల్లాలో 6, ఏలూరులో 3, ఎన్టీఆర్ జిల్లాలో 3మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇళ్ళకు పరిమితం కావాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



## టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం ముగ్గురి మృతి

**దేవరపల్లి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం వీరవల్లి టోల్ ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన చాపర్ల హనుమంతరావు (45)కు వైద్యం చేయించేందుకు స్నేహితులు చాపర్ల రాజు(40), కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సాగర్ (41), గన్నిన నరేంద్రతో కలిసి ఈ నెల >>2



బుధవారం ఇప్పికట్ల గ్రామంలో సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగన్

## మూడేళ్లలో మళ్లీ వైకాపా ప్రభుత్వమే

అధికారంలోకి వచ్చాక ప్రతి బాధితునికి న్యాయం

నిర్వాసితుల సమస్యలపై పోరాటం: ప్రజాదర్బార్‌లో జగన్

**పులివెందుల, ఏప్రిల్ 22 , ప్రభాతవార్త :** రాష్ట్రంలో మరో మూడేళ్లలో వచ్చేది మన ప్రభుత్వమే అని అధికారంలోకి రాగానే ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని నిర్వాసితుల తరుపున పోరాటానికి సిద్ధం అని వైఎస్సార్సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల మూడు రోజుల పర్యటనలో రెండోరోజు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల మధ్య బిజీ బిజీగా >>2

# అనంతలో హనీ ట్రాప్ కలకలం

తేలిన 19 మంది బాధితులు

రూ.5 నుండి రూ.25 లక్షలు దోపిడీ

కొనసాగుతున్న సీక్రెట్ దర్యాప్తు

ముఠాతో పోలీసుల ములాఖత్

ఇద్దరు సిఐలపై వేటుకు రంగం సిద్ధం

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వయ్యారపు వలపులతో నెరవేసిన ముఠా అందిన కాడికి దోచేస్తోంది. అమాయకును టార్గెట్ చేస్తూ లక్షలాది రూపాయలను నిలుదోపిడి చేస్తున్న ఘటన వెలుగుజూసింది. మొత్తంగా బాధితులు 19 మందిని ఈ ట్రాప్ లో లాగి లక్షలాది రూపాయలను ఆ ముఠా పోగు చేసినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే ఈ తతంగం అంతా పోలీసుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు విశ్వసియనీయమైన సమాచారం.

ముందు తీయగా మాట్లాడి ముగ్గులు దించిన తర్వాత బ్లాక్మెయిల్ తరహాలో డబ్బులు డిమాండ్ చేసి ఈ ముఠా అమాయకుల జీవితాలతో ఆడుకుంతోంది. వివరాల మేరకు... అనంతపురం, రూరల్ పరిధిలోని రాప్తాడులో హనీ ట్రాప్ తో పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వలపు వలలో పడిన అమాయకులు వారి బారి నుండి కాపాడాలని కోరుతున్నారు. ఈ రొచ్చులో ప్రభుత్వ అధికారులు, బడా బాబులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను మహిళలతో ట్రాప్ చేస్తున్న ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసారు. ముందుగా పరిచయం చేసుకొని ఇంటికి రమ్మంటారు.. ఆ తర్వాత బట్టలు విప్పించి ఫోటోలు, వీడియోలు తీస్తారు. ఆలోగా ఆమె బంధు వులమంటూ ముఠా మొత్తం రంగంలోకి దిగు తారు. పరువు కాస్తా బజారుకు ఈడుస్తామని భయపెట్టడం, అందిన కాటికి దోచేయడం చేస్తారు.. ఇలా ఓ రిటైర్డ్ అధికారిని కూడా వలలో వేసుకొని చివరకు కాళ్ళ బేరానికి వచ్చి ఆయన రూ. 3 లక్షలు సమర్పించుకున్నట్లు సమాచారం.

ఇప్పటివరకు 19 మంది బాధితుల నుండి డబ్బులు వసూలు చేసిన 8 మంది సభ్యులతో కూడిన ముఠాపై జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్ గా పరిగణించారు. ముఠాలో ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఎస్పీ స్వయంగా దర్యాప్తు పర్యవేక్షణ కొనసాగించడంపై ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి.

అనంతపురంలో నయా ఖిహనీ ట్రాప్ దెబ్బకు కొందరు భయపడి ఊరు వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. బాధితుల్లో వీఆర్ ఓ, ఫిజియో థెరపిస్టు, ఆర్ఎంపీలు, కిరాణా వ్యాపారులు, రియల్టర్లు. వున్నారు. వీరి వలలో పడి చిక్కుకుని బయట పడలేక ఓ బాధితుడు ఆత్మహ? చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఖిహనీఖి ముఠాకు పోలీసులు సహకరిస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

దీంతో అనంతపురం పరిధిలోని ఇద్దరి సిఐలపై బదిలీ వేటు వేసినట్టు సమాచారం. పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది.



## వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కోసం పోలీసుల గాలింపు

**కాకినాడ ,ఏప్రిల్ 22,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభ పెట్టి డబ్బులు ఇచ్చారని సర్పవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్సీ అనంత బాబు పై కేసు నమోదు చేశారు. అతనిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్, ఒడిశా, తమిళనాడు ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు గా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో సాక్షులకు డబ్బులిచ్చి అనంతబాబు బెదిరిం పులకు గురి చేయడంతో పోలీసులను నలుగురు సాక్షులు భయంతో పోలీసులను ఆశ్రయించారు. సాక్షుల ఫిర్యాదు మేరకు >>2

# పూర్తి 'డీల్' కుదిరేదాకా ఇరాన్‌తో కాల్పుల విరమణ



గడువు పెంచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

జెడివాన్స్ పాక్ పర్యటన వాయిదా

**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** మధ్యప్రాచ్యంలోయుద్ధవిరమణకు జరుగుతున్న మధ్యవర్తిత్వం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఇస్లావ రాబాద్‌లో జరుగుతాయని భావించిన రెండో విడత చర్చలు అర్థాం తరంగా వాయిదాపడ్డాయి. జెడివాన్స్ బృందం రావడంలేదని ప్రకటించడంతో మళ్లీ ప్రతిష్టంభన నెలకొంది ఈనేపథ్యంలో అమె రికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన చర్చలను మరింతగా పొడిగించినట్లయింది. ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులమధ్య ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా - ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ తాజా నిర్ణయం పోస్టుచేసారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తన ట్రూత్ సోషల్ మీడియా వేదికపై వివరాలను వెల్లడించారు. కాల్పులు విరమణ కొనసాగుతున్న సమయంలో ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చామని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే దాడిని నిలిపివేసి, కాల్పుల విరమణ గడువు పొడిగించామని తెలిపారు. అయితే ఇందుకు ధీటుగా ఇరాన్ కూడా స్పందించింది. ఇరాన్ నౌకాశ్రయాల్లో నౌకల >>2

## విజయవాడలో మరో శాటిలైట్ రైల్వే స్టేషన్

**విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ రైల్వే స్టేషన్‌కు నిత్యం వచ్చే వందలాది రైళ్ల రద్దీని నియంత్రించడానికి శాటిలైట్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ కు ఉత్తరంగా రాజరాజేశ్వరి పేట వద్ద 70 వ దశకం చివర్లో బల్బ్ లైన్ నిర్మాణం జరిగింది. ప్రస్తుతం విజయవాడ నుంచి విశాఖ పట్నం వైపు వెళ్లాల్సిన గూడ్స్ రైళ్లు, కొన్ని ప్యాసింజర్ రైళ్లు నేరుగా నగరం మధ్య నుంచి బల్బ్ లైన్‌లో ప్రయాణిస్తున్నాయి. ఇటీవల అభివృద్ధి చేస్తున్న రాయనపాడు విజయవాడకు 15కిలోమీటర్ల దూరంలో >>2



ఎన్నికల సామాగ్రితో సిద్ధంగా ఉన్న పోలింగ్ సిబ్బంది

# తమిళనాడు, బెంగాల్‌లో నేడే పోలింగ్

## మహారాష్ట్ర, గుజరాత్‌ల్లోని 3చోట్ల ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం ఒకే దశలో పోలింగ్ జరుగనుండగా, పశ్చిమబెంగాల్‌లో తొలి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. తమిళనాడులో 234 నియోజకవర్గాలలో 4,023 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 5,73,43,291 మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షి ంచేందుకు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని ఎన్నికల సంఘం ప్రణాళిక రచించి, అందుకు అనుగుణంగా ఓటర్లలో అవగాహన ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. తమిళనాడు వ్యాప్తంగా పోలింగ్ విధుల కోసం 1.40 లక్షలకు పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. కీలకమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతా బలగాలను అందించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో ప్రచారం చేసిన బయటివారిని వారి సొంత నియోజకవర్గాలకు తిరిగి వెళ్లాలని ఆదేశించారు. పశ్చిమ బెంగాల్‌లో 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3.6 కోట్ల మంది ఓటర్లుండగా, 44వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి దశ ఎన్నికల్లో 1,478 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ దశల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, నిబంధనలను కఠినంగా అమలు చేసే లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన నూతన, విశిష్ట చర్యల ఫలితంగా రాష్ట్రంలో కేంద్ర భద్రతా బలగాల మోహరింపు అపూర్వ స్థాయిలో కనిపిస్తోంది. ఇందులో భాగంగా సుమారు 2,407 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఏపిఎఫ్) కంపెనీలకు చెందిన 2.4 లక్షల మందికి పైగా సిబ్బందిని మోహరించింది. సుమారు 7,384 బూత్‌లను "అత్యంత సున్నితమైనవి" లేదా "క్లిష్టమైనవి"గా గుర్తించారు. బ్రెయిల్‌తో కూడిన ఇవిఎంలు, ర్యాంపులు, ప్రాధాన్యతా క్యూల ద్వారా ఓటర్లకు సౌకర్యాలను కల్పించింది. మహారాష్ట్రలో రాహురి, బారామతి అసెంబ్లీ నియోజకవర్గాలకు, గుజరాత్‌లోని ఉమ్రీద్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగనుంది. గురువారం పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.

# అమరావతి రాజధాని కోసం మరో 1800 ఎకరాల భూ సమీకరణ

### త్వరలో సిద్ధం కానున్న మాస్టర్ ప్లాన్..
### అన్ని గ్రామాలకూ నోటిఫికేషన్ పూర్తి.
### పెదపరిమిలో రెండు యూనిట్లు ఏర్పాటు..

**.విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి రెండోదశ పూలింగు పరిధిలోని రైతులతో ముఖ్యమంత్రి చర్చల అనంతరం వారిలో సానుకూల దిశలో స్పందన వచ్చింది. వరుసగా భూ సమీకరణ కోసం నోటిఫికేషన్లు సిఆర్‌డిఎ అధికారులు ఇస్తూ వచ్చారు.ఆ క్రమంలోనే ఏడు గ్రామాలకూ భూసేకరణ నోటిఫికేషన్లు పూర్తి చేశారు. చివరిగా అమరావతి మండలంలో వైకుంఠపురం గ్రామానికి సమీకరణ ప్రకటన ఇచ్చారు. మొత్తం 22,494 ఎకరాల్లో 16,666 ఎకరాలు పట్టా భూమిగా ఉంది. దీనిలో మంగళవారం వరకూ సుమారు 1800ఎకరాలు ప్రభుత్వానికి అందింది. వీటిల్లో అత్యధికంగా అమరావతి మండలంలోని కర్లపూడిలేమల్లెలో 592 ఎకరాలు, యండ్రాయిలో 579 ఎకరాలు ఇచ్చారు. పెద్దమద్దూరులో 342 ఎకరాలు, వైకుంఠపురంలో తొలిరోజే 15.50 ఎకరాలు సిఆర్‌డిఎకు ఇచ్చారు. తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రాపురంలో 8.37 ఎకరాలు, పెదపరిమి ఒకటో యూనిట్లో 99.50 ఎకరాలు, రెండో యూనిట్లో 32 ఎకరాలు, వడ్డమానులో 113 ఎకరాలు మొత్తం 1,784 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. అయితే జనవరి 7న రెండోదశ పూలింగు ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం అనుకున్నస్థాయిలో పూలింగు వేగంగా నడవడం లేదనే విమర్శ ఉంది. చట్టబద్ధత అంశం కూడా ఇటీవల కాలం వరకూ పెండింగ్‌లో ఉండటంతో అధికారులు ముందడుగు వేయలేదు. ఆ సమస్య కూడా పరిష్కారం అవడంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా రైతులతో చర్చించారు. ఏడాది కౌలును రూ.40 వేలకు పెంచారు. రుణమాఫీ గతంలో ఉన్నట్లుగానే రూ.1.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై రైతులు సంతోషం వ్యక్తం చేసినా పూలింగు ప్రక్రియ వేగవంతం అవలేదు. సింగపూర్ పర్యటనకు ముందు మంత్రి నారాయణ వైకుంఠపురంలో సమావేశం ఏర్పాటు చేయగా అక్కడి రైతులు ఇన్నర్ రింగురోడ్డు లోపల తమకు స్థలాలివ్వాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ సీడ్‌యాక్సెస్ రోడ్డు వైకుంఠపురం వరకూ వస్తుందని, తూర్పు, పడమర వైపు (ఈ సిరీస్) నెంబరు రోడ్లన్నీ రెండోదశ పూలింగు ఏరియాలోకి వస్తాయని, అటువంటప్పుడు ఎక్కడైతే ఏమిటని అన్నారు. అయితే రైతులకు సానుకూలంగా చేస్తామని చెప్పారు. **త్వరలో మాస్టర్ ప్లాను:** రెండోదశకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లకు సంబంధించి మాస్టర్ ప్లాను తుది రూపు పూర్తయినట్లు తెలిసింది. త్వరలోనే దీన్ని విడుదల చేయనున్నారు. అయితే ముఖ్యమంత్రి చేతులమీదుగా విడుదల చేయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్లానులో గతంలో మాదిరి కాకుండా రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లన్నీ ఒకచోట ఉండేలా, అది కూడా మూడు, నాలుగు గ్రామాలకు కలిపి ఒకేచోట ఇచ్చేలా ప్లాను రూపొందిస్తున్నారు. దీనివల్ల సిఆర్‌డిఎకు చెందాల్సిన భూములన్నీ ఒకేచోట ఉండేలా ప్లాను రూపొందిస్తున్నారు.

# తెలంగాణలో కదలని బస్సులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె దిగారు. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు సైరన్ మోగించారు. దీంతో డిపోల్లోనే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు పలుచోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా మరికొన్ని చోట్ల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ అద్దె బస్సులు నడుపింది. తొలిరోజు(బుధవారం) ఆర్టీసి కార్మికుల సమ్మె ప్రశాంతంగా సాగింది. చాలా ప్రాంతాల్లో మగవారి నుంచి టికెట్ తీసుకోకుండా బస్సుల్లో ఎక్కించుకున్నారు

# నాదెండ్ల కన్నుమూత

>> పని చేశారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే ఆగస్టు సంక్షోభంలో ఆయన కీలక పాత్రధారి. అప్పట్లో ఎన్టీఆర్ వెన్నంటే ఉండి, ఆపై ఆయనకే వ్యతిరేకంగా వ్యవహరించారు.కాంగ్రెస్‌తో కలిసి ఎన్టీఆర్‌ను గద్దె దించారు.అయితే శాసనసభ్యుల మద్దతు కూడగట్టలేక పదవికి రాజీనామా చేసారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య మంత్రివర్గాల్లో కీలక శాఖలను నిర్వహించారు. 1982లో నందమూరి తారక రామారావు ఖితెలుగుదేశంఖి పార్టీని స్థాపించినప్పుడు భాస్కరరావు కీలక పాత్ర పోషించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాక, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ టెక్సాస్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకుని తిరిగి వచ్చిన వేళ రాష్ట్ర రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. కాంగ్రెస్ మద్దతుతో 1984 ఆగస్టు 16న భాస్కరరావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా నెల రోజులకే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. తిరిగి కాంగ్రెస్‌లో చేరి 1998లో ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. 2019లో ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన వారసుడిగా జనసేన నాయకుడు,మంత్రి నాదెండ్ల మనోహర్ ఏపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అభిమానులు అంతిమ నివాళులు అర్పించుకోవడానికి వీలుగా, ఆయన పార్థివ దేహాన్ని జూబిలీహిల్స్ లోని వారి స్వగృహం వద్ద ఉంచారు. గురువారం మధ్యాహ్నం 4 గంటలకు పంజాగుట్ట, హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

# నెలలోగా పిపిపి మెడికల్ కాలేజీలు

>> వంటి వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉందన్నారు.

**సంతానోత్పత్తిలో చిట్టచివరన విశాఖ జిల్లా:** జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేట్ 2.1 నుంచి 1.5కి తగ్గిందని, అత్యధికంగా కడప జిల్లాలో 1.99 ఫెర్టిలిటీ రేట్ ఉంటే, అత్యల్పంగా 1.32 విశాఖపట్నంలో నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికివివరించారు. ఫెర్టిలిటీ రేటు 2.1 లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, లక్ష్యం కన్నా 6శాతం తక్కువలో ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. తల్లికి వందనం పాపులేషన్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగమేనని చెప్పారు. మన దేశ కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని దీనిని కాపాడుకునేందుకు మైక్రోఫ్యామిలీ సంస్కృతి విస్తరించకుండా చూడాలన్నారు. ఉమ్మడిపెద్ద కుటుంబాలకు అధిక ప్రోత్సాహకాలు ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. జనాభా నిర్వహణ అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. పాపులేషన్ మేనేజ్మెంట్‌తో పాటు ప్రజారోగ్య రక్షణకు కార్యాచరణ చేపట్టాలన్నారు. అలాగే సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మంది అనారోగ్యం పాలవుతున్నారని, పోషకాహారంప్రివెంటివ్ హెల్త్ పై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఆయుర్వేద, నేచురోపతి చికిత్సా విధానాలను కూడా ప్రోత్సహించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వారి రికార్డుల ఆధారంగా డైట్ ప్యాట్రన్, పోషకాహారం అందించాల్సి ఉందన్నారు.ఈ సమీక్షకు వైద్యారోగ్య శాఖ, ఆర్థిక, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు శాఖ, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధి

>> వీక్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ పెవిలియన్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండియన్ పెవీలియన్ విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ వెంకటేశపతి, ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ ఎండి నీలాభ్ర దాస్‌గుప్తా, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపీ మారిటైమ్ బోర్డు ఈడి ప్రతాపరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు. 4 రోజులపాటు నిర్వహిస్తున్న సింగపూర్ మారిటైమ్ వీక్ 2026లో ఇండియన్ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంపై మంత్రి అభినందనలు తెలిపారు. ఇండియన్ పెవిలియన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో మారిటైమ్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టుల అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రమోట్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం నెలకొన్న అనుకూల వాతావరణంపై మరింత విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మారిటైం లాజిస్టిక్ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, పోర్టుల మోలిక సదుపాయాల అభివృద్ధి డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి అంశాలపై ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు.

# విఓఎలకు రూ.22.67కోట్ల ప్రోత్సాహక నిధులు

>> వివోఏలకు ఈ నిధులు ప్రోత్సాహకంగా అందజేస్తారు.ఇప్పటికే స్త్రీనిధి ద్వారా గ్రామ సంఘాలకు 0.25శాతం ప్రోత్సాహకాలు ఇచ్చారు.స్వయం సహాయక సంఘాలు నుంచి వసూలైన వడ్డీ ఆధారంగా 0.75శాతం ప్రోత్సాహకాన్ని వివోఏలకు ఇవ్వాలని నిర్ణయించారు.గ్రామస్థాయిలో స్త్రీనిధి రుణాల వసూలు,సంఘాల బలోపేతానికి వివోఏలు అందిస్తున్న సేవలు కీలకమని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు.వారి కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందించాలన్నఉద్దేశ్యంతోనే ఈ నిధులు తక్షణమే గ్రామ సంఘాల ఖాతాల్లో జమచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ముగ్గురి మృతి





మృతులు(ఫైల్)

>> 19న కారులో చెన్నైకు వెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి వస్తుండగా బుధవారం ఉదయం వీరవల్లి టోల్‌ప్లాజా సమీపంలో వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో హనుమంత రావు, రాజు, సాగర్ తీవ్ర గాయా లతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న మరో వ్యక్తి గన్నిన నరేంద్రకు తీవ్ర గాయాలవడంతో హైవే అంబులెన్స్ పై వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు కోసం పోలీసుల గాలింపు

>>కాకినాడ భానుగుడి సెంటర్ శంకర్ టవర్స్ అపార్ట్మెంట్ అనంతబాబు ప్లాట్‌లో పోలీసులు స్వాదాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంతబాబును ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం వుందని చెబుతున్నారు.

**మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం:** మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. భాస్కరరావు తనయుడు, క్యాబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌చేసి పరామర్శించారు. మనోహర్ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నానని డీసీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదన్నారు. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారని పవన్‌పేర్కొన్నారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు, నాసహాచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాలకమిటీచైర్మన్ మనోహర్ పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి. మనోహర్‌కి,కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియచేస్తున్నానని పవన్ పేర్కొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి శాఖలో ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ సలహాదారు సీతా శర్మ రాజీనామా !

**విజయవాడ,ఏప్రిల్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** నైపుణ్యాభివృద్ధి శాఖలో ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ సలహాదారు సీతా శర్మ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ నైపుణ్యాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. నైపుణ్య కల్పనలో విదేశీ సంస్థలతో సమన్వయం, ఇక్కడి యువతకు అక్కడి అవసరాలపై శిక్షణ అంశాలపై ఆమె పనిచేశారు. 2025 జనవరిలో రెండేళ్ల కాల పరిమితితో ఆమె నియమితులయ్యారు. 2027 జనవరి వరకూ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ఆమె ముందుగానే రాజీనామా చేసి వెళ్లిపోయారు.విభాగ పరమైన సమస్యల కారణంగా ఆమె తన పదవి కాలం ముగియడానికి ముందుగానే రాజీనామా చేసారు.




బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెర్హంపూర్‌లో బుధవారం ఎన్నికల సామాగ్రితో పోలింగ్ సిద్ధమవుతున్న సిబ్బంది

# పూర్తి 'డీల్' కుదిరేదాకా ఇరాన్‌తో కాల్పుల విరమణ

>> దిగ్బంధం కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆరాఘ్చీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధచర్యలతో సమానం అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా తస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా మితిమీరిన డిమాండ్లు తీసుకువస్తోందని అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని ఇరాన్ అభిప్రాయపడినట్లుతస్నిమ్ వార్తాసంస్థ వెల్లడించింది.

**ట్రంప్ మైండ్‌గేమ్ ముమ్మరం...**

ఓపక్క శాంతి చర్చలు అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థులతో తన మైండ్‌గేమ్ తీవ్రంచేసారు. ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నదని తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు చెప్పారు. హార్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే ఆదేశానికి నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హార్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హార్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ హార్ముజ్‌ను తాము ప్రారంభిస్తే, ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

**జెడివాన్స్ పాక్ పర్యటన వాయిదా...**

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల పునరుద్ధరణపై నెలకొన్న ఉత్కంఠకు ఇప్పటికీ ముగింపులేదు. పాకిస్థాన్‌లో జరగాల్సిన రెండో విడత చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం చేయాల్సిన పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడమే ఇందుకు కారణమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో వెల్ల డించారు. ఇరాన్ ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వచ్చేవరకు ఈ సీజ్‌ఫైర్ కొనసాగుతుందని తెలిపారు. దీనితో ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో కూడిన బృందం ఇస్లామాబాద్ పర్యటనను వాయిదావేసుకోవాల్సి వచ్చింది.

# విజయవాడలో మరో శాటిలైట్ రైల్వే స్టేషన్

>> ఉంటుంది. మధురా నగర్, గుణదల స్టేషన్ల నుంచి ఇతర రైళ్లకు ఇంటర్ చేంజ్ అవకాశం ఉండదు. బల్బ్ లైన్ నిర్మాణ సమయంలోనే భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా రైల్వే భూసేకరణ చేసింది.ప్రస్తుతం ఆ భూముల్లో ఆక్రమణలు వెలిశాయి. గత 30 ఏళ్లలో ఏకంగా కాలనీలు తయారు అయ్యాయి. వాటిని ఖాళీ చేయించడం రైల్వేకు తలకు మించిన భారం అవుతోంది.శాటిలైట్ స్టేషన్ రాజరాజేశ్వరి పేట శివారు, ప్రస్తుత సుబ్బరాజు కాలనీ, అల్లు జయలక్ష్మి కాలనీ( ఇవి రైల్వే స్థలాలు) నిర్మిస్తే విశాఖ వైపు ప్రయాణించే వారికి, విజయవాడ స్టేషన్ వచ్చే వారికి వీలుగా ఉంటుంది. అక్కడ ప్లాట్ ఫాం ఏర్పాటు చేసినా ప్రధాన రైల్వే స్టేషన్ మీద ఒత్తిడి తగ్గుతుంది. నగర ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టాలి. మొదటి వృత్తం రైల్వే జంక్షన్, రెండోది గ్రాండ్ ట్రంక్ మార్గంలో విశాఖ వైపు వెళ్ళే బల్బ్ లైన్. అది అయోధ్య నగర్, న్యూ ఆర్ ఆర్ పేట మధ్య తిరిగి ప్రధాన రైల్వే లైన్ లో కలుస్తుంది.

# బెంగాల్‌లో బాబ్రీమసీదునిర్మాణం కల్ల: హోంమంత్రి అమిత్‌షా

**ఉత్తర 24 పరగణాలు(బెంగాల్), ఏప్రిల్ 22:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారంనాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు. బెంగాల్ మొత్తం సిండికేట్లమయంగా మారింది. సిమెంట్, ఇసుక, ఇటుకలు ఏమి కావాలన్నా మీరు సిండికేట్లకు డబ్బులు చెల్లించాలి. డమ్‌డమ్ ప్రజలకు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఈనెల 5వ తేదీ తర్వాత ఈ సిండికేట్ సభ్యులు తట్టాబుట్టా సర్దుకుని బెంగాల్ నుంచి పారిపోవడమో, వసలపోవడమో జరుగుతుందని అమిత్‌షా అన్నారు. హుమయూన్ కబీర్ పేరుతో బాబ్రీ మసీదు నిర్మించాలని మమతాబెనర్జీ కోరుకుంటున్నారని అమిత్‌షా విమర్శించారు. ఎవరూ ఆందోళన చెందవద్దు. మమతా దీదీ ఎంత గట్టిగా కోరుకున్నప్పటికీ బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని బీజేపీ అనుమతించే ప్రసక్తే లేదు అని అన్నారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దుర్గాపూర్ మెడికల్ కాలేజీ, సౌత్ కోల్‌కతా లా కాలేజీలో ఘటనలు చూస్తే రాష్ట్రంలో శంతిభద్రతలు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. రాత్రివేళల్లో మహిళల సంచారంపై మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. మే 5 తర్వాత ఆ పరిస్థితి ఉండదని, చిన్నారి ఆడపిల్లలు కూడా ధైర్యంగా స్కూటరుపై బయటకు వస్తే ఏ దుండగుడు అడ్డుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. సోనార్ బంగ్లా కలను బీజేపీ సాకారం చేస్తుందని, బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని తిరిగి సుసంపన్న చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఖాతా కూడా తెరవదనికాంగ్రెస్ పార్టీ తమిళనాడు, పుదుచ్చేరిలో రెండంకెల స్థాయిలో కూడా సీట్లు తెచ్చుకోలేదని, బెంగాల్‌లో ఆ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితి కూడా లేదని అమిత్‌షా

## వాసుదేవరెడ్డి,ధనుంజయ రెడ్డి ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరిన సిట్

## లిక్కరు స్కాం కేసు

విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఐఏఎస్ మాజీ అధికారి ధనుంజయ రెడ్డి, ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవ రెడ్డిని ప్రాసిక్యూషన్‌కు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆయా విభాగాలకు సిట్ లేఖలు రాసింది. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే వీరిరువురినీ సిట్ అధికారులు అరెస్ట్ చేయగా... ప్రస్తుతం బెయిల్‌పై విడుదలయ్యారు. దీంతో ధనుంజయ్ రెడ్డిని ప్రాసిక్యూషన్ చేసేందుకు డీఓపీటీకి, వాసుదేవ రెడ్డిని ప్రాసిక్యూషన్ చేసేందుకు సిట్ అధికారులు. ఐఆర్‌టీఎస్‌కు లేఖ రాశారుఅవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద న్యాయవిచారణ జరపాలంటే సంబంధిత విభాగాల నుంచి అనుమతి అవసరమని సిట్ అధికారులు తెలిపారు.ఇరువురినీ ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆయా విభాగాలకు అధికారులు లేఖలను పంపించారు. లిక్కర్ కుంభకోణంలో వాసుదేవరెడ్డి ఏ2గా, ధనుంజయ్ రెడ్డి ఏ 31 నిందితులుగా ఉన్నారు.

# మూడేళ్లలో మళ్లీ వైకాపా ప్రభుత్వమే

>> గడిపారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని ఆయన స్వయంగా పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ ధైర్యంగా ఉండండి.. మీ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అంటూ భరోసా ఇచ్చారు. ఇప్పట్లకు బయలు దేరిన జగన్ మోహన్ రెడ్డికి దారి పొడవున చిన్నారులు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కాన్వాయ్ కి కోసం ఎదురు చూస్తున్న ప్రతి ఒక్క చోట ఆపి అక్కడ ఉన్న ప్రజల్ని ఆప్యాయంగా పలకరించారు. ఈ పర్యటన లో భాగంగా కడప-పార్నపల్లి రహదారిపై రాజారెడ్డి కాలనీకి చెందిన నిర్వాసితులు జగన్‌ను కలిసి తమ గోడును వినిపించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా తమ ఇళ్లు కోల్పోతున్నామని, ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.వారి సమస్యలను శ్రద్ధగా విన్న జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం పోరాటం చేద్దాం అయిన న్యాయం జరగకపోతే మూడేళ్లలో మనం అధికారంలోకి వస్తాం అప్పుడైనా తప్పకుండా న్యాయం చేస్తాం అని స్పష్టం చేశారు. అవసరమైతే బాధితుల కోసం పోరాటం చేయడానికి కూడా సిద్ధమని తెలిపారు. ఇప్పట్ల గ్రామానికి చేరుకున్న జగన్, అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఈ మధ్య మృతి చెందిన సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్ళి నివాళాలు అర్పించారు. మీ కుటుంబానికి ఎల్లపుడు అవినాష్ రెడ్డి అండగా ఉంటాడు అని మీకు ఏ సమస్య వచ్చినా మీకు న్యాయం చేస్తాడు అని అధైర్య పడవద్దు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు. అక్కడ నుంచి పులివెందులలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందుల పర్యటనలో జగన్ ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసు కోవడంపై దృష్టి సారించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రజల సమస్యలపై స్పందిస్తూ, భవిష్యత్తులో న్యాయం చేస్తానన్న హామీతో ఆయన పర్యటన రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

23-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
సప్తమి రా.8.54
పునర్వసు రా.9.01
వర్జ్యం : తె.4.47-ఉ.6.20, 2) ఉ.9.39-11.10
ు.ఉ.10.00-ఉ.10.51, 2)మ.2.56-మ.3.46
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** పెట్టుబడి పెట్టిన వారికి భోగములను ఇవ్వవలసి రావచ్చును. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**వృషభం:** ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. అనేకాంశములు అనుకూలంగా ఉండడం వలన ఉత్సహంతో కార్యసాధన చేస్తారు.

**మిథునం:** నహోన్నిన్ని, ఓర్పును కనబరుస్తారు. దృష్టికి సంబంధించిన అనారోగ్యాలను ఎదుర్కొనవలసి వస్తుంది.

**కర్కాటకం:** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**సింహం:** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. శత్రువుల నుండి రాజీయత్నములు వస్తాయి.వస్త్రలాభం.

**కన్య :** మీరు ఊహించని విధంగా ఆశ్చర్యం కలిగించే రీతిలో ఒకనొక విషయంలో లాభపడతారు. నూతన విద్యావకాశాలు కలవు.

**తుల:** మిత్రులతో స్పర్థలు ఏర్పడతాయి. జాగ్రత్తలు వహించండి. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** రొటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. ధనలాభం.

**ధనుస్సు:** ప్రతిష్టకు పోకుండా చర్చలతో సమస్యను పరిష్కరించుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్త్రలాభం.

**మకరం:** కుటుంబసభ్యుల ఆదరాభిమానాలు మీకు అండగా నిలుస్తాయి. శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

**కుంభం:** ప్రతిఫలాపేక్ష లేకుండా ఇతరులకు సహాయసహకారాలు అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం:** అదనపు ఆదాయము లభించే మార్గాలు అనుకూలిస్తాయి. నిత్యం ఆధ్యాత్మిక ప్రసంగాలు మీకు మేలు చేస్తాయి.శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

## తిరుమల సమాచారం



### శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో బుధవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులవారు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం భాష్యకార్ల నిఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో వైభవంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి ని ఒక తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.



### శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో మలయాళం సినీ నటుడు దిలీప్, సినీ నటి కావ్య మాధవన్ కుటుంబం, కన్నడ నటి శరణ్యశెట్టి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.





### తిరుచానూరు పద్మావతి ఆలయానికి ఎసిలు బహూకరణ

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి రూ. 78 వేలు విలువైన రెండు ఎయిర్ కండీషనర్ యంత్రాలను దాత అందించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు పూజ కౌశిక్, స్వాతి కౌశిక్ బుధవారం ఉదయం ఈ ఎసిలను అందజేశారు. ఆలయ ఎఇఒ దేవరాజులుకు దాతలు అందజేశారు. వీటిని ఆలయ పరాకామణి విభాగంలో వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

- రాంబిల్లిలో రెన్యువబుల్ విప్లవం ● రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్
- 2,100 మందికి ఉపాధి కల్పించేలా ఎనర్జీ ప్లాంట్ ● నేడు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన

**విజయవాడ ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పేరు మరోసారి మార్మోగ నుంది. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక వర్గాల్లో అనకాపల్లి జిల్లాపై జరిగిన చర్చ.. ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు రానుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెడుతున్న క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆ రంగానికి హై ప్రయార్టీ ఇస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగ నుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేయ నున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడను న్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో



రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

**త్వరలో రాయలసీమలో మరో భారీ ప్లాంట్:** రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ. 22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 201419 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గంలో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి.

**ఉత్తరాంధ్రలో అభివృద్ధి జోరు... పెట్టుబడుల హోరు:** కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు:** గురువారం ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## నాదెండ్ల భాస్కరరావు మృతి రాష్ట్రానికి తీరని లోటు

- వైసిపి అధినేత జగన్ సంతాపం



**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వైసిపి అధినేత జగన్ సంతాపం వ్యక్తం చేసారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్లది విశిష్ట స్థానమని కితాబు ఇచ్చారు. ఆయన రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్ను మూసారు. కొంత కాలం నుంచి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రజాసేవలో ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని, ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

# వేగవంతంగా అమరావతి పనులు

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం ● ఖనిజాల తవ్వకం, సరఫరా కోసం

### దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పనులు వేగవంతంగా పూర్తి చేయించడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణాల కోసం ఉపయోగించే ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర ఖనిజాల సరఫరాకు పాలనాపరమైన అనుమతులు వేగంగా అందించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ సంస్థలు ఆ ఖనిజాల తవ్వకం, సరఫరా కోసం దరఖాస్తుచేసిన తర్వాత గరిష్ఠంగా వారం రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు ఇచ్చేలా నిబంధనలను సులభతరం చేస్తూ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు (జీఓ 84) జారీ చేశారు. గతంలో అంటే 2016-17లో ఖనిజాల అనుమతుల కోసం నిర్దేశించిన గడువు చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికీ ఆ ఉత్తర్వులే అమల్లో ఉండటం వల్ల అమరావతి నిర్మాణంలో పాలుపంచుకొంటున్న కంపెనీలు ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకుంటే అన్నిరకాల అనుమతులు, ఎన్‌ఓసిలు ఇవ్వడానికి కనీసం మూడు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. దీంతో సకాలంలో మెటీరియల్ అందక నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. దీన్ని గుర్తించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమైన కంపెనీలు ఖనిజాల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వారం రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో అధికారులకు సూచించారు. ఎర్రమట్టి, రోడ్‌మెటల్, ఇసుక, ఇతర ఖనిజాల తవ్వకం, రవాణా కోరుతూ నిర్మాణ సంస్థల నుంచి వచ్చే దరఖాస్తులను కనీసం 15 రోజుల్లోగా జిల్లా గనుల సహాయక అధికారి పరిశీలించే గడువు ఉండేది. దాన్ని 2 రోజులకే కుదించారు. మైనింగ్ దరఖాస్తు రాగానే, అది ఏ ప్రాంతం పరిధిలోకి వస్తుందో చూసి సంబంధిత తహశీల్దార్‌కు ఒక్క రోజులోనే పంపించాలి. నిరభ్యంతర పత్రం జారీకి అవసరమైన నివేదికను తహశీల్దార్ కేవలం3రోజుల్లోనే గనుల శాఖకు పంపించాలి. ఇంతకు ముందు 20 రోజుల గడువు ఉండేది. మైనింగ్ దరఖాస్తుపై సర్వే, తనిఖీ నివేదికను 3రోజుల్లో, డీఎంజీఓస్థాయిలో ప్రాసెసింగ్‌కు మరో మూడు రోజుల గడువు ఇచ్చారు. జిల్లా ఎడి, డిడి నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి 3 రోజుల్లోనే మైనింగ్‌కు సిఫారసు చేయాలి. ఆ తర్వాత మైనింగ్‌ప్లాన్‌ను వారం రోజుల్లోనే ఆమోదించాలి. ఇక రాష్ట్ర స్థాయిలో ఇచ్చే ఎన్‌ఓసీని 5 రోజుల్లో, మైనింగ్ ఆర్డర్‌ను 2 రోజుల్లోనే ఇవ్వాలని ప్రభుత్వం



కొత్త గడువు నిర్దేశించింది. అంటే, ఏ స్థాయిలోనైనా దరఖాస్తులు వారం రోజుల్లోపే పూర్తి కావాలి. మండల, జిల్లా స్థాయిలో గరిష్ఠంగా మూడు రోజులకు మించి దరఖాస్తును అట్టిపెట్టుకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దిశగా గనుల శాఖ డైరెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. 2016-17లో ఖనిజాల అనుమతుల కోసం నిర్దేశించిన గడువు చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికీ ఆ ఉత్తర్వులే అమల్లో ఉండటం వల్ల అమరావతి నిర్మాణంలో పాలుపంచుకొంటున్న కంపెనీలు ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకుంటే అన్నిరకాల అనుమతులు, ఎన్‌ఓసీలు ఇవ్వడానికి కనీసం మూడు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. దీంతో సకాలంలో మెటీరియల్ అందక నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. దీన్ని గుర్తించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమైన కంపెనీలు ఖనిజాల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వారం రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో ముఖేశ్‌కుమార్ మీనా రాజధాని నిర్మాణ పనులు చేస్తున్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. ఇందులో ఖనిజాల తవ్వకం, రవాణా అనుమతుల్లో నెలకొంటున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. అనుమతులను సులభతరం చేసే అంశంపై గనుల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి నూతన విధివిధానాలు రూపొందించారు.



## పోలవరం గరిష్ట ఎత్తు 45.72 మీటర్లు

- 194.60 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం
- పిపిఎ అధికారిక ప్రకటన

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న అనుమానాలకు తెరపడింది. ప్రాజెక్టును నిర్దేశిత పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పిపిఎ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి విఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పిపిఎ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టిఎంసిల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ.28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

# పిఏసి 1 సముదాయం... ఆస్థాన మండపాల ఆధునీకరణ

- శ్రీవారి సేవకు వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు
- టిటిడి ఇఒ రవిచంద్ర

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో పాతబడిన యాత్రికుల వసతి సముదాయం-1తోబాటు ఆలయానికి ఎదురుగా ఉన్న ఆస్థానమండపం భవనాల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేయాలని అన్నారు. భక్తుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని ఇఒ సూచించారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని తెలిపారు. టిటిడి పరిపాలన భవనంలో బుధవారం మధ్యాహ్నం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు తిరుమల, తిరుపతిలో మరింత మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని ఇఒ రవిచంద్ర సూచించారు. ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడం లేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా తిరుపతిలో వసతి సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు, ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారీ చేయాలని ఆదేశించారు. తిరుమలలో నెయ్యి నిల్వ ట్యాంకులు, ముడి సరుకుల గోదాముల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త గోదాములు నిర్మించాలని, పెండింగ్ వ్యర్థాలను త్వరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇతర ఆలయాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్ఒ డాక్టర్ రవికి సూచనలు చేశారు. భవిష్యత్తులో వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ నిపుణుల సేవలను వినియోగించుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఇంకా టిటిడి కళ్యాణ మండపాల నిర్వహణ, ఎస్‌విబిసి, స్విమ్స్, ఎఫ్ఎంఎస్, వసతి గృహాలు, ఎస్ఎస్‌డి, ఎస్ఇడి, శ్రీవాణి దర్శనం టికెట్ల జారీ తదితర అంశాలపై లోతుగా చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, అదనపు ఎఫ్.ఎ.సి.ఎ.ఒ రవిప్రసాద్, ఇంఛార్జి న్యాయాధికారి వెంకట సుబ్బానాయుడు పాల్గొన్నారు.



## ఇళ్ల నిర్మాణదారులకు ఊరట విఎల్‌టిపై 50శాతం రాయితీ

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇళ్లు, భవనాలు నిర్మించుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. నిర్మాణ సమయంలో ఖాళీ స్థలాలపై విధించే పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్: విఎల్‌టి)ను 50శాతం తగ్గిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల పరిధిలో అనుమతి పొందిన అన్ని నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఏటా ప్రజలపై పడే రూ.30 కోట్ల ఆర్థిక భారం తగ్గనుంది. ఇళ్లు లేదా వాణిజ్య భవనాలు నిర్మించడానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నప్పటికీ, నిర్మాణ కాలంలో అధికారులు మళ్లీ ఖాళీ స్థలం పన్ను విధించడం ప్రజలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రజలతో పాటు రియల్ ఎస్టేట్ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ పన్నును సగానికి తగ్గించాలని నిర్ణయించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందిన రోజు నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే వరకు లేదా అనుమతి గడువు ముగిసే వరకు (వీటిలో ఏది ముందైతే అది) ఈ 50 శాతం పన్ను తగ్గింపు వర్తిస్తుంది. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పన్ను తగ్గింపునకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు అధికారిక జీవోను విడుదల చేసింది. వాస్తవానికి వీఎల్‌టీ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు ఏటా సుమారు రూ.60 కోట్ల ఆదాయం సమకూరేది. తాజా తగ్గింపుతో ఈ ఆదాయం రూ.30 కోట్లకు పరిమితం కానుంది.

# మూడేళ్ల కిందటి నోటిఫికేషన్‌పై ప్రేమెందుకో!?

- వైసిపి నేతల ధోరణితో టిటిడి బోర్డు రాజీపడిందా!? ● టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీపై వీడని అనుమానాలు
- సిఎం జోక్యం చేసుకోవాలని అభ్యర్థనలు

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో ఆలోచనలు ఉండాలని, వినూత్న విధానాలు అమలుకావాలని పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు హితోక్తులు టిటిడి అధికారులకు చెవికెక్కడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాలు మారినపుడు నియామకమైన అధికారులు భక్తులకు మెరుగైన సేవలు,సౌకర్యాలు కల్పించేందుకు వినూత్నంగా ఉండాలని గతంలో సిఎం హెచ్చరించారు. అయినా టిటిడి అధికారుల్లో మాత్రం అలాంటివేమీ కనిపించడంలేదనే తెలుస్తోంది. ఎప్పుడో మూడు సంవత్సరాల క్రిందట 2023 నవంబర్ 23న టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 56 టెక్నికల్ ఉద్యోగాలకు టిటిడి నోటిఫికేషన్ వెలువడించింది. ఇందులో 17 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 10 అసిస్టెంట్ ఇంజినీర్, 19 అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, వైసిపి టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో టిటిడి-99021(31), /33/ 2023- ఆర్ఇసిటిఎస్ ఎస్ఇసి-టిటిడి జిఒతో ఎలక్ట్రికల్ విభాగంలో హిందువులైన అభ్యర్థులతో నాలుగు ఎఇఇ పోస్టులు, 46 ఎఇ, టెక్నికల్ అసిస్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పట్లో ఈ పోస్టుల భర్తీలో ఏకంగా ఓ కాంట్రాక్టర్ తనదైన శైలిలో అభ్యర్థుల నుండి బేరం మాట్లాడుకుని రూ.50లక్షల వరకు నిర్ణయించి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. దీంతో అప్పటి టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఈ ఉద్యోగాల భర్తీని నిలుపుదల చేశారు. ఆ తరువాత 2024 మేలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో టిడిపి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అప్పటి నుండి గత మూడేళ్ళుగా ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ చెత్తబుట్టలో చేరింది. ఇదే సందర్భంలో గత ఏడాది నవంబర్‌లో "డయల్ యువర్ ఇఒ" కార్యక్రమంలో కొందరు ఇంజనీరింగ్ అభ్యర్థులు పోస్టుల భర్తీగురించి అడిగారు. దీనిపై అప్పటి ఇఒ సింఘాల్ కూడా తమ అధికారులతో చర్చించి వివరాలు తెలియజేస్తామన్నారు. ఇలా పుణ్యకాలం గడచిపోవడంతో ఇప్పుడు మళ్ళీ 2023 నోటిఫికేషన్‌తోనే ఆ ఎఇఇ పోస్టుల భర్తీకి, టెక్నికల్ అధికారులు, ఎఇల పోస్టుల భర్తీకి ప్రస్తుత టిటిడి బోర్డు, ఇఒ, అదనపు ఇఒ కూడా సుముఖంగానే ఉన్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ నోటిఫికేషన్‌కు గడువు ముగియడం, 2023లో తయారుచేసిన ప్రశ్నాపత్రం కూడా లీకైందనేది టిటిడిలో పెద్ద దుమారంగా మారింది. ఈ సమయంలో పాత నోటిఫికేషన్‌తోనే ఓ కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు ఓ అధికారి తెరవెనుక రాజకీయంతో వైసిపికి వీరవిధేయులైన వాళ్ళు చెప్పినట్లు తాజా బోర్డు, టిటిడి ఇఒ కూడా సుముఖంగా ఉండటం వెనుక మతలబు ఏంటనేది అర్థంకావడం లేదు. పైగా 2025లో జోనల్ వారీగా విభజన చేయడంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాల భర్తీ జోన్ ప్రకారం చేపడితే రాయలసీమ వాసులకు న్యాయం జరుగుతుందనేది టిటిడి వర్గాల వాదన.

**పాత నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్:** 2023లో భూమన కరుణాకర్ రెడ్డి ఛైర్మన్ గాఉన్న సమయంలో నిర్వహించాల్సిన ఇంజినీర్ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌కు ఇప్పుడు ఛైర్మన్ బి ఆర్ నాయుడు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. దీని వల్ల రాయలసీమ ప్రాంత నిరుద్యోగులు నష్ట పోయే అవకాశాలు ఉన్నాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. 2023 నవంబర్ 23న టిటిడి నోటిఫికేషన్ తరువాత ఆగిపోయింది. రాష్ట్ర స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అయితే కొంత మంది ముందుగానే ఉద్యోగార్థుల పోస్టుకు రూ.50 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు అదే నోటిఫికేషన్‌పై 2023 దరఖాస్తుదారులకు రానున్న మే 10వ తేదీన రాత పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పాత నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తే జోన్ వైస్ పోస్ట్ భర్తీకి విఘాతం కలుగుతోంది. దీనివల్ల రాయలసీమ, తిరుపతి జిల్లాకు చాలా నష్టం కలుగుతుంది. టిటిడిలోని కొందరు కోస్తా అధికారులు తెలివిగా ఎపి మొత్తం ఒకేలా అవకాశం కల్పిస్తున్నారని అంటున్నారు. అలా అయితే దేశవ్యాప్తంగా కూడా ఇవ్వాలి అంటూ కొందరు కొత్త వాదన వినిపిస్తున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో పాత నోటిఫికేషన్ రద్దు చేసి ప్రభుత్వ కొత్త జిఒ ప్రకారం లోకల్ రిజర్వేషన్ అమలు చేస్తూ కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం జోన్ వైస్ ఇస్తే రాయలసీమకు, ముఖ్యంగా తిరుపతి వాసులకు అందరితో బాటు 2024, 2025 సంవత్సరం పాస్ అయిన బిటెక్ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు. 2023లో ప్రిపేర్ చేసిన ప్రశ్న పత్రం ఇచ్చి, అప్పుడు అప్లై చేసిన వాళ్ళకే అవకాశం ఇవ్వడం పారదర్శకతకు తూట్లు పొడిచినట్టే అంటున్నారు. కాబట్టి జోనల్ వ్యవస్థ ఆధారంగా 2023, 2024, 2025లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టాలని నిరుద్యోగ ఇంజనీర్లు కోరుతున్నారు.

వార్త

అనుభవించడం కంటే అనుభవం కోసం ఎదురు చూడటంలోనే మనిషి జీవితం ఎక్కువ కాలం గడిచిపోతుంది.

-వోల్టేర్

# ఎంతకాలమీ ప్రతిష్టంభన?

పశ్చిమాసియా యుద్ధానికి 'కాల్పుల విరమణ' గడువు బుధవారంతో ముగియనుండగా 'ఇక సమయం లేదు మిత్రమా! అమీ తుమీ' తేల్చుకోండని శ్వేత సౌధాధినేత ట్రంప్ అల్టిమేటమ్ జారీ చేశారు. అయినా కాస్త తగ్గి మరోసారి గడువు పెంచారు. హార్మూజ్ జల సంధిని అష్ట దిగ్బంధనం చేయగలిగామని చెప్పుకుంటున్న అమెరికా ఇరాన్‌ను భయపెట్టగలిగిందేమీ లేదు. అమెరికా, ఇరాన్ రెండో దఫా చర్చలపై సందిగ్ధత తొలగినా కొంత కాలం ఉత్కంఠ తప్పదు. అవసరమైతే ఇస్లామాబాద్‌లో జరిగే చర్చలకు తానే స్వయంగా హాజరవుతానని ట్రంప్ చెబుతున్నారు. ఇరుపక్షాల మధ్య 'గొంతెమ్మ కోరిక'లకు పరిష్కార మార్గాలు, వాటికి ప్రత్యామ్నాయాలు కరువైన పరిస్థితుల్లో ఎవరు చర్చల్లో దిగినా మరింత ప్రతిష్టంభనే తప్ప ఏమీ ఉండదు. అమెరికా ఒక్క అడుగు వెనక్కి వేయదు. ఇరాన్ 'రాజీ' పడదు. పైగా కీలక సమయంలో మొండికేస్తోంది. మళ్లీ మళ్లీ చర్చలంటే తమకిష్టం లేదని చర్చలు ఫలవంతమవ్వాలని చిత్తశుద్ధి ఉంటేనే ఆలోచి స్తామంటోంది ఇరాన్. ఈసారి కూడా ఒప్పందం కుదరక పోతే ఇక బాంబుల దాడి తప్పదంటోన్న ట్రంప్ ఇరాన్‌తో మళ్లీ కఠినవైఖరితోనే ఉన్నారు. తాజాగా హార్మూజ్ జల సంధిని అంతర్జాతీయ ప్రయోజనాల రీత్యా తెరిచే ఉంచాలని చైనా అధినేత జిన్‌పింగ్ ఇరాన్‌కు హితవు చెబుతున్నారు. అడుగుఅడుగుకీ ఆటంకాలు తెచ్చిపెడు తున్న ట్రంప్ వాచాలతను ఎవరూ కట్టడి చేయలేకపోవడం విచారకరం. ఇరాన్‌లో 8 మంది మహిళలను ఉరికంబ మెక్కిస్తున్న తరుణంలో ట్రంప్ వారిని ఉరితీయకుండా ఉండటం తమకు, తమతో చర్చలకు సుహృద్భావ వాతా వరణం కల్పించినట్లవుతుందని ఇరాన్‌కు సందేశం పంపారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య 'హార్మూజ్' చిచ్చు ఇంకా ఆగలేదు. హార్మూజ్ జలసంధి దిగ్బంధంలో అమెరికా తమ కార్గోనౌకపై దాడి చేసి స్వాధీనం చేసు కొన్నామన్న ప్రకటనతో ఇరాన్ దాదాపు తల్లడిల్లిపోయింది. ఇరాన్ తన శాంతిచర్చల బృందాన్ని ఇస్లామాబాద్‌కు పంపబోమని తెగేసి చెప్పింది. ఇప్పటికే అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం సర్వత్రా మంచిదని కొన్ని దేశాలు తమకు సానుకూలంగా స్పందించే దేశాలకు హితవు చెప్పడం ప్రారంభించాయి. హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకను అమెరికా తమ ఆధీనంలోకి తీసుకోవడం ఇరాన్‌కు రుచించడం లేదు. ఇవన్నీ ప్రతిష్టంభన పరిస్థితు ల్లోకి నెట్టివేసాయంటోంది ఇరాన్. అందుకే ఈ సారి గడవుకు పాక్ అభ్యర్థించింది. ఇండోనేషియా, శ్రీలంక మధ్యన హిందూ మహాసముద్ర జలాల్లో అమెరికా స్వాధీనం చేసుకున్న ఇరాన్ నౌక ఎంటీ టిఫానీ నౌకను ఇంతదాక ఇరాన్‌కు విడుదల చేయకపోవడం కూడా వారి ఆగ్రహావేశాలకు దారితీసింది. అందుకే ఇరాన్ లొంగి రావడం లేదు. యుద్ధ వ్యూహాలు పన్నడం అటుంచి శాంతి చర్చల విషయంలో ఇరాన్ మెట్టు దిగకపోవడం అమెరికాను నమ్మకలేకపోవడమే. అమెరికా అల్టిమేటంను ఖాతరు చేయకుండా ఇరాన్ మొండికేయటంతో ఇక చేసేది లేక ట్రంప్ గడువు సమయాన్ని పెంచారు. మలి విడత చర్చలకు మరోగడువు దొరకడంతో శాంతిచర్చల బృందాలు ఊపిరి పీల్చుకున్నాయి. టెహ్రాన్‌ను ఒప్పించేందుకు పాక్ ప్రతినిధులు చేయని ప్రయత్నం లేదు. ట్రంపే స్వయంగా గడువును పొడిగించడంతో అమెరికా బాంబులకు ప్రస్తుతా నికి పనిలేకుండాపోయింది. శాశ్వత శాంతి ఒప్పందం దిశగా చర్చలను తీసుకెళ్లాలని మధ్యవర్తిత్వ దేశం పాక్ ఉవ్విళ్లూరుతోంది. ప్రపంచ శాంతికి, చమురుధరలు ప్రజ్వలనం కాకుండా చూసామన్న ఖ్యాతి తమకే దక్కాలనీ పాక్ ఎదురుచూస్తోంది. పాక్ ఇప్పటికీ ఆశావహదృక్పథం తోనే ఉంది. ఈసారి రణరంగంలో కొత్త షాకులియ్యాలని ఎదురుచూస్తున్న టెహ్రాన్ పెద్దలు 'కాల్పుల విరమణ' గడువు పొడిగించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోపక్క హార్మూజ్ జలసంధి వద్ద అమెరికా స్వాధీనం చేసుకున్న 'తౌస్కా' నౌకలో క్షిపణుల తయారీ రసాయనాలు ఉన్నా యంటూ ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ చైనా నుంచి ఇరాన్‌కు అందుతున్నక్షిపణులేనని ఆరోపించారు. ఏ విధంగానూ నిజనిరూపణలేకుండా ఇరాన్‌కు చైనా యుద్ధ వనరులను, పరికరాలను అందిస్తోందని తెలియచెప్పడానికి వ్యూహం పన్నారు. అంతేకాదు హిందూ మహాసముద్రంలో అమెరికా ఇరాన్ నౌకను స్వాధీనం చేసుకోవడంలో తప్పే మీ లేదని చెప్పుకోవడమే దీని నేపథ్యం. కాగా హార్మూజ్ లో ఇరాన్ దాడులతో పరిస్థితి అల్లకల్లోలంగా తయారైంది. ఒమన్ వైపు వెళ్లే నౌకలపై దాడులు జరిగాయి. మరో కార్గోషిప్‌పై కూడా ఇరాన్ సేనలు విధ్వంసానికి ఒడిగట్టా యి. పశ్చిమాసియా యుద్ధం సత్వర పరిష్కారం జరిగితే తప్ప ప్రతిష్టంభన తొలగే ఛాయలు కనపడటం లేదు. ఇరాన్ స్పందించకున్నా మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకి స్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారంటే తాత్కాలికంగానైనా ఇక యుద్ధం ఆగినట్లు భావించాలి. హార్మూజ్ జలసంధి, ఖర్గ్ ద్వీపం మీద కన్నేయడంతో ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. హార్మూజ్‌పై అమెరికా దిగ్బంధనం అలాగే ఉంటుందని ట్రంప్ అంటుండగా ఇరాన్ మాత్రం అమెరికా సైన్యాన్ని అక్కడ్నించి ఉపసంహరించుకుంటే తప్ప చర్చలకు రాబో మని ఇరాక్ విదేశాంగ ప్రతినిధి స్పష్టం చేశారు. ఇలాగైతే చర్చలపై ప్రతిష్టంభన ఎంతకాలం ఉంటుందో ఊహకంద దు. ఇరాన్‌ను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న ట్రంప్ కూడా సామరస్యంగా వ్యవహరించాల్సిన అవసరం కనపడుతోంది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## ప్రాణాలకు ముప్పు

భారతదేశంలో బాణసంచా తయారీ కేంద్రాలలో తరచు గా సంభవిస్తున్నపేలుళ్లు సామాన్యుల ప్రాణాలకు ముప్పు గా పరిణమించాయి. దేశవ్యాప్తంగా గతఐదేళ్లలో సుమారు 180ప్రమాదాలు జరగగా, 480 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఈ వినాశనానికి కేంద్ర బిందువుగా మారింది. 2022-2025 మధ్య ఇక్కడ 89 సంఘటనలు జరిగి 134 మంది మరణించడం వ్యవస్థీకృత వైఫల్యానికి నిద ర్శనం. లాభార్జనే ధ్యేయంగా భద్రతా ప్రమాణాలను విస్మ రించడం, అనుమతించిన పరిమితికి మించి కార్మికులను వినియోగించడం, నిషేధిత రసాయనాల వాడకం ఈ ఘోరాలకు ప్రధాన కారణాలు. అనుమతి ఉన్న కేంద్రాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో పనులు నిర్వహించడం, ముడి సరుకులను భారీగా నిల్వ ఉంచడం యజమానుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్, ఎస్సి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండలతహసిల్దార్ అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రతి గ్రామం లోనిదళిత కమ్యూనిటీ ప్రజల ఆధ్వర్యంలో దళిత గ్రామ అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలి. నూతనసంస్కరణలో భాగంగా గ్రామాలలో ఆర్థి కంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన దళితుల అభివృద్ధి కోసం దళిత అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఆకమిటీలలో విద్యావంతులు, మహిళలు, యువ కులు, దళిత ఉద్యోగి ఒకరు ఉండేవిధంగా, దళిత కాలనీ లలో మౌలిక వసతులు అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ, అసైన్డ్ భూముల అభివృద్ధికి కృషి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## మహనీయుల పుస్తకాలను అందిద్దాం

వేసవి కాల దృష్ట్యా మన ఇంట్లో ఉండే పిల్లలు దాదాపు బయటికి వెళ్ళే అవకాశాలు చాలాతక్కువ. ఇలాంటి సమ యంలో రోజులుకాసేపు మీపిల్లలకు మహనీయుల జీవిత పుస్తకాలను మీరే దగ్గరుండి చదివించండి. జ్ఞానం, కుల వివక్ష, అసమానతల, ప్రశ్నించేతత్వం సమాజం పట్ల అవ గాహన కల్పించిన వారు అవుతారు. ఒక తల్లిదండ్రులుగా నేర్పించాల్సిన బాధ్యత మిది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో ఏదైనా పుస్తకము కావాలని వెళితే ఆ పుస్తకము అక్కడ ఉన్నదీ లేనిది తెలియదు. కేట లాగ్ ఉండదు. వెతుక్కోవాలి. ఏబీరువాలో ఉంటుందో తెలి యదు. అసలు ఉన్నదీ లేనిదీ తెలియదు. ఏదొక పుస్తకం తెచ్చు కోవలసి వస్తుంది. ఆ బీరువాలో పుస్తకాలు గందరగోళంగా ఉంటాయి. వరుసలో ఉండవు. అటుఇటు ఇటు అటు. పుస్తకం మీద పేరు ఉండదు. పేరు కావాలంటే పుస్తకం తెరిచి చూసుకోవాలి. మనం కట్టే పన్నుల్లో లైబ్రరీ టాక్స్ ఉంటుంది. సరిగా చూడవలసిన బాధ్యత ఆ స్టాఫ్‌కు ఉంది. గ్రంథాల యంలోఎన్నిపుస్తకాలు ఉన్నాయి? కేటలాగ్ ఉండాలి. దానిలో చూపినవిధంగా వరుస క్రమంలో ఉండాలి. ప్రతి పుస్తకం అట్ట మీద పుస్తకం పేరు, రచయిత పేరు, సీరియల్ నంబరు ఉం డాలి. వేటపాలెం సారస్వత గ్రంథాలయంలోకి వెళ్ళి మనకు కావలసిన పుస్తకాన్ని రెండు నిమిషాలలో తీసుకోవచ్చు.

- నార్నే వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచాలి

ఉభయ రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులకు త్వరలో వేసవి సెలవులురానున్నవి. ఈసమయాన్ని రాబోయేతరగతిలోవారికి ఏదైనా అంశాలు అవగాహన లేని వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గణితం, తెలుగు వ్యాకరణం, ఆంగ్ల వ్యాకరణం తృప్తిగా అర్థమయ్యే విధంగా తల్లితండ్రులు, లేదా మిత్రుల సహకారంతో పునాది వేసుకోవాలి. విజ్ఞాన శాస్త్రం పాఠంలో సందేహాలు, ప్రశ్నలు రాసుకొని సందేహాలను తప్పక నివృత్తి చేసుకోవాలి. ఇవన్నీ చేసేందుకు విద్యార్థులకు ఉత్తమ కాలం, అదనంగా పత్రిక పఠనం, నీతి కథలు, చిత్రలేఖనం, దస్తూర్తి మెరుగుపరచడంతప్పకచేయాలి. కాస్తసమయం ఆటల్లో పాల్గొ నాలి. వీటి అమలుకు తల్లితండ్రులే ప్రధాన పాత్రధారులు.

- బొల్లోజు మేఘనదాం, విశాఖపట్నం

## సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపో యింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తిచెందడానికి సోషల్‌మీడియా వేదిక అవుతోంది. నిజానిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విపత్తు నివారణకు మరిన్ని జాగ్రత్తలు

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమ న్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్య వేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే, ఆనష్టాన్ని పూడ్చు కోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీయంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం.**

డి. అశోక్

ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కంటే, అవి రాకముందే అప్రమత్తం కావడం నాగరిక సమాజ లక్షణం. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు మునుపెన్నడూ లేని విధంగా ఒక గడ్డు కాలం ఎదురుకాబో తోందని స్పష్టమవుతోంది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు మొహం చాటేసే ప్రమాదం ఉందని, వేసవి ఉష్ణోగ్రతలు ఆకాశాన్ని తాకనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. 2026లో నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కు వగా, కేవలం 92 శాతం మేరకే ఉండవచ్చుననే అంచనా ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా జూన్ మొదటి వారం లో పలకరించే రుతుపవనాలు ఈసారి ఆలస్యంగా వచ్చే అవకాశం ఉండటమే కాకుండా, అవి అత్యంత బలహీనంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల కేవలం వర్షాలు తగ్గడం మాత్రమే కాదు, సుదీర్ఘ కాలం పాటు వేడి, ఉక్క పోత కొనసాగి జనజీవనాన్ని అతలాకుతలం చేసే ముప్పు ఉంది. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోవడం అన్న సామెతను గుర్తు చేసుకుంటూ, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణకు దిగాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్ప డింది. లేదంటే అటు వ్యవసాయ రంగం, ఇటు ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే పరిణామాలు గొలుసుకట్టు సమస్యలను సృష్టిస్తాయి. రుతుపవనాల రాక ఆలస్యమైతే అస్థిరమైన వాతావరణం ఏర్పడి, ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. కడప, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటడం రాబోయే తీవ్రతకునిదర్శనం. తెలంగాణ లోనూ జగిత్యాల, ఆదిలాబాద్, నల్గొండ వంటి జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ ఎండల వల్ల వాతా వరణంలో విద్యుత్ అయస్కాంత మార్పులు సంభవించి పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా పిడుగుల బారిన పడి మరణించిన వారి సంఖ్య 2,560గా ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి సుమారు 150 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వర్షం రాగానే చెట్ల కిందకు వెళ్ల డం వల్ల ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఏడాది పిడుగుల ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందన్న అంచ నాల దృష్ట్యా, గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత కీలకం. కేవలం ప్రాణ నష్టం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనంఉండదు, ప్రాణాలు పోకుండా రక్షించే సాంకేతికతను, హెచ్చరికలను క్షేత్రస్థాయికి చేరవేయడమే అసలైన పరిష్కారం. మరోవైపు, వర్షపాతం తగ్గడం వల్ల నీటిఎద్దడి సమస్య భూతంలా విరు చుకుపడే అవకాశం ఉంది. ఏప్రిల్ మాసం నాటికే కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ప్రధాన జలా శయాల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోయా యి. శ్రీశైలంలో కేవలం 15శాతం నిల్వలు మాత్రమేఉండటం రాబోయే జల సంక్షోభానికి సంకేతం. వర్షాలు సమయానికి కురవకపోతే సాగునీటి మాట పక్కన పెడితే, కనీసం తాగు



నీటి సరఫరాకు కూడా ఇబ్బందులు తప్పవు. దీనివల్ల నగ రాల్లోనూ, గ్రామాల్లోనూ ప్రజలు నీటిచుక్క కోసం అల్లా డాల్సి వస్తుంది. భూగర్భ జల మట్టాలు కూడా పడిపోతుం డటంతో బోరుబావులపై ఆధారపడటం కష్టతరమవుతుంది. జల వనరుల నిర్వహణలో ఇప్పటి నుంచే పొదుపు చర్యలు పాటించకపోతే, వేసవి చివరలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. నీటి వినియోగంపై ప్రజల్లో చైతన్యం తేవ డంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యత క్రమంలో తాగునీటి అవసరాలకు కేటాయించే ప్రణాళికలను పాలకులు సిద్ధం చేసుకోవాలి. ఈప్రకృతి వైపరీత్యాల ప్రభా వం అన్నింటికంటే ఎక్కువగా రైతాంగంపైనే పడుతుంది. జూన్ నెలలో సాధారణంగా ఖరీఫ్ పనులు ప్రారంభం కావాలి. కానీ రుతుపవనాల అనిశ్చితి వల్ల విత్తనాలు విత్తడం ఆలస్యమవుతుంది. ఇది పంటల దిగుబడిపై నేరుగా ప్రభావం చూపుతుంది. రైతులు వానాకాలం పంటల కోసం ఆకాశం వైపు చూడటం, చివరకు గత్యంతరం లేక బోరు బావుల కింద పంటలు వేయడం వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో రైతులు, కూలీలు ఆరుబయట పని చేయడం వారి శారీరక శక్తిని హరిస్తుంది. వడదెబ్బ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ ఈ పరిస్థితులను గమనించి, తక్కువ నీటితో పండే పంటల గురించి, వర్షాలు ఆలస్య మైతే అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల గురించి రైతులకు ముందే దిశానిర్దేశం చేయాలి. విత్తనాలు, ఎరువుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడ టం యంత్రాంగం బాధ్యత. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే మార్కెట్‌లో ధరలు పెరిగి సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుంది, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వాల స్పందన కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలు ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు చేరువ కావాలి. స్మార్ట్‌ఫోన్ల యుగంలో కూడా సమాచారం సకాలంలో అందకపోవడం విచారకరం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో ఉపాధి హామీ కూలీలకు పనివేళలు మార్చడం, వారు విశ్రాంతి తీసుకోవడానికి పని స్థలాల్లో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం వంటి చిన్న చర్యలు కూడా ఎంతో మంది ప్రాణాలను కాపాడతాయి. ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డులను సిద్ధం చేయాలి. అలాగే పిడుగుల నుండి రక్షణ పొందే మార్గాలపై విస్తృత ప్రచారం జరగాలి. ఉరుములు మెరుపులు వచ్చే సమయంలో పొలా ల్లో ఉండకూడదని, ఒంటరిగా ఉన్న చెట్ల కిందకు చేరకూడ దని ప్రజలకు పదేపదే వివరించాలి. సాంకేతికతను ఉపయో గించుకుని స్థానిక భాషలోఎప్పటికప్పుడు హెచ్చరికలు పంపే వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేం కానీ, వాటి వల్ల కలిగే నష్టాన్ని మాత్రం ముందస్తు జాగ్రత్తలతో తగ్గించగలం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమ న్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్య వేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే, ఆనష్టాన్ని పూడ్చు కోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీ యంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం. ●

# నయా నైపుణ్యాలే ఉద్యోగావకాశాలకు మార్గం

ఉదయ్ కుమార్

తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఐటీ రంగం ప్రస్తుతం ఒక కీలక మార్పు దశలో కొనసాగు తోంది. ఒకవైపు వృద్ధి కొనసాగుతుండగా, మరోవైపు ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోంది. ఈ పరిస్థితి ఉద్యోగార్థులకు ఒకేసారి అవకాశాలు, సవాళ్లు రెండింటినీ తీసుకువస్తోంది. వృద్ధి కొనసాగుతోంది - కానీ రూపాంత రం చెందుతోంది. తెలంగాణలో ఐటీ ఎగుమతులు సుమారు 3.6లక్షల కోట్ల స్థాయికి చేరుకోవడం ఈ రంగం బలాన్ని ప్రతిబింబిస్తోంది. హైదరాబాద్‌లో 400కు పైగా గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు పనిచేస్తుండటం, కొత్త పెట్టు బడులు ఆకర్షితమవడం ఐటీ రంగం ఇంకా విస్తరిస్తోంద నడానికి సంకేతాలు. రాష్ట్ర ప్రభుత్వం 2026 నాటికి మరిన్ని గ్లోబల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో సుమారు 1.2 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా. పలుకంపెనీలు ఇటీవల హైద రాబాద్‌లో నూతనంగా తమ కార్యకలాపాలను విస్తరించ డం ప్రారంభించాయి. కొన్ని సంస్థలు వేల సంఖ్యలో టెక్నాలజీ ఉద్యోగులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. అయితే గతంతో పోలిస్తే నియామ కాలు ఇప్పుడు మరింత ఎంపికాత్మకంగా మారాయి. డిగ్రీ తో పాటు నైపుణ్యాలు, అనుభవం, బహుళ సామర్థ్యాలు ఉన్నవారికే ప్రముఖ కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రస్తుతం ఐటీ రంగంలో అధిక డిమాండ్ ఉన్న విభాగా లుగా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మెషీన్ లెర్నింగ్ (ఎమ్ఎల్), డేటా ఎనాలసిస్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత వంటి రంగాల్లో నైపుణ్యాలు ఉన్నవారికి అధిక అవకాశాలు, మంచి వేతనాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎఐ ఆధారిత ఉద్యో గాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న ఉద్యోగా లుగానూ, ఈ రంగం వేగంగా విస్తరిస్తున్న విభాగంగా వృద్ధి చెందుతోంది. అయితే ప్రస్తుతం ఇప్పటి వరకూ అనుభవం లేకుండా కొత్తగా ఉద్యోగం కోసం ప్రయత్నించే




వారికి పరిస్థితి కాస్త కఠినంగా మారింది. ఎంట్రీలెవెల్ ఉద్యోగాలు తగ్గడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పరిమితం కావడం, అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వ డం వంటి పరిణామాలు ఎక్కువ చోట్ల కనిపిస్తున్నాయి. అయితే ప్రాజెక్ట్ అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఇంకా అందుబాటులోనే ఉన్నాయని చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. అమెజాన్, ఒరాకిల్, సేల్స్ ఫోర్స్, అట్లాసియన్ వంటి సంస్థలు వేలసంఖ్యలో ఉద్యో గులను తగ్గించాయి. అలాగే మరికొన్ని కంపెనీలు కూడా ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు సూచిస్తు న్నాయి. 2026 తొలి త్రైమాసికంలోనే ప్రపంచవ్యాప్తంగా 70-80 వేల మంది టెక్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పో యినట్లు అంచనా. కాగా ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు గా కోవిడ్ కాలంలో అధిక నియామకాలు, గ్లోబల్ ఆర్థిక మందగమనం, ఆటోమేషన్, ఎఐ వినియోగం పెరగడం వంటివేనని చెప్పవచ్చు. భారతదేశం గ్లోబల్ ఐటీ ఔట్ సోర్సింగ్ కేంద్రంగా ఉండటం వల్ల అంతర్జాతీయ పరిణా మాల ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. ఫ్రెషర్స్ నియా మకాలు తగ్గడం, వేతనాల పెరుగుదల మందగించడం, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగార్థులు కంపె నీల అవసరాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అను గుణంగా తమను తాము మార్చుకోవాల్సినఅవసరం ఉంది. ఈ మేరకు కొత్త టెక్నాలజీలపై నిరంతర అభ్యాసం, ప్రాజెక్ట్ అనుభవం పెంపొందించుకోవడం, బహుళ నైపుణ్యాలు సాధించడం ద్వారా ఉద్యోగార్థులు అవకాశాలను మెరుగు పరచుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా కంపెనీలు కూడా ఉన్నవారిని తొలగించకుండా ఉద్యోగులకు నూతన సాంకేతిక పరిజ్ఞానానికి తగినవిధమైన శిక్షణనివ్వడంద్వారా అవకాశాలు కల్పించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించ డం అవసరం. ఏదిఏమైనప్పటికీ ఐటీరంగంలో జరుగుతున్న పరిణామాలు సంక్షోభంగా కనిపించినప్పటికీ, ఇవి ఒక రూపాంతరం సంకేతాలు. పాతఉద్యోగాలు తగ్గుతున్నప్ప టికీ, కొత్త నైపుణ్యాలపై ఆధారపడిన అవకాశాలు విస్తరిస్తు న్నాయి. మార్పులకు సిద్ధంగా లేని వారికి ఇది సవాళ్లను ఎదుర్కొనే సమయంగా ఉన్నప్పటికీ నైపుణ్యం ఉన్నవారికి ఐటీ రంగం ఇంకా అవకాశాల వేదికగానే ఉంది. ●

# డీలిమిటేషన్‌తో దేశ సమగ్రతకు నష్టం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

డీలిమిటేషన్‌తో జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రా లలో పాలనాపరమైన రాజధానులుగా మారే దక్షి ణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణతో ఆర్థిక అభివృద్ధి జరగడం వలన ఆర్థిక రాజధానులుగా మిగిలిపోతాయి. ఈ ఆర్థిక రాజధానులను దోపిడీ చేస్తూ జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు లబ్ధి పొందడం కాయం. ఏ దేశానికైనా ఆ దేశ సమగ్రతకు రాష్ట్రాల సాధికారిత ముఖ్యం. కేంద్రం కింద రాష్ట్రాలు నలిగిపోకూడదు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒకరకమైన విధానాలు ఇతర పార్టీల పాల నలో ఉన్న రాష్ట్రాలలో వేరే రకమైన విధానాలు వలన దేశ సమైక్యత సమగ్రత దెబ్బతింటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య వ్యవస్థగా పుట్టింది. ఈ సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కేంద్ర ప్రభుత్వం కల్పించా లి. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ స్థానాలను, అసెంబ్లీ స్థానాలను, నిర్ణయిస్తూ డీలిమిటేషన్ చేపట్టడం చూస్తున్నాం. బిజెపి పాలిత రాష్ట్రా లలో అధిక జనాభా గల రాష్ట్రాలుగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే 850 లోక్‌సభ సీట్లు పెరు గుతాయని ఒక అంచనా. అందులో దక్షిణాది రాష్ట్రాలకు 66 సీట్లు మాత్రమే పెరిగే ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ (బీమారి రాష్ట్రాలు)గుజరాత్ ఈ ఐదు రాష్ట్రాలకు గాను 101 లోక్‌సభ సీట్లు పెరుగు తాయి. ఈ ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు 77 పెరగ గగా దక్షిణాది రాష్ట్రాలకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు, కేరళ, కర్ణాటక 33శాతం మాత్రమే పెరుగుతాయి అయితే దక్షిణాది రాష్ట్రాల గత లోక్సభ 543 సీట్లలో 25 శాతం ఉండగా నేడు అది 20 శాతానికి పడిపోతున్నది. అదే ఉత్తరాది రాష్ట్రాల సభ్యుల శాతం గతంలో 38 శాతం కాగా నేడు అది 43 శాతానికి పెరుగనున్నది. ఇలా డీలిమిటేషన్ వలన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సభ్యుల సంఖ్య పెరిగిపోయి దక్షిణాది రాష్ట్రాలపై వారి ఆధిపత్యం ఉంటుందని ఇది దేశ సమైక్యతకు సమగ్రతను దెబ్బతీస్తుం దని నిపుణుల అభిప్రాయం. ఉత్తరాది రాష్ట్రాలు దేశ పరి పాలన విధానాలలో ఆధిపత్యం వహిస్తాయి. పెరుగుతున్న జనాభాకి కావలసిన వసతులు కల్పించలేమని 1970లో జనాభా పెరుగుదలను గణనీయంగా దక్షిణాది రాష్ట్రాలు తగ్గించుకుంటే అదే నేడు దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు పాలనాపరమైన విషయాలలో పార్ల మెంట్లో వారి పాత్ర ఉత్తరాది రాష్ట్ర జనాభా ఆధిక్యం వలన తగ్గిపోతు న్నది. ఐదు దక్షిణాది రాష్ట్రాల



పన్నుల రాబడి వాటా 36 శాతం కాగా, 24ఉత్తరాది రాష్ట్రాల పన్నుల వాటా 64శాతమే. దక్షిణాది రాష్ట్రాల వాటా 36 అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి దక్షిణాది రాష్ట్రాలు పొందుతున్నది కేవలం 18.6 శాతం మాత్రమే. ఆదాయం కొద్దీ జీఎస్టీ జనాభా కొద్దీ ఆదాయ పంపిణీ అంటూ దక్షిణాది రాష్ట్రాలు రూపాయి ఇస్తే వారికి తిరిగి 30పైసలు మాత్రమే ఇస్తూ, అదే ఉత్తరాది రాష్ట్రాల రూపాయి ఇస్తే నాలుగు రూపాయల వరకు వారి జనాభా పేదరికంలో కూరుకుపోయిందని ఇతర కారణాలు చెప్పి దేశ ఆదాయ వనరులను నేడు అప్పగిస్తుం డడం సమాఖ్య వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఒక శాస్త్రవేత్త 1980లో బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను భీమారు రాష్ట్రాలుగా పిలిచారు. అంటే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిందీలో భీమారు అంటే వ్యాది గ్రస్థమైన అనే అర్థంవచ్చే పదాన్ని చేర్చారు. జనాభా పరంగా ఆయుష్ ప్రమాణం రీత్యా పేద రికం నిరుద్యోగం తలసరి ఆదాయం అత్యల్ప స్థాయిలో ఉండి కనీస జీవన ప్రమాణాన్ని కూడా పొందని జనాభాఎక్కువగా ఉండడంతో భీమారు రాష్ట్రాలుగా పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాల రీత్యా ఈ భీమారు రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నాయి. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2024 లో మన దేశం 112 దేశాలలో 105వది. దీనికి కారణం పైనపేర్కొన్న భీమారు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో కడు పేదరికంతో అల్ప వృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండడం ప్రధాన కారణం. ఇక్కడ ప్రజలు పేదరికంలో ఉపాధి అవకాశాలు లేక కొనుగోలు శక్తి అతి తక్కువగాపోషక ఆహారలోపంతో ఆయుష్ ప్రమాణంఅత్యల్ప స్థాయిలో ఉన్నది. దీనికి ప్రధా నమైన కారణం ఈ రాష్ట్రా లలో జనాభా నియంత్రణ అమ లు ఆశించిన మేరకు ఆనాడు జరగలేదు. 1970లో అప్పటి ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేస్తే తప్ప మానవవనరుల ను విద్య, వైద్య ఆదాయపరంగా అభివృద్ధి చేయలేమని కుటుంబ నియంత్రణతోనే మానవాభివృద్ధి జరుగుతుందని కుటుంబ నియంత్రణ దేశవ్యాప్తంగా చేపట్టగా దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయడంవలన నేడు ఈ దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గుతూ వచ్చింది. అయితే ఈ భీమారు స్టేట్స్ కుటుంబ నియంత్రణనుతూతూ మంత్రంగా అమలు చేయడం వలన జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభా రంగంలో డీలిమిటేషన్ చేసి పార్లమెంట్ సీట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. ●

# ఉగ్రవాదానికి భారత్ తలవంచదు

## వారి హేయమైన కుట్రలు సఫలం కావు: ప్రధాని మోడీ స్పష్టీకరణ

### పహల్గామ్ దాడి మృతులకు నివాళి

### ఆ బాధను మరచిపోలేదు: అమిత్ షా

### ఆ గాయాలు ఇంకా మానలేదు: రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారతదేశం ఏ విధమైన ఉగ్రవాదానికి తలవంచదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎప్పటికీ సఫలం కావని పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కర్‌ఎతైబా ఉగ్రవాద సంస్థ దాడి చేసింది. ఈ దాడిలో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన పర్యాటకులతో సహా 26 మంది అమాయక ప్రజలు మరణించారు. పహల్గామ్ ఉగ్రదాడికి సరిగ్గా ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం ఆ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటున్నా. మన ప్రజలను కోల్పోయిన దుఃఖం, బాధ ఇప్పటికీ ప్రతి భారతీయుడి హృదయంలో నిలిచి ఉన్నాయి. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు, దానిపై పోరాడి ఓడించడానికి మనం ఐక్యంగా నిలబడాలి. ఉగ్రవాదం పట్ల, దానికి ఆశ్రయం ఇచ్చేవారి పట్ల భారత్ ఏమాత్రం ఉపేక్షించదు' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళి అర్పించారు. '2025 ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై పిరికిపంద ఉగ్రదాడి జరిగింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటూ, వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. అలాగే, మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నా. మన దేశంపై పడిన ఆ గాయాలను మేం ఎప్పటికీ మరచిపోలేం. దశాబ్ద కాలంగా భారత్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంది. కానీ మన ప్రజలకు హాని కలిగించడానికి కానీ, లేదా మన ఐక్యతను దెబ్బతీయడానికి కానీ చేసే ఏ ప్రయత్నాన్నైనా మనం అత్యంత బలంతో, స్పష్టతతో ఎదుర్కొంటామని దృఢమైన చర్యల ద్వారా మేం నిరూపించాం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. **దేశ వ్యతిరేక చర్యలకు గట్టి బదులిస్తాం: ఇండియన్ ఆర్మీ :** దేశానికి వ్యతిరేకంగా జరిగే ఎలాంటి చర్య లకైనా గట్టి బదులిస్తామని భారత సైన్యం హెచ్చ రించింది. ఉగ్రవాదులు సరిహద్దులు దాటవద్దని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను గుర్తుచేసుకుంటూ ఆర్మీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది.



## ఇడి దర్యాప్తులో మీ జోక్యమేంటి?

### ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో నెట్టేలా చర్యలు

### మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### ఐప్యాక్ ఆఫీసుల్లో ఇడి సోదాలపై విచారణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ ప్యాక్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించిన సోదాల సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అడ్డుపడ్డారన్న ఆరోపణలపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమంత్రి విచారణలో జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం కాదు. ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా ఒక విచారణ లేదా దర్యాప్తు మధ్యలో హఠాత్తుగా అడుగుపెట్టి, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి, ఆ తర్వాత ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం అని అంటారు' అని జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇడి జరుపుతున్న విచారణ మధ్యలోకి ముఖ్య మంత్రి చొరబడి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడం సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక ఉన్నతా ధికారి తరఫున కోర్టులో హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, ఈ వివాదం ప్రధానంగా కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉందని పేర్కొంటూ, ఇడి పిటిషన్ స్వీకార్యతను ప్రశ్నించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. "ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మొత్తం వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తూ చేసిన చర్య" అని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. రాజ్యాంగం 'ప్రాథమిక స్వరూప సిద్ధాంతాన్ని" నిర్దేశించిన 1973 నాటి చారిత్రాత్మక కేశవానంద భారతి తీర్పుతో సహా అనేక తీర్పులను తమ ముందు ఉదహరించారని ధర్మాసనం పేర్కొంది. 'కానీ ఈ దేశంలో ఒకరోజు పదవిలో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగుపెడతారని వారిలో ఎవరూ ఊహించి ఉండరు' అని జస్టిస్ మిశ్రా అన్నారు. సీనియర్ న్యాయవాది గురుస్వామి మాట్లాడుతూ, 'కేసు విచారణకు యోగ్యమైనదేనా అనే దానిపై ఉన్నాను... ఎటువంటి దుష్ప్రవర్తన జరగలేదు, ఏ అధికారిని బెదిరించడం జరగలేదు' అని అన్నారు. ఈ విషయంలో లేవనెత్తిన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. 'ఆర్టికల్ 32 పిటిషన్ విచారణకు యోగ్యమైనదా కాదా అని తాము నిర్ణయిస్తాము. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పరిశీలించాల్సినంత ముఖ్యమైన చట్టపరమైన ప్రశ్న ఏమిటి?' అని అది ప్రశ్నించింది. తాము అప్పీల్‌ను విచారించడం లేదని గమనిస్తూనే, తమ ముందు దాఖలైన అన్ని పిటిషన్లలోనూ కొన్ని చట్టపరమైన ప్రశ్నలు ఉంటాయని, అయితే అంతమాత్రాన ప్రతి ఆర్టికల్ 32 పిటిషన్‌ను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించాలని అర్థం కాదని ధర్మాసనం పేర్కొంది. ప్రతివాదులలో ఒకరి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, మమతా బెనర్జీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించగా, తదుపరి విచారణ గురువారానికి ధర్మాసనం వాయిదా వేసింది.



## తెరచుకున్న కేదార్‌నాథ్ ఆలయం

**డెహ్రాడూన్; ఏప్రిల్ 22:** ఆధ్యాత్మిక లోకానికి ప్రస్తుతం ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన కేదార్‌నాథ్ ధామం తలుపులు బుధవారం భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య సుమారు 51క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## రూ.3వేలు తీసుకుని ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన స్థానికులు

### కాల్పులు జరుపుతున్న సమాచారం తెలిసినా పోలీసులకు చేరవేయని వైనం

### చివరకు ఎన్‌ఐఎ దర్యాప్తులో వెల్లడి... ఆపై అరెస్టు



**శ్రీనగర్; ఏప్రిల్ 22:** పహల్గాంలో ఉగ్ర దాడి ఘటనలో ఎన్‌ఐఎ దర్యాప్తుకు సంబంధించి కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఆనాడు దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు స్థానికులు ఇద్దరు ఆశ్రయం కల్పించారు. ఉగ్రవాదుల గురించి వారు పోలీసులకు చెప్పే అవకాశం ఉన్నా చెప్పకుండా రహస్యంగా ఉంచారని వెల్లడైంది. చెప్పకుండా ఉండటం కోసం వారు ఉగ్రవాదుల నుంచి రూ.3 వేల లంచం తీసుకున్నట్లు ఎన్‌ఐఏ విచారణలో తేలింది. గత ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రవాదుల దాడి జరిగింది. అంతకుముందు రోజు అంటే ఏప్రిల్ 21న రాత్రి 10.30 గంటల సమయంలో స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు కనిపించాయి. ఉర్దూ, పంజాబీ కలగలిసిన భాష మాట్లాడారు. లష్కరే తయిబా అగ్ర కమాండర్, ప్రధాన నిందితుడు సాజిత్ జాట్ అలియాస్ అలీభాయ్ గురించి వారు మాట్లాడుకున్నారు. తమ ప్రాంతంలో దాడి జరగడం ఖాయమని వారి మాటల్ని బట్టి అర్థమైనా పోలీసులను అప్రమత్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఐదు గంటలపాటు వారి వద్ద ఆశ్రయం పొందిన ఆ ముగ్గురు ఉగ్రవాదులు అక్కడే తినేసి వెళ్లిపోయారు. అందుకోసం రూ.3 వేలు ఇచ్చారు. తర్వాత ఏప్రిల్ 22న దాడి జరగడానికి కొన్ని గంటల ముందు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ ఉగ్రవాదులు బైసరన్ లోయలోని ఒక కంచె వెనకాల దాక్కొన్నారు. ఆ విషయాన్ని పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లు గుర్తించారు. అప్పుడు కూడా పోలీసులకుగానీ, స్థానిక టూరిస్ట్ ఆపరేటర్లకుగానీ వారు సమా చారం ఇవ్వలేదని వెల్లడైంది. ఆ ఇద్దరూ తమ గుర్రాలు ఎక్కడానికి పర్యాటకులు ఎవరైనా వస్తారా అని మాత్రమే చూసుకున్నారు. మధ్యా హ్నం ఒంటిగంటన్నర సమయంలో కొందరు రాగానే వారిని పహల్గాంలోని బైసరన్‌లోయకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకు అక్కడ కాల్పుల మోత వినిపించడం, ఆవాతావరణ మంతా రక్తసిక్తమవడాన్ని చూశారు. ఆ తర్వాత తమకేం సంబంధం లేదన్నట్టుగా నిశ్శబ్దంగా అక్క డినుంచి జారుకున్నారని తెలిసింది. దర్యాప్తులో భాగంగా ఎన్‌ఐఏ ఆ ఇద్దరినీ గత ఏడాది జూన్ 22న అరెస్టు చేసింది. డిసెంబర్‌లో ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌లో సాజిత్ జాట్ పేరుతోపాటు ఆ స్థానికుల పేర్లను చేర్చింది.

## నేపాల్ హోంమంత్రి రాజీనామా



**ఖాట్మండు, ఏప్రిల్ 22:** నేపాల్ హోంమంత్రి సూడాన్ గురుంగ్ తన మంత్రిపదవికి రాజీనామా చేసారు. వ్యాపారవేత్త దీపక్‌భట్టాతో తనకు లింకులున్నాయని వచ్చిన ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తునకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దీపక్ భట్టా ప్రస్తుతం మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. దీపక్‌భట్టాకు చెందిన కంపెనీల్లో హోంమంత్రికి షేర్లు ఉన్నాయని ప్రభుత్వ ఆస్తుల ప్రకటనపరంగా ఆర్థిక సమాచారం అందించారన్న ఆరోపణలున్నాయి. గురుంగ్ రాజీనామాపై నేపాలి కాంగ్రెస్ ప్రకటన జారీచేసింది. ప్రజాస్వామ్యానికి పారదర్శకత, అంకితభావం మూల స్తంభాలుగా ఉంటాయని గురుంగ్‌పై వచ్చిన ఆరోపణలపై వాస్తవిక అంశాల ఆధారంగా నిజనిర్ధారణతో నిష్పాక్షిక విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆయన సొంతపార్టీ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీనుంచి కూడా గురుంగ్ రాజీనామాచేయాలని ఒత్తిడి తెచ్చారు. రాజకీయ ఒత్తిళ్లతోపాటు నైతికంగా కూడా తనకు కొనసాగడం ఇష్టంలేదని అందుకే బుధవారం తన రాజీనామాను అందచేసినట్లు గురుంగ్ ప్రకటించారు. ఆయన షేర్లతోపాటు ఆయన ఇటీవల కొనసాగించిన పెట్టుబడులపైనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తనవరకూ తనకు నైతిక నియమావళి ముఖ్యమని అందుకే రాజీనామ చేసినట్లు తెలిపారు. ప్రజల్లో విశ్వాసం చూరగొనేందుకే తాను రాజీనామా చేసానన్నారు. సుపరిపాలన, పారదర్శకత, చిత్తశుద్ధితో కూడిన పాలన కావాలనే జెన్‌జడ్ ఆందోళన నడిచిందని ఇపుడు తన రాజీనామా కూడా అదే సందేశం ఇస్తుందని అన్నారు. కనీసం నెలరోజులు కూడా నిర్వహించలేకపోయిన హోంమంత్రి పదవినుంచి ఆయన దిగిపోయారు. అంతకుముందు ఇదేనెల లోనే ప్రధాని బాలేన్‌షా కార్మిక మంత్రి దీపక్ కుమార్‌షాను తొలగించారు.

## మాలేగావ్ పేలుళ్లకేసులో నలుగురు నిందితులపై కేసు కొట్టివేత



**ముంబయి, ఏప్రిల్ 22:** మాలేగావ్‌లో జరిగిన పేలుళ్ల ఘటనతో లింకున్న కేసులో నలుగురు నిందితులపై నమోదయిన అభియోగాలను కొట్టివేసింది. బాంబే హైకోర్టు బుధవారం ఆ కేసు నుంచి డిశ్చార్జ్ చేసింది. ఆ నలుగురిపై స్పెషల్ కోర్టు నమోదు చేసిన అభియోగాలను హైకోర్టు కొట్టివేసింది. చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేకర్, జస్టిస్ శ్యామ్ చందక్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. రాజేంద్ర చౌదరీ, ధాన్ సింగ్, మనోహార్ రామ్ సింగ్ నర్వారియా, లోకేశ్ శర్మలు దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు స్వీకరించింది. ఈ కేసులో కోర్టు ఆదేశాలకు చెందిన పూర్తి కాపీ ఇంకా అందాల్సి ఉన్నది. మాలేగావ్ పేలుళ్ల ఘటనలో నలుగురిపై ఐపీసీ, యూఏపీఏ సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. 2006 సెప్టెంబర్ 8వ తేదీన నాసిక్ జిల్లాలోని మాలేగావ్ పట్టణంలో నాలుగు చోట్ల బాంబు పేలుళ్ల చోటు చేసుకున్నాయి. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన సమయంలో హమిదియా మజీద్, బడా ఖబరస్తాన్ ప్రాంతాల్లో పేలుళ్ల జరిగాయి. ముషావరత్ చౌక్ వద్ద కూడా పేలుడు జరిగింది. ఆ పేలుళ్లలో మొత్తం 31 మంది మృతిచెందగా, మరో 312 మంది గాయపడ్డారు. మహారాష్ట్ర ఏటీఎస్ పోలీసులు ఈ కేసును విచారించారు. ఈ కేసుతో లింకున్న 9 మంది ముస్లింలను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ఎన్‌ఐఏ తన ఆధీనంలోకి తీసుకున్నది. బ్లాస్ట్ వెనుక అతివాద తీవ్రవాదులు ఉన్నట్లు ఎన్‌ఐఏ ఆరోపించింది. దానిలో భాగంగా నలుగుర్ని అరెస్టు చేశారు. స్పెషల్ కోర్టు తన ఆదేశాల్లో 9 మంది ముస్లింలను కేసు నుంచి రిలీజ్ చేసింది. ఇక గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ నలుగురిపై అభియోగాలు నమోదు చేసింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ వాళ్లు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్‌ఐఏ తన దర్యాప్తులో తమపై ఎటువంటి ఆధారాలను చూపలేదని నిందితులు పేర్కొన్నారు.

## ప్రియుడికోసం భర్తనే చంపే కుట్రచేసిన భార్య

**వదోదర, ఏప్రిల్ 22:** ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ఓ భార్య పన్నిన పన్నాగం గుజరాత్‌లోని వడోదర పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. వడోదరలోని ఛానీ ప్రాంతానికి చెందిన పాన్ పార్లర్ యజమాని గిరీశ్ పటేల్‌ను ఏప్రిల్ 15న కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఛానీసోఖ్డా రోడ్డుపై కారులో బలవంతంగా ఎక్కించుకుని, కత్తితో బెదిరించి, సోజిత్ర సమీపంలోని కాలువలో పడేశారు. గిరీశ్ చనిపోయాడని భావించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, కాలువలోని ఓ నిర్మాణాన్ని పట్టుకుని సుమారు మూడు గంటలపాటు గిరీశ్ ప్రాణాలతో పోరాడాడు. మరుసటి రోజు ఉదయం సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తొలుత ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గిరీశ్ భార్య ఫాల్గుణి పటేల్ పాత్ర ఉన్నట్లు తేలింది. ఖేడా ప్రాంతానికి చెందిన సెలూన్ యజమాని కౌశిక్ శర్మతో ఫాల్గుణికి వివాహేతర సంబంధం ఉందని, తమ బంధానికి అడ్డుగా ఉన్న గిరీశ్‌ను చంపేందుకు ఇద్దరూ కలిసి కుట్ర పన్నారని పోలీసులు వెల్లడించారు. కౌశిక్ శర్మ ఈ హత్య కోసం నరేంద్ర అలియాస్ నికుల్ గోస్వామి అనే కిరాయి హంతకుడికి రూ.35వేల సుపారీ ఇచ్చాడు. ఘటనకు రెండు రోజుల ముందు ఫాల్గుణి, కౌశిక్ మధ్య 100కు పైగా ఫోన్ కాల్స్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితులందరినీ జ్యుడీషియల్ కస్టడీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అమెరికా మహిళా టూరిస్టుపై హోంస్టేలో లైంగికదాడి

**కొడగు, ఏప్రిల్ 22:** కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొడగు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన ఓ మహిళా టూరిస్ట్‌పై హోంస్టేలో అత్యాచారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి హోంస్టే యజమాని, అక్కడ పనిచేసే ఓ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న యజ మాని, ఆమెకు సహాయం చేయకపోగా నేరాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేశాడు. మూడు రోజుల పాటు బాధితురాలిని నిర్బంధించి, ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఎవరికీ ఫిర్యాదు చేయవద్దని బెదిరించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు మైసూరు చేరుకుని, అమెరికా అధికారులను సంప్రదించింది. యూఎస్ ఎంబసీ ద్వారా విషయం తెలుసుకున్న కర్ణాటక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనను కొడగు జిల్లా ఎస్పీ ధ్రువీకరించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, వారికి మే 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారని ఆయన తెలిపారు.

## అంగారక గ్రహంపై జీవకారక సేంద్రియ అణువుల గుర్తింపు




**న్యూయార్కు, ఏప్రిల్ 22:** అంగారక గ్రహంపై జీవం ఉనికి గురించి దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణలో నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ మరో కీలక ముందడుగు వేసింది. అరుణ గ్రహం ఉపరితలంపై జరిపిన సరికొత్త రసాయన ప్రయోగంలో జీవానికి మూలమైన సేంద్రియ అణువులను గుర్తించింది. భూమి మీద జీవానికి ప్రాథమిక నిర్మాణ ఇటుకలుగా పరిగణించే ఈ రసాయనాల గుర్తింపు, మార్స్ అధ్యయనంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. క్యూరియాసిటీ రోవర్ అంగారకుడి భూమధ్యరేఖకు సమీపంలో ఒకప్పుడు సరస్సుగా ఉండి ఎండిపోయిన ప్రాంతంలో ఈ పరిశోధన జరిపింది. ఇక్కడ ఏడు వేర్వేరు సేంద్రియ సమ్మేళనాలను రోవర్ గుర్తించగా, వాటిలో ఐదింటిని మార్స్‌పై కనుగొనడం ఇదే తొలిసారి. ఈ సేంద్రియ పదార్థాలు పురాతన జీవుల నుంచి వచ్చాయా, ఉల్కల ద్వారా గ్రహానికి చేరాయా, లేక భౌగోళిక ప్రక్రియల వల్ల ఏర్పడ్డాయా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ అంగారకుడిపై జీవం ఉండి ఉంటే, దానికి సంబంధించిన రసాయన ఆనవాళ్లు ఇప్పటికీ భద్రంగా ఉండే అవకాశం ఉందని ఈ ఆవిష్కరణ సూచిస్తోంది. ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ఫ్లోరిడా యూనివర్సిటీ ఆస్ట్రోజియాలజిస్ట్ ప్రొఫెసర్ అమీ విలియమ్స్ మాట్లాడుతూ.. మేము 350 కోట్ల సంవత్సరాల క్రితం అంగారకుడిపై భద్రపరచబడిన సేంద్రియ పదార్థాలను చూస్తున్నామని భావిస్తున్నాం. అయితే ఇది జీవానికి సంబంధించినదేనా అన్నది ప్రస్తుత సమాచారంతో చెప్పలేమనిఅన్నారు. కొన్ని వందల కోట్ల ఏళ్ల కిందట మార్స్‌పై జీవం వృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉండేదని, కానీ నేడు తీవ్రమైన రేడియేషన్, అతి శీతల పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గుర్తించిన సమ్మేళనాల్లో డీఎన్‌ఏ నిర్మాణంలో పాలుపంచుకునే నైట్రోజన్ సమ్మేళనం వంటి నిర్మాణం ఒకటి ఉన్నప్పటికీ, అవి కేవలం ఇటుకలు మాత్రమే, ఇల్లు కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణలతో 2028లో ప్రయోగించనున్న యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రోసలిండ్ ఫ్రాంక్లిన్ రోవర్‌పై అంచనాలు పెరిగాయి. ఈ రోవర్ ఉపరితలం కింద రెండు మీటర్ల లోతు వరకు డ్రిల్ చేసి, రేడియేషన్ నుంచి మరింత సురక్షితంగా ఉన్న నమూనాలను అధ్యయనంచేసే సామర్థ్యం ఉంటుంది.

## భారత్‌నౌకతోపాటు మరో రెండు నౌకలు ఐఆర్‌జిసి స్వాధీనం

### మరికొన్నింటిపై గన్‌బోట్స్ కాల్పులు


**టెహ్రాన్, ఏప్రిల్ 22:** భారత్‌కు వస్తున్న కార్గో షిప్‌తో పాటు మరో నౌకను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం స్వాధీనం చేసుకున్నది. హార్ముజ్ జలసంధి దాటేందుకు ప్రయత్నించిన ఆ రెండు వాణిజ్య నౌకలను ఇరాన్ తీరానికి తరలించింది బుధ వారం ఉదయం హార్ముజ్ జలసంధిలో నిబంధ నలను ఉల్లంఘించిన రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం గుర్తించి నిలిపివేసింది. ఆ రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం స్వాధీనం చేసుకుని ఇరాన్ తీరానికి మళ్లించిందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఐఆర్‌జీసీ స్వాధీనం చేసుకున్న రెండు నౌకలను ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా, ఎపామి నోండాస్‌గా గుర్తించారు. మెరైన్ ట్రాఫిక్ వెబ్ సైట్ ప్రకారం ఎపామినోండాస్ నౌక దుబాయ్‌లోని జెబెల్ అలీ నుంచి గుజరాత్‌కు వెళ్తోంది. మరోవైపు బుధవారం ఉదయం హోర్ముజ్ జల సంధిలో మూడు కంటైనర్ నౌకలపై ఐఆర్‌జీసీ నౌకాదళం దాడి చేసింది. ఒమన్‌కు ఈశాన్యంగా సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో ఒక కంటైనర్ నౌకపై ఐఆర్‌జీసీ గన్‌బోట్ కాల్పులు జరిపినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ (యూకేఎమ్‌టీఓ) తెలిపింది.



(గ్రీక్ కంపెనీకి చెందిన ఎపామినోండాస్ నౌకలోని బ్రిడ్జికి నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఇరాన్‌కు పశ్చిమాన సుమారు ఎనిమిది నాటికల్ మైళ్ల దూరంలో యూఏఈకి చెందిన సంస్థ యాజ మాన్యంలోని పనామా జెండా కలిగిన యూఫోరియా నౌకపై కూడా ఐఆర్‌జీసీ నౌకా దళం దాడి చేసింది. నౌక సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, నౌకకు ఎలాంటి నష్టం జరగలేదని యూకేఎమ్‌టీఓ తెలిపింది. ఇరాన్ తీరానికి సుమారు ఆరు నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పనామా జెండా కలిగిన ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా నౌకను కూడా ఐఆర్‌జీసీ నౌకాదళం లక్ష్యంగా చేసుకున్నది. హార్ముజ్ జలసంధి నుంచి దక్షిణంగా ఒమన్ గల్ఫ్‌లోకి ప్రయాణిస్తుండగా దాడి చేసింది. ఆ నౌక బాడీ, వసతి సౌకర్యాలకు నష్టం వాటిల్లినట్లు సముద్ర నిఘా సంస్థ వాన్‌గార్డ్ వెల్లడించింది.


## నడిరోడ్డుపై బిజెపి ఆందోళనపట్ల ముంబయి మహిళ ఫైర్

**ముంబయి, ఏప్రిల్ 22:** ముంబైలో ఓ రాజకీయ ర్యాలీ కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న ఓ మహిళ, ఏకంగా మంత్రిని, పోలీసులనుకూడా నడిరోడ్డుపై నిలదీశారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ కాన్వాయ్‌ను అడ్డుకుని ఆమె చేసిన వాగ్వివాదం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబైలోని వర్లీ ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమి ఓ నిరసన ప్రదర్శన చేపట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర విపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు జంబోరీ మైదాన్ నుంచి ప్రారంభం కావాల్సిన ఈ ర్యాలీ ఆలస్యం కావడంతో ఆ ప్రాంతమంతా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అదే సమయంలో స్కూల్ నుంచి తన బిడ్డను తీసుకొచ్చేందుకు వెళ్తున్న ఓ మహిళ, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. దీంతో సహనం కోల్పోయిన ఆమె కారు దిగి నేరుగా ర్యాలీ మధ్యలోకి వెళ్లి మంత్రి గిరీశ్ మహాజన్‌తో వాగ్వివాదానికి దిగారు. వందలాది మంది ఇక్కడ ఇబ్బంది పడుతున్నారు. అక్కడ ఖాళీ గ్రౌండ్ ఉందిగా అక్కడికి వెళ్లి చేసుకోండి. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ నిరసనకారులపై గట్టిగా అరిచారు. పోలీసులు జోక్యం చేసుకోబోగా, వారిపైనా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అధికారులతో మాట్లాడాలని పట్టుబట్టారు. చివరికి పోలీసులు ఆమెను పక్కకు తీసుకెళ్లి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేశారు.



# మంటల్లో పశ్చిమాసియా

## కంటైనర్ నౌకపై ఐఆర్‌జిసి కాల్పులు



**లండన్, ఏప్రిల్ 22:** పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన కాల్పుల విరమణ చర్చలు వాయిదాపడిన క్రమంలో ఇరాన్ హార్ముజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులు జరిపి పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. టెహ్రాన్ నుండి ఏకీకృత ప్రతిపాదన కోసం ఎదురు చూస్తూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కొన్ని గంటల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) హార్మూజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేసింది. ఇరాన్ మీడియా కూడా ఈ దాడిని ధ్రువీకరించింది. కాల్పులకు గల కారణాలు వెల్లడించలేదు. ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకను అమెరికా దళాలు ఇటీవల స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాడి జరగడం ఉద్రిక్తతలను మరోసారి పెంచింది. అమెరికాతో చర్చలపై ఇరాన్ స్పందించింది. ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ, అమెరికాతో రెండో విడత చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో హార్మూజ్ జలసంధిలో తమ నౌకలపై కొనసాగుతోన్న దిగ్బంధాన్ని ఎత్తివేయాలని షరతు విధించారు. తమ నౌకలను దిగ్బంధించడంతో పాటు, అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు.

## కాల్పుల విరమణ పొడిగింపు ఓటమి అంగీకరించడమే

### ఇరాన్ స్పీకర్ సలహాదారు మహదీ మహ్మాదీ



**టెహ్రాన్; ఏప్రిల్ 22:** అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. శాంతి చర్చల కోసం ఇరాన్‌తో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఈ ప్రతిపాదనను ఇరాన్ తీవ్రంగా తిరస్కరించింది. ట్రంప్ నిర్ణయం అర్థరహితమని, ఓడిపోయిన పక్షం షరతులు విధించలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ సీనియర్ సలహాదారు మహదీ మొహమ్మదీ ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకే కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ తనట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇరాన్ నాయకత్వంలో తీవ్రమైన భేదాభిప్రాయాలు ఉన్నాయని, ఒక ఏకీకృత ప్రతిపాదనతో ముందుకు వచ్చేందుకు వారికి సమయం ఇస్తున్నామని అన్నారు. హార్మూజ్ జలసంధిలోని ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ ప్రకటనపై మహదీ మొహ మ్మదీ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ కాల్పుల విరమణ పొడిగింపునకు అర్థం లేదు. ఓడిపోయిన పక్షం షరతులు పెట్టలేదు. దిగ్బంధనాన్ని కొనసాగించడం కూడా బాంబు దాడులతో సమానం. దీనికి సైనిక చర్యతోనే బదులివ్వాలి. ఆకస్మిక దాడికి పాల్పడేందుకు సమయం సంపాదించే కుట్రలో భాగమే ఈ కాల్పుల విరమణ. ఇక ఇరాన్ చొరవ తీసుకునే సమయం ఆసన్నమైందని ఆయన ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ఆర్థికంగా కుప్పకూలుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. వారు వెంటనే హార్మూజ్ జలసంధిని తెరవాలని కోరుకుంటున్నారు. నగదు కోసం ఆకలితో ఉన్నారు. రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టపోతున్నారు. సైన్యం, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇరాన్ నుంచి ప్రతిపాదన వచ్చే వరకు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్థాన్‌కు వెళ్లరని వైట్ హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో ఇరు దేశాల మధ్య శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

## పిఠాపురంలో ప్రొటోకాల్ వివాదం

# సిఎం చంద్రబాబు అసహనం

● మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని వ్యాఖ్య

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఠాపురంలో ప్రొటోకాల్ అంశంపై జరిగిన వివాదం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు చేరింది. ఆయన ఈ ఘటనపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు. వర్మ ప్రతి సందర్భంలో కూటమి ఐక్యతకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం అంత ఉపేక్షించదగిన విషయం కాదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

● తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్



**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని వ్యవసాయ రంగానికి గట్టి ప్రోత్సాహం అందిస్తున్నదని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన రైతులతో సమావేశమై ప్రభుత్వ పథకాలపై పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జ్వాలా మాట్లాడుతూ, రైతుల ఆర్థిక భారం తగ్గించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వారి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సహకారంతో కృషి చేస్తున్న సౌమ్య పాత్ర ప్రశంసనీయమన్నారు. గత ప్రభుత్వ కాలంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని, వ్యవసాయ పరికరాలపై సరైన సబ్సిడీలు అందలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు గణనీయమైన సబ్సిడీలు అందిస్తూ వ్యవసాయ రంగానికి నూతన ఊపిరి పోస్తోందన్నారు. ప్రస్తుతం ట్రాక్టర్లపై సుమారు రూ.3 లక్షల వరకు, పవర్ టిల్లర్లపై రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు, రోటావేటర్లు మరియు కల్టివేటర్లపై రూ.50,000 నుంచి రూ.1.5 లక్షల వరకు, స్ప్రేయర్లపై రూ. 10,000 నుంచి రూ.50,000 వరకు సబ్సిడీ లభిస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ సిస్టమ్స్‌పై రూ.30,000 నుంచి రూ.1.5 లక్షల వరకు, హార్వెస్టర్లపై రూ.3 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సబ్సిడీలు రైతులకు ఆర్థికంగా ఉపశమనం కలిగించడమే కాకుండా, ఆధునిక వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమలు చేసేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమీప వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చంద్రన్న ప్రభుత్వ పథకాలను ప్రతి రైతు పూర్తిగా ఉపయోగించుకోవాలని జ్వాలా ప్రసాద్ కోరారు.



## పిల్లలకు ఆధ్యాత్మిక, యోగా తరగతులు

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రామకృష్ణా మిషన్ ఆధ్వర్యంలో ఆత్మవికాస్ 2026, సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఈ నెల 27నుంచి మే 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. నగరంలోని గాంధీనగర్‌లో రామకృష్ణా మిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వివేకానంద సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్‌లో 12రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. 4వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న పిల్లలకు ధ్యానం, యోగాసనాలు, వేద పఠనం, భజనలు, లీడర్‌షిప్ స్కిల్స్, చరిత్ర నిర్మాణం వంటివి ఇక్కడ నేర్పనున్నారు.

## పసి పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయిస్తున్న

# ముఠా సభ్యుల అరెస్ట్

● ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వెల్లడి

**విజయవాడ. ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో పసి పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల విజయవాడలో 10నెలల బాలుడిని కిడ్నాప్ చేసి మచిలీపట్నంలో విక్రయించిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు ఈరోజు మరో ముగ్గురు మహిళలను అరెస్ట్ చేశారు. వీరి విచారణలో పది నెలల బాలుడు కిడ్నాప్, విక్రయానికి ముందే ఈ ముగ్గురు మహిళలు ఏడాది వయస్సు ఉన్న మరో బాలుడిని కిడ్నాప్ చేసి కర్ణాటకకు చెందిన దంపతులకు విక్రయించారని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. తాము మోసపోయామన్న విషయం తెలుసుకున్న కర్ణాటక దంపతులు బాలుడిని తీసుకువచ్చి అప్పగించారన్నారు. అయితే ఆ బాలుడి తల్లి వివరాలను తెలియాల్సి ఉందని, సీసీ ఫుటేజ్ ఆధారంగా తల్లి ఆచూకీ గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్టు వివరించారు. అరెస్ట్ అయిన ముగ్గురు మహిళలు విజయవాడ రాజేశ్వరరావుపేట, అయ్యప్పనగర్‌కు చెందిన వాళ్లని అన్నారు. ఈ కేసును మరింత లోతుగా విచారించి కిడ్నాప్, విక్రయాల వెనుక ఉన్న ప్రధాన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ విద్యాసాగర్ తెలిపారు. బేరాలు ఎలా వస్తున్నాయ్? పిల్లల కోసం ఫలానా దంపతులు చూస్తున్నారనీ, ఇస్తే డబ్బులిస్తారని ఈ ముఠాకు బేరాలు తెస్తున్నవారెవరు. నిందితులపై ఇది వరకేమైనా కేసులు ఉన్నాయా ఎంత మందికి అమ్మారు.? కన్నవారు ఎవరు.? వీరి వద్ద నుంచి పిల్లలను కొనుకున్నవారు పెంచుకునేందుకే తీసుకున్నారా? వారిపై గతంలో ఎలాంటి కేసులు ఉన్నాయి? ఎంతమంది కన్నవారికి పిల్లలను దూరం చేశారు. తదితర వివరాలన్నీ ప్రధాన నిందితురాలి విచారణతో బయటకు రానున్నాయి. ఈ ముఠాకు ఇతర గ్యాంగులతో సంబంధాలు, సరోజిని, ఉత్తరాది గ్రూప్‌లతో లింకులు వీరి నెట్‌వర్క్ ఎక్కడెక్కడ ఉంది? తప్పించుకొని బయట తిరుగుతున్న వారెవరు? తదితర వివరాలపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో కొందరు నిందితులను అరెస్టు చేసి. తాజాగా పట్టుబడిన పసికందును తల్లిదండ్రులకు అప్పగించనున్నాం. ఈ ముఠా పెద్దసంఖ్యలోనే పిల్లలను ఎత్తుకెళ్లారనీ కొందరు కన్నవారికి డబ్బు ఆశ చూపి తీసుకెళ్లి పలు ప్రాంతాల్లో విక్రయించినట్లు అనుమానిస్తున్నారు. ఎక్కడెక్కడ ఎందరిని విక్రయించారు. జిల్లాలో కనిపించకుండా పోయిన పిల్లలను వీరే తీసుకెళ్లి ఉంటారనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. మరికొందరు పిల్లలు, కిడ్నాప్ ముఠాలోని మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

# సంక్షోభాల నుంచి పరిష్కారాలు అన్వేషించాలి

● అవకాశాలుగా మలచుకుంటూ రాణించాలి ● ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు



**విశాఖపట్నం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** సంక్షోభాల నుంచి పరిష్కారాలను అన్వేషించాలని, వాటినే అవకాశాలుగా మలచుకుంటూ యువతరం ముందుకు సాగాలని ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కె.హరి బాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శతాబ్ది వారోత్సవాలలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న కళాశాల స్థాయి వేడుకలను ఆయన ముఖ్య అతిధిగా హాజరై బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నషాముక్త్ క్యాంపస్‌లుగా విశ్వవిద్యాలయాలు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా యువతలో చైతన్యం నింపాలని సూచించారు. దేశ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తయారు చేయడంతో పాటు ప్రపంచ అవసరాలకు అనుగుణంగా యువతను సన్నద్ధం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం నిరంత ప్రగతి సాధించడం, అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడం ఎంతో ప్రధానమన్నారు. అవకాశాలు అపారమని, వాటిని అందిపుచ్చుకునే దిశగా మనం అడుగులు వేయాలన్నారు. ముఖ్యంగా భారత్‌కు క్రూడ్ ఆయిల్ దిగుమతులు, రక్షణ రంగ ఆయుధాలు, వంటనూనెలు అధికంగా దిగుమతి అవుతున్నాయని, వీటిని తగ్గించుకోవడం ద్వారా దేశ సంపద విదేశాలకు వెళ్లకుండా నియంత్రించడం సాధ్యపడుతుందన్నారు. ఏకాగ్రత, క్రమశిక్షణ, స్థిరమైన కృషి కలిగి ఉండే నిర్దిష్ట లక్ష్యాలను సాధించడం వీలవుతుందన్నారు. పుస్తకాలను దాటి అభ్యసనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆలోచనలను సృజించడం ప్రధానమన్నారు. ఆచార్యులు విద్యార్థులకు మార్గదర్శకం చేయడం, యువ మస్తిష్కాలకు తగిన చోదకశక్తిగా నిలవడం అవసరమన్నారు. అవకాశాలతో సమానంగా సవాళ్లు ఉన్నాయని, పరిమిత వనరులతో మనం ఏమి సాధించగలము అని ఆలోచన చేయాలన్నారు. తాను రాజకీయ ఓనమాలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేర్చుకున్నానన్నారు. నేడు తాను ఉన్న స్థితికి చేరుకోవడానికి ఏయూ కారణమన్నారు. వందేళ్ల ఏయూ ప్రయాణం పరిశీలిస్తే జ్ఞానము, నైతిక విలువలు, సేవ అనే మూడు సూత్రాలపై సాగిందని స్పష్టమవుతుందన్నారు. కళాశాల శతాబ్ది ప్రత్యేక సంచికను వేదికపై గవర్నర్ విడుదల చేశారు. అనంతరం ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రిన్సిపాల్స్‌గా, ఆచార్యులుగా సేవలందించి పదవీ విరమణ చేసిన వారిని, పలువురు పూర్వ విద్యార్థులను వేదికపై సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.మధు మూర్తి మాట్లాడుతూ విలువలతో ఎదగడం, సమాజానికి ఉపయుక్తగా నిలవడం ఏయూను చూస్తే అర్థమవుతుందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం మానవ వనరులతో తయారు చేయడంతో పాటు, నాయకత్వాన్ని సైతం పెంపొందించిందన్నారు. అనంత అవకాశాలను అందించే శక్తి ఏయూకు ఉందన్నారు. ఎన్‌టియూ ప్రెసిడెంట్స్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఉపద్రష్ట రామమూర్తి మాట్లాడుతూ తాను ఏయూలో చదువుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర, దేశ ఆర్థిక ప్రగతికి విశ్వవిద్యాలయాలు చోదక శక్తిగా నిలుస్తాయన్నారు. ఏయూ వీసీ ఆచార్ జి.పి రాజశేఖర్ ప్రసంగాన్ని రెక్టార్ ఆచార్య పి.కింగ్ చదివి వినిపించారు. విద్యార్థులే భవిష్యత్ ఆవిష్కర్తలన్నారు. సమాజానికి అర్థవంతమైన సహకారం అందించాలన్నారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఆచార్యుల కృషి అభిలషనీయమన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.శశి కళాశాల స్థాపన నుంచి సాధించిన ప్రగతి, విద్యార్థులను మలచే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ కళాశాల ప్రగతి, వికాసాన్ని తెలియజేశారు. 2010లో ప్రారంభమైన మహిళా ఇంజనీరింగ్ కళాశాల మహిళా శక్తికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఆచార్య జి.వి.ఆర్ శ్రీనివాస రావు, ఆచార్య ఎన్.చిట్టిబాబు, ఆచార్య డి.లలిత భాస్కరిం, ఆచార్య బి.ప్రజ్ఞ, ఆచార్య పి.స్వప్న తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# జెఇఇ మెయిన్ ఫలితాల్లో చరిత్ర సృష్టించిన నారాయణ

### ఆలిండియా ఆల్ కేటగిరీల్లో 1, 6, 7, 9, 10 టాప్ ర్యాంకులు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** జెఇఇ మెయిన్-2026 ఫలితాలలో టాప్ ర్యాంకులతో నారాయణ విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10, 14, 17, 19, 21, 23, 24, 25 వంటి 10 లోపు 1, 25 లోపు 8, 100 లోపు 27 అత్యుత్తమ ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి, సింధూరనారాయణ, సి. శరణినారాయణ, రమా నారాయణ తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో తమ్మిన గిరీష్ ఆలిండియా 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10, 14, 17, 19, 21, 23, 24, 25, 27, 27, 29, 32, 37, 40, 40, 44,48, 55, 56, 57, 61, 64, 66, 73, 74, 76, 97 4 100 5 27 2 1000 5 174 విజయ ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగించినట్లు తెలిపారు. వారిలో అత్యధికులు నారాయణ స్కూల్ విద్యార్థులే కావటం గమనార్హమన్నారు.
ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 1, 6, 7, 9, 10 వంటి 10 లోపు 6 ర్యాంకులతో పాటు ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 100 లోపు 48 ర్యాంకులు, 1000 లోపు 750 ర్యాంకులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమా నారాయణ మాట్లాడుతూ గత 6 సంవత్సరాల్లో ఓపెన్ కేటగిరీలో 3 సార్లు (2020, 2021, 2025) ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించటం నారాయణ కమిట్‌మెంట్‌కి ఈ రికార్డులే నిదర్శనమన్నారు. అలాగే దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన వారు 26 మంది ఉండగా, వారిలో 7 మంది (27శాతం) నారాయణ విద్యార్థులు కావటం గమనించదగ్గ విషయమన్నారు. 8 రాష్ట్రాల్లో నారాయణ విద్యార్థులే టాపర్స్‌గా నిలిచారన్నారు. ఆలిండియా బాలికల విభాగంలోనూ నారాయణ విద్యార్థిని మల్లవరపు అస్నా ఫస్ట్ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ ఈ మెయిన్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా సుమారు 14.75 లక్షల మంది విద్యార్థులు జెఇఇ మెయిన్ పరీక్ష రాయగా, వారిలో సామాజిక వర్గాల వారీగా, రిజర్వేషన్లకు అనుగుణంగా కేవలం 2.50 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత కల్పిస్తారని తెలిపారు.
ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పేర్కొన్నారు. డైరెక్టర్ శరణ్ నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో (తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, గోవా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్) నారాయణ విద్యార్థులే టాపర్స్ నిలవటం నారాయణ ఘనతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో 1000 లోపు ర్యాంకుల్లో 174 కిపైగా ఉంటారని, దాదాపు 16 శాతంనారాయణ విద్యార్థులే కైవశం చేసుకోవటం గమనార్హమన్నారు.

# మెరుగైన విద్యుత్తు అందించడమే ప్రభుత్వ ప్రధాన అజెండా

### తూకివాకం నందు 132/33 కె.వి సబ్‌స్టేషన్ ప్రారంభం



**రేణిగుంట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** వినియోగదారులకు మెరుగైన హెచ్చుతగ్గులు లేని విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ తూకివాకం నందు 132/33 కె.వి సబ్ స్టేషన్ ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో బుధవారం ప్రారంభించారు. ముందుగా సబ్‌స్టేషన్ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నందు భాగంగా మొక్కలను నాటారు. అనంతరం లాంఛనంగా సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. అందులో భాగమే అమరావతి రాజధాని నగరం కావడం అన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నవ్యాంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావడం అదృష్టం అన్నారు. చాణిక్య తెలివి తేటలతో అన్ని పార్టీలను ఏకం చేసి రాజధానిగా అమరావతి బిల్లును ఆమోదింప చేసుకోవడం అభినందనీయమన్నారు. సుస్థిర పాలన అందించడంలో ఆయనకు ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ బాసటగా ఉన్నారన్నారు. మంచి దూర దృష్టి గల నాయకునిగా చంద్రబాబు నాయుడుని అభివర్ణించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ చంద్రశేఖర రావు, ఈఈ గంగాధర్ రావు, ఎంపీడీవో రవిచంద్ర, రేణిగుంట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఏఈ అర్బన్ పుణ్యకోటి, ఏఈ రూరల్ మల్లికార్జున్, తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, తూకివాకం మాజీ సర్పంచ్ టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్, శ్రీకాళహస్తి మార్కెటింగ్ చైర్మన్ చెంచయ్య నాయుడు, కన్నలి మోహన్ రెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామస్వామి, రేణిగుంట క్లస్టర్ ఇంచార్జి డి పుష్ప నాదం, అన్నాసంపల్లి భాస్కర్ రెడ్డి, కన్నన్ రెడ్డి, జి పాలెం రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..




# జెఇఇ మెయిన్‌లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** జెఇఇ మెయిన్ 2026 ఫలితాల్లో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా 12వ ర్యాంకుతోపాటు అనేక మంది విద్యార్థులు టాప్ 1000లో చోటు సాధించారు. 99 పర్సెంటైల్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు నిలిచారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ ఈ మూడు సబ్జెక్టుల్లో విద్యార్థులు సమానంగా ప్రతిభ చూపారు. విద్యార్థుల అద్భుత విజయాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని ఆశ్రయ కన్వెన్షన్స్‌లో బుధవారం వేడుకలు నిర్వహించారు. మెరుగైన ర్యాంకు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్‌లో 100 పర్సెంటైల్ సాధించిన సాకేత్‌రెడ్డికి రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పూర్ణచందర్‌రావు చేతుల మీదుగా లక్ష నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్ వంటి పరీక్షల్లో విజయం సాధించాలంటే నిరంతర శ్రమతోపాటు ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరమన్నారు. తమ విద్యార్థులు ఈ రెండింటిపై దృష్టి పెట్టారన్నారు. రెసోనెన్స్‌లో ఫలితాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో బలమైన విద్యా పునాది ఏర్పడేలా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ధైర్యంగా పోటీ చేసే స్థాయికి వారిని తీర్చిదిద్దడం తమ లక్ష్యమన్నారు. ఈ ఏడాది ఫలితాలు గత ఏడాదితో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయన్నారు. రెండు సంవత్సరాల సమగ్ర ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ద్వారా ఇంటర్, జేఈఈని సమన్వయం చేయడం ఈ విజయానికి ముఖ్య కారణమన్నారు. విద్యార్థుల అంకితభావం, అధ్యాపకులు వినూత్న బోధన పద్ధతులు ఈ విజయాల వెనుక ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. థింక్ రిజల్ట్స్, థింక్ రెసోనెన్స్ అనే తమ నినాదానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. కాగా.. జెఇఇ మెయిన్ 2026 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 12ను అభినవ్ చిత్తూరి సాధించారు. సాకేత్‌రెడ్డి ఫిజిక్స్‌లో 100 పర్సెంటైల్ సాధించారు. 94 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్‌కు పైగా సాధించారు. 852 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ సాధించారు. అదేవిధంగా ఆలిండియా ర్యాంకులను... బునేటి ఆదిత్యరెడ్డి 147 ర్యాంకు, శెట్టిపల్లి అన్వితరెడ్డి 155ర్యాంకు, జీ ప్రగ్నేష్ 184 ర్యాంకు, సమృద్ధ్ భట్టాచార్య 242 ర్యాంకును, రేవంత్ వంగాల 365ర్యాంకును, స్నితిక 476 ర్యాంకును, అమరేంద్రనాయక్ 508 ర్యాంకును, డీ వివస్వత్ 529 ర్యాంకును, రూపమ్ గాయెన్ 622 ర్యాంకును, మనస్విని 630 ర్యాంకు, డీ యశస్వివర్ధన్ 877 ర్యాంకును, కే. సాయి చరణ్‌రెడ్డి 943 ర్యాంకును సాధించారు. రెసోనెన్స్ హైదరాబాద్ అన్ని క్యాంపస్‌ల నుంచి ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి.

## జెఇఇ మెయిన్-2026 ఫలితాల్లో

# శ్రీచైతన్య డబుల్ రికార్డు



### ఇద్దరు విద్యార్థులకు 300కు 300 మార్కులు

### ఓపెన్ కేటగిరిలో మొదటి ర్యాంకు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** జెఇఇ మెయిన్ -2026 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థ సంచలన రికార్డు సృష్టించింది. ఇద్దరు విద్యార్థులు 300 మార్కులకు 300లు సాధించి డబుల్ రికార్డు సృష్టించారు. ఓపెన్ కేటగిరిలో రెండు ఆలిండియా మొదటి ర్యాంకులను బివిసి శేఖర్‌రెడ్డి, పాసాల మోహిత్ 300కు 300 మార్కులు సాధించి కైవసం చేసుకున్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంకును ఆరూష్ సింఘాల్, 11వ ర్యాంకును యష్‌వర్ధన్, జెఆర్ మణిదీప్‌రెడ్డి 15వ ర్యాంకును సాధించారు. టాప్ 10లోపు మూడు ర్యాంకులతోపాటు 100లోపు , 1000లోపు ర్యాంకులను అత్యధికంగా శ్రీచైతన్య విద్యార్థులు సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది గత సంవత్సరం కంటె అత్యధిక ర్యాంకులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు రికార్డు సృష్టించారు. అదేవిధంగా శ్రీచైతన్య అకాడమి బెంగళూరు విద్యార్థి నిశాంక్ వ్యాస్ ఎఐఆర్ 396 సాధించాడు. ఎఐఆర్ 98, 396, 826 తదితర ర్యాంకులను శ్రీచైతన్య సాధించింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ మూడేళ్లుగా జెఈఈ మెయిన్‌లో వరుసగా 300/300 మార్కులు సాధిస్తూ హ్యాట్రిక్ రికార్డు సృష్టించడం ఒక్క శ్రీచైతన్యకే సాధ్యమైందన్నారు. మైక్రో షెడ్యూల్స్, నిరంతర ఇంటర్నల్ ఎగ్జామ్స్, అత్యుత్తమ ఫ్యాకల్టీ, అధునాతన లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ శ్రీచైతన్య విద్యార్థుల విజయానికి వెన్నెముకగా నిలిచాయన్నారు. తమ విజయాల్లో ఇన్ఫినిటి ఆన్‌లైన్ యాప్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు జైలు శిక్ష

**తిరుపతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే న్యాయమూర్తి నరసింహ మూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. కోర్టులో విచారణ దశలో ఉన్న ఎర్రచందనం అక్రమ రవాణా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 2020లో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ అటవీ పరిధిలోని చామల రేంజ్‌లో అరెస్టయ్యారు. తమిళనాడు, విల్లుపురం జిల్లా సాతానూరు గ్రామానికి చెందిన వెల్లి ఇలై రాజా, విల్లుపురం జిల్లా ఎరక్కమ్ పట్టు గ్రామానికి చెందిన పలని స్వామి. వీరిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఆరు లక్షలు రూపాయలు జరిమానా విధించారు.

## నందిగామ మున్సిపల్ ఆఫీసులో ఎసిబి సోదాలు

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి సోదాలు జరిగాయి. అక్రమ గ్రావెల్ తరలింపు, మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించారు. గతంలో పనిచేసిన ఇద్దరు మున్సిపల్ అధికారులను ఎసిబి అధికారులను ఇదే అంశంలో పిలిపించి ప్రశ్నిస్తున్నారు. అలాగే ఇద్దరు కౌన్సిలర్లు, 8 మంది సిబ్బందిని ఎసిబి అధికారులు ప్రశ్నించారు. పలు రికార్డులను సీజ్ చేయడంతో పాటు, వివిధ అంశాలకు సంబంధించి కీలక సమాచారాన్ని సంగ్రహించినట్లు సమాచారం.

## మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రిమాండ్‌లో ఉన్న మద్యం కేసు నిందితులను ఎసిబి అధికారులు కోర్టులో హాజరుపరిచారు. నిందితుల రిమాండ్ బుధవారంతో ముగియడంతో కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో నిందితులు కోర్టుకు హాజరయ్యారు. రిమాండ్‌ను మే 6కు పొడిగిస్తూ ఎసిబి కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. నిందితుల్లో కొందరిని స్థానిక జైలు రిమాండ్‌కు పంపించారు. మరో నిందితుడు ప్రణయ్ ప్రకాష్‌ను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారు.

### శాంతి కస్టడీ పిటిషన్‌పై విచారణ పూర్తి

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో అరెస్టై జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి కస్టడీ పిటిషన్‌పై విచారణ పూర్తి అయ్యింది. ఉత్తర్వులు రేపటికి ఎసిబి న్యాయస్థానం వాయిదా వేసింది. ఇప్పటికే శాంతిని అధికారులు రెండు రోజులు పాటు విచారించారు. విచారణలో సహకరించలేదని మరిన్ని అక్రమాసులకు సంబంధించిన విషయాలు రాబట్టేందుకు అధికారులు మరో 3 రోజులు కస్టడీ కోరారు.

## రామానుజాచార్యుల గ్రంథ సంపదకు విశ్వఖ్యాతి

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రామానుజాచార్యుల గ్రంథాలు ఆధ్యాత్మికత, తాత్వికతతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని డాక్టర్ చక్రవర్తి రంగనాథన్ తెలిపారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో మూడు రోజుల పాటు జరిగిన అవతార మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రామానుజాచార్యులు భక్తి మార్గాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన బోధనలు దేశవ్యాప్తంగా విస్తరించాయని తెలిపారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజ్యలక్ష్మీ ౖ బృందం ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో భాష్యకారుల సాత్తుమొర

**తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో భాష్యకారులు (శ్రీ రామానుజాచార్యులు) సాత్తుమొర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భాష్యకారుల బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారిని భాష్యకారుల సన్నిధికి తీసుకువచ్చి ఆస్థానం నిర్వహించారు. రాత్రి స్వామి, భాష్యకారులు మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలి

**తిరుపతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను బుధవారం మధ్యాహ్నం ఇంచార్జి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.




## మంచి సమాజం కోసం పోరాటం చేద్దాం

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి

**తిరుపతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ జాతిపై దోపిడి, పీడన లేని మంచి సమాజం కోసం పోరాటం చేద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్టా హరినాథరెడ్డి పిలుపు నిచ్చారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలో గంధమనేని శివయ్య భవన్ లో బుధవారం ప్రపంచ విప్లవ వీరుడు, సోవియట్ యూనియన్ స్థాపకుడు కామ్రేడ్ వ్లాదిమిర్ లెనిన్ 156వ జయంతి వేడుకలను సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంచి సమాజం లెనిన్ పోరాటం చేసి సఫలీకృతుడయ్యారన్నారు. కారల్ మార్క్స్ సిద్ధాంతంతో పోరాటం చేసి సోవియట్ రష్యాలో కార్మిక రాజ్యం ఏర్పాటు చేశాడన్నారు. దాదాపు 70ఏళ్ల పాటు సోవియట్ రష్యాలో కమ్యూనిస్టులు పాలన చేశారన్నారు. ప్రపంచంలోనే 1/3వంతు భూభాగాన్ని కమ్యూనిస్టులు పాలన చేయడానికి లెనిన్ బాటలు వేశారన్నారు. సోవియట్ యూనియన్ ఉన్నపుడు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్ని రకాలుగా చేయూత నిచ్చిందన్నారు. సోవియట్ యూనియన్ పతనం తరువాత అగ్ర రాజ్యమైన అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తోందన్నారు. ఐక్య రాజ్య సమితి నిబంధనలను సైతం అమెరికా తుంగలో తొక్కుతోందన్నారు. ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి ప్రపంచ ప్రజలందరూ ఇబ్బందులు పడటానికి అమెరికా కారణమవుతోందన్నారు. ఈ యుద్ధం కారణంగా పెట్రో ఉత్పత్తుల సంక్షోభం ఏర్పడుతోందన్నారు. మన దేశంలో కూడా ఎన్నికల తరువాత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగే విధంగా సంకేతాలు వస్తున్నాయని హరినాథరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సహాయ కార్యదర్శి బండి చలపతి, ప్రజా సంఘాల నాయకులు నదియా, పద్మనాభ రెడ్డి, ఎన్‌డి రవి, గోవిందస్వామి, ఉదయ్, నాగరాజు, బలరాం, మహేంద్ర, మంజుల, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులు నిజమే

● మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ



**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో లైంగిక వేధింపులు నిజమేనని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పష్టం చేసారు. బాధితుల సాక్ష్యాలు, కథనాలు వారి ఆరోపణలకు బలం చేకూర్చాయని స్పష్టం చేసారు. ఈ విషయంలో నిందితులపైన, బాధితుల ఫిర్యాదులపై స్పందించని వైద్య కళాశాల అధికార యంత్రాంగంపైన విచారణ జరుపుతామన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు వచ్చారు. విద్యార్థినులపై ఫ్యాకల్టీ లైంగిక వేధింపులంటూ మహిళా కమిషన్‌కు మెయిల్ వచ్చిందని, ఫిర్యాదుపై విచారణకు వచ్చినట్లు ఆమె తెలిపారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించామని రాయపాటి శైలజ వివరించారు. కళాశాలలోని అంతర్గత కమిటీ ఇప్పటికే విచారణ జరిపిందని అందులో అంతా బాగున్నట్లు చూపించారని, కానీ విద్యార్థినులతో మాట్లాడితే లైంగిక వేధింపులు నిజమే అని నిర్ధరణ అయ్యిందని శైలజ వెల్లడించారు.

### బాలికల కళాశాల ప్రాంగణంలో కోఎడ్యుకేషన్ కళాశాల

## హైకోర్టు అసంతృప్తి

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** బాలికల కళాశాల ప్రాంగణంలో కోఎడ్యుకేషన్ కళాశాల ఏర్పాటు చేయడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 50 సెంట్ల స్థలంలో కళాశాల ఎలా నిర్మిస్తారని ప్రశ్నించింది. విద్యాశాఖ అధికారుల తీరును తప్పుపట్టింది. యథాతథ స్థితిని పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. నంద్యాల అర్బన్ మండలం మూలసాగరంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన భూమిలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కొంతభూమిని కేటాయించడంపై న్యాయస్థానం తప్పుపట్టింది. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ జూనియర్ కళాశాల నిర్మించడాన్ని సవాల్ చేస్తూ నంద్యాలకు చెందిన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై ప్రదాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ జరిపింది.

## జగన్.. ఇకనైనా విచిత్రమైన ఆలోచనలు మానేయాలి: మంత్రి సవిత

**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి నేత ప్రభుత్వంపై కువిమర్శలు మానుకోవాలని మంత్రి సవిత హితవు చెప్పారు. ఆమె మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో జగన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసారు. దోచుకోవడం, దాచుకోవడమే జగన్‌కు తెలిసిన పనులని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ గుర్తు ఫ్యాన్ కాదు, గొడ్డలిగా మారుతోందని మంత్రి విమర్శించారు. కుర్చీ కోసం, అధికారం కోసం సొంతవాళ్లనైనా బలి తీసుకుంటారని, హత్యకు గురైన పెద్దదస్తగిరి భార్య కూడా చాలా బాధ పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో నమ్మకంతో జగన్ ఏ అరాచకం చేయమంటే అదే చేశామని, జగన్‌కు దోచిపెడితే నా భర్త శవాన్ని గిఫ్ట్‌గా పంపించారని పెద్దదస్తగిరి భార్య బాధపడుతోందని మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా సైకో ఆలోచనలు మానేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి సవిత కోరారు. కులాలు, ప్రాంతాల మధ్య శవరాజకీయాలు చేయడం మంచిది కాదని, పెద్దదస్తగిరి కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదో జగన్ చెప్పాలని, శవరాజకీయాలు చేయడం జగన్‌కు అలవాటే అని మంత్రి మండిపడ్డారు.

## హజ్‌యాత్రికుల లగేజీ కష్టాలు



**గన్నవరం (కృష్ణా), ఏప్రిల్ 22 ప్రభాత వార్త:** విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్‌యాత్రకు వెళ్ళిన హజ్ యాత్రికులకు లగేజీ కష్టాలు ఎదురయ్యాయి. గన్నవరం విమానాశ్రయం నుండి ఈనెల 18, 19 తేదీల్లో మొత్తం 337 మంది హజ్‌యాత్రకు బయలుదేరి వెళ్ళారు. ఎయిర్‌లైన్స్ అధికారుల సమన్వయ లోపం వల్ల 19వతేదీ విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి ప్రత్యేక విమానంలో సౌదీకి వెళ్ళిన యాత్రికులకు చెందిన 289 లగేజీ బ్యాగులు ఎంబార్కేషన్ పాయింట్‌లోనే ఉండిపోయాయి. ఇక్కడి నుండి సౌదీవెళ్ళి దాదాపు నాలుగురోజులు గడచినా లగేజీ అందకపోవటంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాత్రికుల లగేజీ కష్టాలపై హజ్‌కమిటీసభ్యులు మీర్జా అబిద్‌హుస్సేన్‌బేగ్ వివరణ ఇస్తూ లగేజీ ఇక్కడే ఉండిపోయినట్లు గుర్తించి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టామని కేంద్రమంత్రులు కిరణ్‌రిజుజు, రామ్మోహన్‌నాయుడులతో మాట్లాడి కలకత్తా నుండి లగేజీని మదీనాకు పంపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. లగేజీకి భీమా చేయించటంతోపాటు రెండు కంటేయినర్లలో లోడు చేసి కోల్‌కత్తాకు పంపించామన్నారు. లగేజీని 23వతేదీ మధ్యాహ్నం 2గంటలకు విమానంలో పంపిస్తున్నామని, రాత్రి 8గంటలకు మదీనా చేరుకునేలా ఏర్పాటు చేసామన్నారు. సమస్యకు కారణమైన ఎయిర్‌లైన్స్ పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని ఉక్కుపాదంతో అణచివేయండి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్



అధికారులతో సమావేశమైన సిఎస్ సాయి ప్రసాద్

**సచివాలయం, ఏప్రిల్ 22 ప్రభాత వార్త:** సమాజానికి చేటు చేకూర్చే గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని రాష్ట్రంలో ఎట్టిపరిస్థితుల్లోను ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో నార్కొటిక్స్ కోఆర్డినేషన్- 2026 ఏడాదికి మొదటి త్రైమాసిక సమావేశం జరిగింది. సమాజానికి చేటుగా పరిణమిస్తున్న గంజాయి ఇతర మత్తు పదార్థాల సేవనాన్ని పూర్తి స్థాయిలో నివారించాల్సిన అవసరం ఉందని ఆదిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఈగల్ చీఫ్ రవి కృష్ణను ఆదేశించారు. గంజాయి డ్రగ్స్ ఒక శాఖో రెండు శాఖలకో సంబంధించిన కాదని ఇదోక సామాజిక సమస్య అని కావున వీటి నియంత్రణ విష యంలో అత్యంత కఠినంగా వ్యవ హరించ గలిగితేనే వీటిని పూర్తి స్థాయిలో నివారించ గలుగుతామ న్నారు. అందువల్ల అన్ని శాఖలు ఈ విషయంలో మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వీటి బారి నుండి సమాజాన్ని మన పిల్లలను కాపాడు కోవాల్సి న ఆవశ్యకత ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. గంజాయి సాగు, రవాణా నియంత్రణపై సమ న్వయం చేసుకునేందుకు వీలుగా ఓడిస్సా సీఎస్‌కు డిఒ లేఖ రాయ నున్నట్లు సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా వివిధ మత్తు పదార్థాలు అమ్మకాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉందని సీఎస్ సాయి ప్రసాద్ స్పష్టంచేశారు.

ఇందుకు సంబంధించి హోల్‌సేల్ డీలర్లు వివిధ డ్రగ్స్‌ను ఎంత మొత్తంలో కొనుగోలు చేసి రిటైల్ అమ్మకాలు చేస్తున్న వివరాలను డ్రగ్స్ రకం, బ్యాచ్ తదితర వివరాలను ముందు గానే ఆన్‌లైన్ ద్వారా ఈగల్ కార్యా లయానికి తెలియజేసేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆవిధంగా చేయడం వల్ల ఎన్డీ ఎంఎ, కోకైన్ వంటి డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రణ చేయవచ్చని సీఎస్ పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల సేవనంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఈగల్ చీఫ్ రవికృష్ణను సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో విజయవాడ డిఆర్ఐ డిడి సాహస్ సౌర్య, ఆర్‌పిఎఫ్ ఎస్డిఎస్సీ షణ్ముఖ వడివేల్, విశాఖపట్నం నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ డైరెక్టర్ ఫంకజ్ ద్వివేది పాల్గొనగా వర్చువల్‌గా డిజిపి హరిష్‌కుమార్ గుప్తా, వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, విశాఖ పట్నం ఐజి గోపినాథ్ జెట్టి, పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పటిష్ట ప్రణాళికలతో తాతయ్యగుంట గంగమ్మజాతర విజయవంతం చేద్దాం

● నిరంతరం నిఘాలో ఆలయం పరిసరాలు

● తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



**తిరుపతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత పవిత్రమైన వేడుకగా వారంరోజులపాటు జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాలను ప్రణాళికా బద్ధంగా విజయవంతం చేద్దామని తిరుపతి ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ఆలయంలోపల, పరిసరాల్లో సిసి కెమెరాలతో నిరంతరం పహారా వుంటుందన్నారు. మేనెల 5వతేదీ నుండి 12వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మజాతర మహోత్సవ వేడుకల భద్రత, భక్తుల క్యూలైన్ల ఏర్పాటు, అమ్మవారి దర్శనం తదితర వివరాలపై బుధవారం రాత్రి ఆలయం సందర్శించారు. తిరుపతి నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ శారదాదేవి, తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ భక్తవత్సలం, సిఐ పివిఎస్ రామకిశోర్, ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఇఒ జయకుమార్‌తో కలసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో దేవాలయ తనిఖీలు నిర్వహించి, భక్తులందరికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునే విధంగా ఏర్పాటుచేస్తామని తెలిపారు. డ్రోన్ కెమెరాల సహాయంతో రద్దీ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా బందోబస్తు మార్పులు చేపట్టాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.



## వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణం

● దుర్గమ్మవారికి 107.500 గ్రాముల బంగారు హారం



**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆదిదంపతుల తనయుడు, దేవతల సేనాని అయిన సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం వేడుకలను అర్చక స్వాములు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చూడముచ్చటగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ రాధాకృష్ణ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**దుర్గమ్మవారికి 107.500 గ్రాముల బంగారు హారం:** శ్రీ దుర్గమ్మవారికి మంగళవారం నిజామాబాద్‌కు చెందిన భక్తుడు తోడుపునూరి శ్రీనివాస్ 107.500 గ్రాముల బరువైన సుమారు రు.16లక్షల 30వేల విలువైన బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని ఈ హారంలో పచ్చలు మరియు ఎరుపు రాళ్ల (కెంపులు) పొదిగి ఉన్నాయి.

**ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ అమలుపై వేగవంతమైన అడుగులు:** ఇంద్రకీలాద్రిని, పరమ పవిత్రమైన కృష్ణానదీతీరాన 'అంతర్జాతీయ ఆధ్యాత్మిక గమ్యస్థానంగా' తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మహత్తర కార్యంలో భాగంగా, దేవస్థాన ఇఒ వీకే శీనా నాయక్ బుధవారం దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, బెంగళూరుకు చెందిన ఎన్ఐఆర్ఎం, విజయవాడ ఎస్‌పిఎ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నదీ తీరంతో ఆధ్యాత్మిక అనుసంధానం కలిగేలా వ్యూ పాయింట్లు, ధ్యాన కేంద్రాలను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇంద్రకీలాద్రి చరిత్రలో మైలురాయిగా నిలిచే పాశుపాతాలయం నిర్మాణానికి అవసరమైన భూగర్భ పటిష్టతపై ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తలు ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. విశాలమైన క్యూ కాంప్లెక్స్‌లు, రెండవ ఘాట్ రోడ్ నిర్మాణం ద్వారా సాఫీగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు పార్కింగ్ కోసం అందుబాటులో ఉన్న స్థలాన్ని గరిష్టంగా వినియోగించుకునేలా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు అత్యంత కీలకమైన రెండవ ఘాట్ రోడ్ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక అంశాలపై ఆయా అధికారులతో చర్చించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న సుందరీకరణ పనులు, ఎస్‌పిఎ వారు అందించే ప్లాన్స్‌ను సమన్వయం చేసుకుంటూ ఇంద్రకీలాద్రిని అత్యంత సుందరమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈఈ కోటేశ్వరరావు, రమాదేవి, డీఈ రవీంద్రనాథ్ ఠాగూర్, ఇతర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## రబీ ధాన్యం పూర్తిగా కొనుగోలు: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్



**విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పౌరసరఫరాలసంస్థ ఆధ్వర్యంలో పూర్తిగా కొనుగోలు చేస్తుందని, ఈవిషయంలో రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం విసన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసారు. ఈసందర్భంగా ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రబీలో ఇప్పటి వరకు 135 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 74కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, వీటి ద్వారా 25,808 మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. 10.75లక్షల గోనెసంచులు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఏవిధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 7గంటల నుండి రాత్రి 8గంటలలోపు 9154970454కు సమస్యలపై సమాచారం అందించాలని రైతులకు సూచించారు.

**అన్నార్తుల ఆకలితీర్చటం పవిత్రకార్యం:** అన్నార్తుల ఆకలితీర్చటం పవిత్రకార్యమని, ఇళ్ళలో జరిగే శుభకార్యాలను పురస్కరించుకుని అన్నక్యాంటిన్‌లకు విరాళం ఇవ్వాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. బుధవారం తిరువూరులోని అన్నక్యాంటిన్‌ను సందర్శించిన ఆయన క్యాంటిన్‌లో పేదలతో కలిసి భోజనం చేసారు. అన్నక్యాంటిన్‌లో ఒకరోజుపూర్తిగా అల్పాహారానికి రూ.7,700, మధ్యాహ్న భోజనానికి రూ.13,600, రాత్రి భోజనానికి రూ.8,500 ఖర్చుఅవుతుందని ఒక్కో అన్నక్యాంటిన్‌లో ఒకరోజు పూర్తిగా అహారం అందించేందుకు రూ.29,800లు ఖర్చుఅవుతుందని కలెక్టర్ వివరించారు. దాతలు ముందుకు వచ్చి అన్నక్యాంటిన్‌కు విరాళం ఇవ్వాలని కోరారు.

**ఇరిగేషన్ ఈఈ గంగయ్య సరెండర్:** ఎన్‌టిఆర్‌జిల్లా ఇరిగేషన్ ఈఈ(స్పెషల్ డివిజన్) గంగయ్యపు ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. జిల్లాలో నీటిసంరక్షణ కార్యక్రమాలు అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామని, వీటి అమలులో గంగయ్య క్రమశిక్షణా లోపంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు.


## తల్లి సొమ్మును బెట్టింగులో పోగొట్టిన కొడుకు

**గుంటూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లి కష్టపడి సంపాదించిన సొమ్మును ఓ కొడుకు క్రికెట్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టాడు. తల్లి బ్యాంకులో దాచుకున్న రూ. 3 లక్షలు పోగొట్టిన ఓ మైనర్ కొడుకు అదృశ్యమైన ఘటన మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన ఓ కుటుంబం కొన్నేళ్లుగా గుంటూరులో నివాసం ఉంటుంది. తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యత తల్లిపై పడింది. వీరికీ ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో తల్లి ఖాతాలోని రూ.3 లక్షలు బెట్టింగ్లో పెట్టి నష్టపోయాడు. నెలరోజుల కిందట పెద్ద కుమారుడితో కలిసి తల్లి బ్యాంకుకు వెళ్లి ఖాతా పరిశీలించగా డబ్బులు లేవని తెలిసింది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన చిన్నకుమారుడు కనిపించకుండా పోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

### డిజిపి కార్యాలయ సిబ్బంది విధుల నిర్వహణకు

## బిజినెస్ రూల్స్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో పనిచేసే సిబ్బంది విధుల నిర్వ హణ, సర్వీసు నిబంధనలపై స్పష్టతనిచ్చే బిజినెస్ రూల్స్ అండ్ జనరల్ ఇన్‌స్ట్రక్షన్స్ పేరిట కొత్తగా రూపొందించిన హ్యాండ్ బుక్‌ను డిజిపి శివధర్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ హ్యాండ్ బుక్ పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా వుంటుందని, మార్గ దర్శకంగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పోలీసు విభా గాలకు చెందిన ఫైళ్లను పరిశీలించే సమయంలో పాటించాల్సి న విధి, విధా నాలు ఈ హ్యాండ్ బుక్‌లో పొందు పరచడం జరిగిందని డిజిపి తెలిపారు. గతంలో తాను పర్సనల్ విభాగం అదనపు డిజిగా పనిచేసిన స మయలో ఈ హ్యాండ్ బుక్ గురించి చర్చించానని, అందుకు అనుగుణంగానే సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్ సహా మరికొందరు అధి కారులతో సంప్రదించి హ్యాండ్ బుక్‌ను రూపొం దించి, అందులో నియమాల గురించి వివరంగా చెప్పడం జరిగిందని డిజిపి తెలిపారు. నూతనంగా వెలువడుతున్న జిఓలు, మారు తున్న విధానాలకు అనుగుణంగా సిబ్బందికి అర్థమయ్యేలా ఈ హ్యాండ్ బుక్‌ను తీర్చిదిద్దిన కమిటీ సభ్యులను ఆ యన అభినందించారు. సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్ మాట్లాడుతూ సర్వీస్ నిబంధనలపై క్షేత్రస్థాయిలో ఉద్యోగుల నుంచి సేకరించిన సమాచారం, ఎదు ర్కొంటున్న విషయాలపై పరిగణలోకి తీసుకుని ఈ హ్యాండ్‌బుక్‌ను తయారు చేసినట్లు తెలిపారు.



బిజినెస్ రూల్స్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న డిజిపి శివధర్ రెడ్డి, చిత్రంలో సర్వీస్ రూల్ రివిజన్ కమిటీ ఛైర్మన్ వై.గంగాధర్, అదనపు డిజి స్వాతి లక్రా, ఐజి గజారావు భూపాల్ తదితరులు



## దేశ అంతర్గత భద్రతలో సిఆర్‌పిఎఫ్ కీలక పాత్ర

● దేశంలో అతిపెద్ద పారామిలటరీ సంస్థ సిఆర్‌పిఎఫ్ ● ధైర్యం, నిజాయితీ, త్యాగం, సమర్పణకు ప్రతీక

● హర్యానా గురుగ్రాం సిఆర్‌పిఎఫ్ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** దేశ అంతర్గత భద్రతలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నక్సలిజం, ఉగ్రవాద నిర్మూలనలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

ధైర్యం, నిజాయితీ, త్యాగం, సమర్పణకు సిఆర్‌పిఎఫ్ ప్రతీకగా నిలిచిందన్నారు. మానవతా సాయం అందించడంలోనూ సిఆర్‌పిఎఫ్ ముందంజలో ఉండటం ప్రశంసనీయమని కొనియాడారు.

బుధవారం ఉదయం హర్యానాలోని గురుగ్రాం సిఆర్‌పిఎఫ్ అకాడమీలో జరిగిన 56వ బ్యాచ్ గెజిటెడ్ అధికారుల స్నాతకోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, అకాడమీ డైరెక్టర్ అమిత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. తొలుత అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి అంజలి ఘటించిన కేంద్ర మంత్రి అనంతరం స్నాతకోత్సవ వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ పోలీసులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు.

సిఆర్‌పిఎఫ్ 56వ బ్యాచ్ శిక్షణార్థి అధికారుల స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన స్నాతకోత్సవ పరేడ్ సిఆర్‌పిఎఫ్ అత్యున్నత స్థాయి క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తోంది. పరేడ్‌లో పాల్గొన్న అధికారులు 52 వారాల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని విధులకు సిద్ధమవడంవ సంతోషం. మాతృభూమికి సేవ చేయడానికి తమను తాము అంకితం చేసుకోవడం కంటే గొప్ప కర్తవ్యం మరొకటి లేదు. దేశసేవ అనే పవిత్ర ప్రతిజ్ఞే అత్యున్నత కర్తవ్య నిబద్ధతకు సంకేతం, ఇది ఏ పౌరుడైనా తన దేశం కోసం తీసుకోగలిగే అత్యుత్తమ ప్రతిజ్ఞ. దేశసేవలో సమర్పణ, నిబద్ధత, త్యాగం అంతర్భాగాలుగా ఉంటాయి.

# రూ.148 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం

## 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపండి - ఇన్ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22:** రాష్ట్రంలో మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడం మూలంగా అవి నిరూపయోగంగా ఉన్నాయి, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఇన్ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు పంపితే ఆమోదం తెలపడం, అమలు చేయడం సులభం అవుతుందని పనులు వేగవంతం అవుతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 1:4 నిష్పత్తిలో వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపితే సబ్ కమిటీలు చర్చించి ఆమోదం తెలుపుతామని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని జూన్ 8 లోపల అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని తాను ప్రత్యేకంగా ప్రతి వారం సమీక్షిస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం, నాణ్యతతో పనులు పూర్తి చేయడం వంటి అన్ని అంశాలను తాను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసి కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతున్న హరీష్‌రావు

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్‌సిలను అమలు చేసి యూనియన్లను పునరుద్ధరించాలి: హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ సర్కార్ ఎన్నిల సమయంలో ఆర్టీసి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని..గెలిచి గద్దెనెక్కి రెండున్నర యేండ్లు గడిచిన సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు గురి చేయడం సరి కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసి బస్సు డిపో ఆవరణలో కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన బుధవారం సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్‌సిలను అమలు చేసి యూనియన్లను పునరుద్దారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ వరంగల్ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించారని త్వరలోనే ఆర్టీసిని మొత్తం ప్రైవేటు పరంగా చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు సైతం కట్టడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. పక్క రాష్ట్రంలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేశారని మీరెందుకు ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసి కార్మికులను వెంటనే చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే బిఆర్ఎస్ అండగా నిలిచి ఆందోళనలు ఉధృతం చేస్తుందన్నారు. ప్రభుత్వం కార్మికుల సమ్మెను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహాలక్ష్మి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్‌గౌడ్ అధికార దాహంతో ఇకార్మికుల సమస్యలను పక్కన పెట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తప్పు బట్టారు. ఆయన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు, గుడాల శ్రీకాంత్‌గౌడ్, ఆర్టీసి కార్మిక నాయకులు నక్క మల్లేశం, బిఎస్.గౌడ్, రవీందర్‌గౌడ్, హేమలత, కళావతి, కె.ఎస్. నారాయణ, పర్శరాములు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల అనాలోచిత నిర్ణయంతోనే దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం

## బిజెపి సీనియర్ నాయకురాలు కరుణ గోపాల్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**దేశంలో ప్రతిపక్ష పార్టీల అనాలోచిత నిర్ణయంతోనే దక్షిణ రాష్ట్రాలకు తీరని నష్టం జరుగుతుందని బిజెపి సీనియర్ నాయకురాలు కరుణ గోపాల్ అన్నారు. బుధవారం బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడం ద్వారా దక్షిణ భారతదేశంలోని లోక్‌సభ సీట్లు తగ్గే ప్రమాదాన్ని వారే స్వయంగా కొనితెచ్చుకున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ సీట్లను ప్రోరేటా పద్ధతిలో పెంచాలని ఆలోచించారు. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళం వంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉండేది. కానీ విపక్షాలు దీనిని అడ్డుకోవడంతో ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలోనే సెన్సస్, డిలిమిటేషన్ ప్రక్రియలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇది పూర్తవడానికి కనీసం 56 ఏళ్లు పడుతుంది. ఫలితంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణ రాష్ట్రాలు సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని, ఆర్టికల్ 334డి ప్రకారం డిలిమిటేషన్ లేకుండా మహిళా రిజర్వేషన్ అమలు అసాధ్యం. కోవిడ్ కారణంగా సెన్సస్ ఆలస్యమైందనేది వాస్తవం అన్నారు. గతంలో (2004-2014) అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఈ బిల్లును లోక్‌సభలో పట్టించుకోలేదు. గతంలో పార్లమెంట్‌లో బిల్లును చింపివేసినా, మహిళా నాయకులను అవమానించినా విపక్ష మహిళా నేతలు నోరు మెదపలేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మహిళల కోసం "వూమ్ టు టూమ్" (పుట్టుక నుండి మరణం వరకు) అన్నట్లుగా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముద్రా లోన్లు, స్టార్టప్‌లు, ఆయుష్మాన్ భారత్ మరియు డ్రోన్ దీదీ వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలు సమానంగా భాగస్వాములయితే దేశ జిడిపి 30శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. అందుకే మహిళలు కేవలం ఓటర్లుగానే కాకుండా పాలసీ మేకర్స్‌గా ఎదగాలనేది ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష అన్నారు. మహిళలకు అధికారం కట్టబెట్టాలనే మోడీ సంకల్పానికి అడ్డుతగులుతూ, విపక్షాలు ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. మహిళలు ఈ మోసాన్ని గమనిస్తున్నారు, రాబోయే రోజుల్లో విపక్షాలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

# గిరిజన వర్సిటీలో కొత్త కోర్సులకు అనుమతి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ములుగులోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న వాటితో పాటు, మరో మూడు కొత్త కోర్సులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ అనుమతులు జారీచేసింది. ఈ విషయాన్ని గిరిజన యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గిరిజన విశ్వవిద్యాలయంలో 2024 విద్యా సంవత్సరం లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఇందులో నాలుగేండ్లపాటు కొనసాగే బీఏ ఇంగ్లీష్, బీఏ ఎకనామిక్స్ కోర్సులు రెండేండ్లనుంచి కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి నాలుగేండ్ల బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీ ఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ అండ్ డాటా అనలిస్ట్ కోర్సులతో పాటు, బీఎస్సీ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్ కోర్సులను అందించనున్నారు.

# కాళేశ్వరం కేసులో క్లీన్‌చిట్ కోసం బిజెపితో హరీష్‌రావు మంతనాలు

## భువనగరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్22,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో కేసులో క్లిన్ చిట్ ఇవ్వాలని హరీష్ రావు ఢిల్లీలో బిజెపి నాయకులతో మంతనాలు చేస్తున్నారని భువనగిరి ఎంపి చామకిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో భువనగిరి లోక్ సభ సభ్యులుచామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కమీషన్ రిపోర్టును హైకోర్టు తప్పుపట్టలేదనీ తెలిపారు. బిఆర్ఎస్ నేతలు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారనీ ప్రశ్నించారు.బిఆర్ఎస్ సంబురాలు చేసుకునే విధంగా కోర్టు తీర్పులో ఏముందనీ అడిగారు. హైకోర్టు తీర్పు కాపీలు వచ్చిన తర్వాత ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్ళాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుందనీ తెలిపారు.మేడిగడ్డ పిల్లర్లు కుంగిన తర్వాత అధికారులు,రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ఉందని కమీషన్ రిపోర్టులో ఉందనీ చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సైతం ఇదే అంశాన్ని చెప్పిందన్నారు. పిసిఘోష్ కమీషన్ రిపోర్ట్ ఆధారంగా సిబిఐ విచారణ చేయాలని ప్రభుత్వం అడగలేదనీ అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పింది తప్పా,కరెక్టా బిజెపి చెప్పాలనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిజెపికి బాధ్యత పెరిగిందనీ,కిషన్ రెడ్డి,బండి సంజయ్ కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీకి క్లిన్ చిట్ వచ్చిందా లేదా అనేది చెప్పాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. జస్టిస్ పిసి ఘోష్ కమీషన్ రిపోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో సాయంత్రం కల్లా నిర్ణయం తీసుకుంటామనీ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పలు సంస్థలు చెప్పాయి.ఇప్పుడు సిబిఐ కాళేశ్వరం ప్రాజెక్ట విషయంలో ఏం జరిగిందో నిజాలు నిగ్గ తేల్చాలనీ అన్నారు.

# హైదరాబాద్‌కు 650 మంది ఆదివాసీలు

## సాంస్కృతిక, విద్యా విషయాలపై అవగాహనే లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు చెందిన సుమారు 650 మంది ఆదివాసీల కోసం మహానగరమైన హైదరాబాద్‌కు మొట్టమొదటిసారిగా అవగాహనా యాత్రను నిర్వహిస్తోంది. నగర జీవితంపై వారికి సాంస్కృతిక, విద్యాపరమైన అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలను ఈ ఆదివాసీ బృందాలు పరిశీలించాయి. రాష్ట్రంలోని ఉట్నూర్ ప్రాంతం నుండి ఎంపిక చేసిన ఆదివాసులను ఈ నెల 22 నుండి 26 వరకు జరిగే ఈ పర్యటన కోసం అధికారులు ఈ 650 మందిని మూడు బృందాలుగా విభజించారు. ప్రతి బృందంలో 200 నుండి 250 మంది ఆదివాసులు ఉన్నారు. వీరు రెండు రోజుల పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో బస చేస్తారు. అడవులలోని జీవితానికి, నగర జీవితానికి మధ్య వారధిని నిర్మించడం, తద్వారా సంస్కృతుల సమ్మేళనాన్ని అందించడం ఈ పర్యటన ఉద్దేశ్యమని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకమైన ఆదివాసీ సంప్రదాయాలను, ఆధునికతను వెలుగులోకి తీసుకు రావడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# పాఠశాలల్లో సామాన్యశాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేయండి

## - ప్రభుత్వ విద్యాసలహాదారు కెకెను కోరిన మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త :** పాఠశాల విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి ప్రతిపాఠశాలలో సామాన్యశాస్త్రంకు చెందిన ప్రయోగశాలను ఏర్పాటు చేసి భౌతిక,రసాయన, జీవ, వృక్షశాస్త్రాలకు చెందిన పరికరాలు, ప్రయోగదీపికల నమోనాలను అందుబాటులో ఉంచాలని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ విద్యా సలహాదారు కె.కేశవరావును కలిసి సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడికి అందుబాటులో మ్యాప్‌లు అందుబాటులో ఉండాలని భూగోళం చరిత్ర పౌరశాస్త్రం ఆర్థికశాస్త్రం అభ్యసనను సరళీకృతం చేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా విద్యార్థికి ప్రపంచీకరణ అనుభూతి చెందడానికి వీలవుతోందని వివరించారు. విద్యాకమిషన్ లో ఉపాధ్యాయుల వేతనాల అంశాలను తొలగించాలని,వెంటనే పిఆర్‌సి ప్రకటించాలని,హెల్త్‌కార్డులు పెండింగ్ బిల్లులు,డిఎలు చెల్లించాలని కోరారు.

ఓల్డ్‌పెన్షన్ కు సిపిఎస్ ఉద్యోగులను మార్చే ప్రక్రియ వేగవంతం చేయాలనికోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఆర్టీసి సమ్మెను నివారించడానికి ప్రయత్నాలు చేయాలనికోరారు.

# ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ జోషి నియామకం రద్దుపై..

## జూన్ 15కు వాయిదావేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ పదవికి తన నియామకాన్ని రద్దు చేసిన క్యాట్ ఉత్తర్వును సవాలు చేస్తూ డాక్టర్ జయతీర్థ జోషి దాఖలు చేసిన రిట్ పిటిషన్లను తెలంగాణ హైకోర్టు జూన్ 15కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి. సామ్ కోషి, నందికొండ నర్సింగ్‌రావుతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ విచారణ సందర్భంగా, ఇరుపక్షాల న్యాయవాదులు ప్రాథమిక వాదనలు వినిపించి, సవివరమైన వాదనలు వినిపించడానికి అదనపు సమయం కోరారు. ఆ అభ్యర్థనను గమనించిన ధర్మాసనం, తదుపరి విచారణ కోసం ఈ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. కాగా రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాలలో శాస్త్రవేత్తగా జయతీర్థ జోషి చేసిన విశిష్ట సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనను 2024 నవంబర్ 25న బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. అయితే ఈ పదవికి షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులలో ఒకరైన, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివసుబ్రమణియం నంబి నాయుడు జయతీర్థ జోషి నియామకాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్‌లో సవాలు చేశారు. ఈ అభ్యర్థనను అనుమతిస్తూనే, ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని పేర్కొంటూ ట్రిబ్యునల్ ఆ నియామకాన్ని రద్దు చేసింది. అంతేకాకుండా,

నిర్దిష్ట కాలపరిమితిలోగా డాక్టర్ నాయుడు అభ్యర్థిత్వాన్ని పునఃపరిశీలించాలని, ఈలోగా బ్రహ్మోస్‌కు నాయకత్వం వహించడానికి ప్రత్యామ్నాయ ఇన్‌చార్జ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయం పట్ల అసంతృప్తి చెందిన డాక్టర్ జోషి హైకోర్టును ఆశ్రయించారు.

# వేగంగా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

## - ఇప్పటికే 86శాతం కోటా పంపిణీ పూర్తి
## - పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ రికార్డు వేగంతో కొనసాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషన్ స్టిఫెన్ రవింద్ర ప్రకటించారు. గడువు తేది కంటే వారం రోజుల ముందే 86శాతం పైగా బియ్యం కోటాను లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వరకు రాష్ట్రంలోని రేషన్‌కార్డు లబ్దిదారులకు ఎప్రిల్, మె, జూన్‌నెలకు చెందిన 6, 43, 303 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఎప్రిల్ 21 నాటికే రాష్ట్రవ్యాప్తంగా 5.48, 140 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం మార్చి 2న ఇచ్చిన ఆదేశాల మేరకు వేగంగా మూడు నెలల రేషన్ పంపిణీ కొనసాగుతోందన్నారు. కొత్తగా యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో గోదాముల్లో స్థలం ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తోందన్నారు. రేషన్ బియ్యం పంపిణీ తాలుకు 2.62 కోట్ల లావాదేవీలు ఇప్పటి వరకు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగాయన్నారు. వేగంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నందున ఎలాంటి తప్పులు జరగకుండా ఉండేందుకు రేషన్ షాపుల వద్ద జరిగే ఆన్‌లైన్ వివరాలను, వేలిముద్రలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# కాళేశ్వరంపై సిబిఐ వెంటనే విచారణ చేపట్టాలి

## ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** కాళేశ్వరం అక్రమాలను వెలుగులోకి తెచ్చి అక్రమార్కులను దోషులుగా నిలబెట్టేందుకు సిబిఐ వెంటనే విచారణచేపట్టాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిఎల్‌పి కార్యాయలంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన విచారణ కోసం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆనివేదిక తోపాటే ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సిబిఐకిఅప్పగించారనీ ఆయన తెలిపారు. వివిధ దశల్లో మూడు రకాల నివేదికలు ఉన్నప్పటికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి స్కామ్ లేదన్నట్టుగా బిఆర్ఎస్ వ్యవహరిస్తోందనీ ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల నిర్మాణాల్లో లోపాలు ఉన్నాయని నివేదికలు సూచిస్తున్నారు. బాధ్యులు ఎవరు, దోషులు ఎవరు అనే విషయాన్ని ఘోష్ కమిషన్ స్పష్టం చేసిందనీ ఆయన తెలిపారు. సాంకేతిక అంశాలపై హైకోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసిందనీ, భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి, బిఆర్ఎస్ కలిసి ఆట ఆడుతున్నాయనీ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎటిఎంగా మారిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాజకీయ లాభాల కోసం బిజెపి, బిఆర్ఎస్ సమీకరణాలు చేసుకుంటున్నాయనీ అన్నారు. డిలిమిటేషన్ విషయంలో పార్లమెంట్‌లో ప్రతిపక్షం మొత్తం ఏకతాటిపై ఉందనీ బిజెపిపై కెసిఆర్ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదనీ అన్నారు. జగిత్యాల సభల్లో మహిళా బిల్లుపై ఆయన మాట్లాడలేదనీ ఆయన విమర్శించారు. కెసిఆర్ మౌనం బిజెపి బిఆర్ఎస్ మధ్య సంబంధాలను చూపుతోందనీ అన్నారు. కుటుంబ అవినీతి బయటపడకుండా బిజెపి రక్షణ కల్పిస్తోందనే అనుమానం ఉందనీ తెలిపారు. వెంటనే సిబిఐ దర్యాప్తు చేపట్టాలని కేంద్రాన్ని మేము కోరుతున్నామనీ తెలిపారు. బిజెపి పెద్దల వైఖరి నిరక్ష ్యంగా ఉందని స్పష్టమవుతోందనీ, కాళేశ్వరం వ్యవహారంలో కెసిఆర్‌కు సంబంధం లేదని ఎక్కడైనా తేల్చి చెప్పారా? సత్యమేవ జయతే సత్యామే గెలుస్తుందని అన్నారు.

# కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న సతీమణి గీత కన్నుమూత

## తీవ్ర అనారోగ్యంతో కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
## ఆ కుటుంబంలో మూడేళ్లలో మూడు విషాదాలు



మాజీ ఎమ్మెల్యే, దివంగత జి. సాయన్న సతీమణి జి. గీత పార్థివదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 22 ( ప్రభాతవార్త ) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే, దివంగత జి. సాయన్న సతీమణి జి. గీత (70) బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్త తెలియగానే నియోజకవర్గంలోనూ, అటు రాజకీయ వర్గాల్లోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. గీత మరణవార్త విన్న వెంటనే బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని అశోక్ నగర్ స్వగృహానికి తరలించారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ, సాయన్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇప్పుడు గీత మరణంతో ఆ కుటుంబం మరింత విషాదంలో మునిగిపోయింది. సాయన్న కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజాదరణ పొందిన నాయకుడిగా పేరుపొందారు. ఆయన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా స్థానికంగా మంచి గుర్తింపు పొందారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించిన ప్రజానేత జి. సాయన్న అనారోగ్యంతో 2023 ఫిబ్రవరి 19 న కన్నుమూశారు. తండ్రి మరణం తర్వాత ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచిన ఆయన కుమార్తె లాస్యనందిత, సరిగ్గా ఏడాది తిరగకముందే 2024 ఫిబ్రవరి 23 న ఓ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. కాగా బుధవారం నేడు సాయన్న సతీమణి, లాస్యనందిత తల్లి గీత మరణించడంతో ఆ కుటుంబంలో మరోసారి తీరని లోటు ఏర్పడింది. గీతకు మరో ఇద్దరు కుమార్తెలు నమ్రత, నివేదిత ఉన్నారు. ఒకే కుటుంబంలో కీలక వ్యక్తులు ముగ్గురు స్వల్ప వ్యవధిలోనే దూరమవ్వడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రైతు భరోసా కోసం తక్షణమే అధికారులను సంప్రదించండి

**హైదరాబాద్, ఎప్రిల్ 22, ప్రభాతవార్త:**రెండో విడతలో రైతు భరోసా నిధులు జమకాని రైతులు సంబంధిత వ్యవసాయశాఖ అధికారులను లేదంటే మండల రెవెన్యూ అధికారులను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. అర్హత కలిగిన రైతులు తమ భూమి పాసు పుస్తకాలతోపాటు పూర్తి వివరాలను సమర్పించాలని పేర్కొంది. రైతులు సమర్పించిన భూమి యాజమాన్య ఆధారాలను పరిశీలించి అధికారులు రైతు భరోసా నిధులు జమ చేస్తారని తెలిపింది. మొదటి విడతలో ఒక ఎకరం వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన ప్రభుత్వం, రెండో విడతలోనూ 45.12లక్షల మంది రైతులకు మరో ఎకరానికిగాను రూ.6వేలను జమ చేసింది. ఇప్పటి వరకు ప్రతి రైతుకు రెండెకరాల వరకు రైతు భరోసాను విడుదల చేసింది. పూర్తి స్థాయిలో రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ కావాలంటే మరో రూ.3,400 కోట్లు వరకు వెచ్చించాల్సి ఉంది. మే నెల ప్రారంభంలో మూడో విడత రైతు భరోసా నిధులు విడదలవుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే మూడో విడతలో అయిదు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు జమ చేస్తారా లేదా అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం మూడో విడతలో మరో రెండు ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. రైతు భరోసా కింద రెండు విడతల్లోనూ అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ.448.09 కోట్లు విడుదల య్యాయి. 5,40,693 మంది రైతులకు లబ్ధి చేకూరింది. నల్గొండ తరువాత ఖమ్మం జిల్లాలో 3,45,142 మంది రైతులకు రూ.271.52 కోట్లు, మూడో స్థానంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 3,66,343 మంది రైతుల ఖాతాల్లో రూ. 271.05 కోట్లు జమ అయ్యాయి. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన 35,530 మంది రైతులకు రూ.15.65 కోట్లు జమ అయ్యాయి.

# మేఘాలయ అంగన్‌వాడి విధానాలు తెలంగాణలో అమలు!

## - మంత్రి సీతక్క, సమ్మె విరమించాలని ఆర్టీసి కార్మికులకు విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**మేఘాలయ రాష్ట్రంలోని అంగన్వాడి కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగా కాకుండా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. చిన్నారులకు ఆటల ద్వారా విద్య నేర్పే విధానం, సృజనాత్మక వాతావరణం నేర్చుకునే ఆసక్తిని పెంచుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా మేఘాలయ ఎర్లి చైల్డ్‌హుడ్ ప్రోగ్రామ్ ద్వారా 06 సంవత్సరాల చిన్నారులపై సమగ్ర దృష్టి సారిస్తూ ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలను సమన్వయం చేస్తూ అందిస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు. ఇక 1000 డేస్ ప్రోగ్రామ్ అమలు విధానాన్ని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ నుంచి పాప జన్మించి రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉండే తొలి 1000 రోజుల్లో తల్లి శిశువుకు సమగ్ర సేవలు అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గిస్తూ, ఆరోగ్యవంతమైన అభివృద్ధిని సాధిస్తున్నారని పేర్కొన్నారు. మేఘాలయలో ఆసక్తి ఉన్న యువతకు మినిస్ట్రీ ఆఫ్ స్కిలింగ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారిని కమ్యూనిటీ వలంటీర్లుగా తయారు చేస్తున్నారని చెప్పారు. అంగన్వాడి టీచర్లతో పాటు అదనంగా వలంటీర్లు వ్యవస్థీకృతంగా పనిచేయడం, సమాజం మొత్తాన్ని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం మేఘాలయ మోడల్‌కు ప్రత్యేకతను తీసుకువచ్చిందని తెలిపారు. మేఘాలయ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. సమ్మె విరమించాలని ఆర్టిసి కార్మికులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మేఘాలయ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టిసి కార్మికుల సమ్మె కారణంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. చర్చల ద్వారా మాత్రమే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

# తెలంగాణ కెసిఆర్ వల్లకాదు అమరవీరుల త్యాగం వల్లే వచ్చింది: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**హైదరాబాద్,ఏప్రిల్22,ప్రభాతవార్త:** తెలంగాణ కెసిఆర్ వల్లకాదు అమరవీరుల త్యాగాల వల్లే వచ్చిందని ఖమ్మంలో కెసిఆర్ నిరాహారదీక్ష ఆపేస్తే గద్దర్ ప్రశ్నిస్తే మళ్లీ దీక్ష చేశారనీ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ దొంగతనం చేసిన వాడే దొంగా దొంగా అని అరిచినట్లుగా హరీష్ రావు తీరు ఉందనీ విమర్శించారు. తెలంగాణ ఉద్యమం 2000 సంవత్సరం లో పుట్టలేదనీ,1952 లోనే తెలంగాణ ఉద్యమానికి బీజం పడిందనీ ఆయన తెలిపారు. 1956 లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలోనే తెలంగాణ వాదాన్ని వినిపించారనీ అన్నారు. నేనే తెలంగాణ తెచ్చానని, మా మమ తెలంగాణ తెచ్చారని ఇప్పుడు కొందరు పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారనీ విమర్శించారు.వేలాది మంది అమరువీరుల త్యాగం వల్లనే తెలంగాణ వచ్చిందనీ, తెలంగాణ అమరువీరుల త్యాగాన్ని చూసి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందనీ ఆయన వివరించారు. తెలంగాణ వచ్చాక కెసిఆర్ కుటుంబం సంచులు సర్దుకుందనీ ఆరోపించారు. అసెంబ్లీకే కెసిఆర్ రావడం లేదు.. ఇక తెలంగాణలో మీరు అధికారంలోకి వస్తారా..? అని ఎద్దేవా చేశారు.గతం ప్రభుత్వంలో ఆర్‌టిసి సమ్మె కారణంగా కార్మికులు చనిపోయారనీ ఇప్పుడు బిఆర్ఎస్ వెనుకవుండి సమ్మెను ప్రోత్సహిస్తున్నారనీ అన్నారు. స్మశాన వాటికలు, బొందలు గడ్డలు తప్ప బిఆర్ఎస్ హయాంలో చేసింది ఏమీ లేదనీ అన్నారు. దేశంలోనే నెంబర్ 1 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన సాగుతోందనీ అన్నారు. రేవంత్ రెడ్డిని చూసి బిఆర్ఎస్ నాయకులకు కళ్ల మంటపుడుతోందని, గుంట నక్క ఢిల్లీకి పోయిందని కవితనే హరీష్ రావు గురించి చెపుతోందనీ అన్నారు. ముఖ్యమంత్రి పైన హరీష్ రావు చేసే విమర్శలను ప్రజలు నమ్మరనీ ధీమా వ్యక్తంచేశారు.మళ్లీ రాజ్యాధికారం కాంగ్రెస్ పార్టీదే అన్నారు. సమిష్టి నాయకత్వంలో మా ప్రభుత్వం నడుస్తోందనీ తెలిపారు. ఆర్టీసీ కార్మికులు మంది మాటలు నమ్మొద్దని హితవుచెప్పారు.అధికారం పోగానే బిఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికులు, ఆశా వర్కర్లు , నిరుద్యోగులు గుర్తుకు వచ్చారనీ అన్నారు.కెసిఆర్‌కు ఆరోగ్యం బాగాలేదు, కొడుకు, అల్లుడు , బిడ్డ ఇబ్బంది పెడుతున్నారనీ ఆయన తెలిపారు. అధికారంంలోకి వస్తామని బిఆర్ఎస్ పగటి కలలు ఆపాలనీ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కష్ట జీవుల పార్టీ అనీ, భూములు, ఇళ్లు ఇచ్చిందనీ తెలిపారు. ప్రాజెక్టులు కట్టింది, పారిశ్రామిక వాడులు ఏర్పాటు చేసిందనీ తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదనీ తెలిపారు

తెలంగాణకు ముందు, తెలంగాణ వచ్చాక కల్వకుంట్ల ఆస్తులు ఎన్నో చెప్పాలనీ డిమాండ్ చేశారు.. తెలంగాణ ఉద్యమకారులకు మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారనీ తెలిపారు..

# సంప్రదాయానికి తొలి మెట్టు

## ఫ్యాషన్.. ఫ్యాషన్



ఒకనాడు సంచార జీవితం గడిపి నిత్య ప్రయాణికులుగా వలసలు పోతూ... లంబాడాలుగా చరిత్రలో పేరు గాంచిన బంజారాలు... మహిళలలో చిన్నలు, పెద్దలు సైతం ధరించే గాగ్రా అవిష్కర కర్తలు... అంటే ఆశ్చర్యం కలగవచ్చు గాక... కానీ ఇది నిజం. దుస్తుల్లో నూతన మార్పులకు కొలమానంగా ఫ్యాషన్‌ను చెప్పుకోవచ్చు. ఏది ధరించాలో వారి అభిరుచులను బట్టి ఎప్పటికప్పుడు మారిపోతా ఉంటుంది. గతకాలం నాటి దుస్తులకు కూడా కొత్త హంగులు అద్ది నేడు ఫ్యాషన్‌గా ధరించడం కనిపిస్తోంది. అటువంటి వాటిలో నాడు బంజారా (లంబాడా) మహిళలు ధరించిన గాగ్రా (ఫేటియా) కూడా ఒకటిగా చెప్పుకోవచ్చు. ఈ గాగ్రా రోజు రోజుకు ఎంతో ఆదరణను పొందుతోందంటే అతిశయోక్తి కాదు. చిన్న పిల్లల నుంచి యువతులు, పెళ్లైన మహిళల వరకు దీన్ని ఇష్టపడని వారు లేరంటే ఇది ఎంతగా ప్రాచుర్యం పొందుతుందో అర్థమవుతోంది. అద్దాలు, అల్లికలను చేర్చుతూ అనేక రకాలుగా నేడు మార్కెట్‌లోకి వస్తున్న ఈ గాగ్రా మహిళలను, యువతను ఆకర్షిస్తోంది.

## గాగ్రా చోళీ

**మార్కెట్‌లో ఉన్న గాగ్రా రకాలు**

గాగ్రా (లేహంగా) ఫ్యాషన్ సాంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. ఏలైన్, మెర్మైడ్, స్ట్రెయిట్ కట్, వాల్యూమ్ డిజైన్లతో వెల్వెట్, సిల్క్, నెట్, కాంట్రాస్ట్ బార్డర్లు, భారీ మిర్రర్ వర్క్, ఫ్లోరల్ ప్రింట్లు వంటి దుస్తులలో ఇవి లభిస్తాయి. వివాహాలు, పండుగల కోసం మిర్రర్ వర్క్, జరీ, ఎంబ్రాయిడరీ పనులు చేసిన డిజైన్లు బాగా ప్రాచుర్యం పొందాయి.

**సంప్రదాయ దుస్తులు:** బంజారా (లంబాడీ) మహిళల సంప్రదాయ దుస్తులు రంగు రంగుల అద్దాల పనులు, ఎంబ్రాయిడరీ, కౌరీ గవ్వలతో కూడిన ప్రత్యేక కళారూపాలు. వాళ్ల ధరించే దుస్తుల్లో ప్రధానంగా పేటియా (గాగ్రా), కాంచళి (రవిక), టూక్రీ (ఓణీ) ప్రధానమైనవి. ఇవి పర్యావరణానికి అనుగుణంగా, కఠినమైన శీతోష్ణస్థితి నుండి రక్షణ కల్పించేలా స్వయంగా వారే తయారు చేసుకుంటారు.





**బంజారా స్త్రీల సాంప్రదాయ్క వస్త్రధారణ వివరాలు:**

పేటియా (గాగ్రా): రంగురంగుల దుస్తులతో,ముఖ్యంగా ఎరుపు, నారింజ రంగులలో కుచ్చులు, అద్దాలు ఎంబ్రాయిడరీ పనులతో కూడిన లంగా. ఇది మందపాటి నూలు వస్త్రంతో తయారు చేయబడుతుంది.

**కాంచళి (రవిక):** ఇది ముందు భాగంలో అద్దాలు, రంగుల దారాలతో కుట్టిన ఎంబ్రాయిడరీ, గవ్వలతో అలంకరించబడిన చిన్న రవిక. దీనికి చేతులు ఉండవు లేదా చాలా చిన్నగా ఉంటాయి.

**టియా/ ఓణీ (దుపట్టా):** లంగా, రవికపై ధరించే సాంప్రదాయ ఓణీ.

**గుమ్‌టో/ టెటెరా (ముసుగు):** వివాహిత మహిళలు తమ తల, ముఖం కప్పుకోవడానికి, గవ్వలు, అద్దాల పనితో అలంకరించబడిన ముసుగును (చీర/ఓణీ) ధరిస్తారు.

**ఆభరణాలు:** దుస్తులతో పాటు, భూరియా (వెండి దండలు), బిలియా (చేతి కడియాలు), అద్దాల పని ఉన్న ఆభరణాలు ధరిస్తారు. ఎలా తయారు చేసేవారు..

బంజారా మహిళలు స్వయంగా వారపు సంతకు వెళ్లి వారికి కావాల్సిన నూలు దారాలు, రంగురంగుల ముతక దుస్తులను కొనుక్కొని వస్తారు. వీటితో పాటు అద్దాలు, గవ్వలు కూడా తీసుకువస్తారు. రోజువారి వ్యవసాయ, ఇంటి పనులు చేసుకుంటూనే ఖాళీ సమయాల్లో ఈ గాగ్రాను తమకు కావాల్సిన విధంగా తయారు చేసుకుంటారు. గాగ్రాపై రకరకాల పూలు ఎంబ్రాయిడరీ వర్క్ చేసేవారు.

ఇక్కడ మనం చెప్పుకోవాల్సిన మరో విశేషం ఏమిటంటే పెళ్లి కుదిరిన యువతులు స్వతహాగా వారికి కావాల్సిన పెళ్లి గాగ్రాను తానే స్వయంగా తయారు చేసుకునేవారు. ●

– రామకృష్ణ ధర్మసోత్

### రామ బాణం

వంటింటి నుంచి ఎరీనాకు చేరి రామ బాణంలా దూసుకు పోయే పరుగులబామ్మ గురించి తెలుసుకుందామా.



ఆంధ్రప్రదేశ్, నెల్లూరుకు చెందిన రామ సుబ్బమ్మ వయసు 80 ఏళ్లు. 2015లో పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పరుగు పందాల్లో పాల్గొని 32 బంగారు, 14 సిల్వర్, 3 కాంస్య పతకాలు సాధించారు. ●

## ప్రతి అనుభవమూ గురువే !

ఒకసారి ఒక యువకుడు జీవితం మీద విసుగుతో అరణ్యంలోకి వెళ్లాడు."నిజమైన గురువు ఎవరూ? జీవిత సత్యం ఏమిటి?" అని ఆలోచిస్తూ తిరుగుతుండగా అతనికి దత్తాత్రేయ స్వామి దర్శనమిచ్చారు.



యువకుడు నమస్కరిస్తూ ఇలా అడిగాడు.

'స్వామీ! ఈ జగతికి గురువు ఎవరు?'

దత్తాత్రేయ స్వామి చిద్విలాసంగా ....'నాకు ఒక్క గురువు కాదు, 24 మంది గురువులున్నారు.'

అదెలా అని ఆశ్చర్యపోయిన యువకునితో...మళ్ళీ స్వామి... ఇలా ....

**'భూమి నాకు సహనం నేర్పింది. గాలి నాకు ఆసక్తి లేకుండా జీవించడం నేర్పింది. నీరు పరిశుద్ధత నేర్పింది. అగ్ని తపస్సు నేర్పింది. ఆకాశం విస్తారమైన మనస్సు నేర్పింది.'**

'ప్రకృతిలో ప్రతి దానిలో నేర్చుకోవాల్సిన పాఠం ఉంది. మనసు తెరిచి చూస్తే, ప్రపంచం మొత్తం గురువే అవుతుంది.'

అది విని యువకుడికి జ్ఞానోదయం కలిగింది. అతను అర్థం చేసుకున్నాడు . 'నిజమైన గురువు బయట కాదు, ప్రతి అనుభవంలోనూ ఉందన్న విషయం అవగతమైంది. ●

## అద్భుతమైన పండు 'లిచి'

మనకు సంప్రదాయ పండ్లు ఎన్ని ఉన్నా వేసవిలో లభించే 'లిచి' పండు తింటే అన్నీ ఆరోగ్యదాయకమే. తెలుపు, గులాబీ రంగులో ఉండే ఈపండు రుచినీ



ఆస్వాదిస్తే బోలెడంత అద్భుతంగా ఉంటుంది. ఇప్పుడు తయారయ్యే ఐస్క్రీంలు, జ్యూస్లు,ఇతర స్వీట్లలో 'లిచి' ని ఒక ప్రధాన ముడి పదార్థంగా ఉపయోగిస్తారు.ఎన్నోఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది కనుక ఈ పండును ఒకసారి తింటే మళ్ళీ మళ్ళీ తినాలని పిస్తుంది. ఇందులో విటమిన్ సీ, శక్తివంత మైనయాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే లక్షణాలు ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఫ్లూ, దగ్గు వంటి సామాన్య జ్వరాలను దారి చేరనీయదు. స్కర్వి వ్యాధి నివారిస్తుంది. విటమిన్ సీతో పాటు అధిక నీటి శాతాన్ని కలిగి ఉన్నం దున లిచి చర్మ ఆరోగ్యానికి ఉత్తమంగా ఉంచుతుంది. వృద్ధుల ఆరోగ్య రక్షణకు తోడ్పడుతుంది. లిచిలో ఉండే అధిక డైటరీ శరీరంలోని ఫైబర్ కొవ్వు పేరుకుపోవడాన్ని అరికట్టి, గుండె ఆరోగ్యాన్ని పదిలపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి విటమిన్ సీ రక్తపోటునుతగ్గిస్తుంది. లిచి క్యాన్సర్ నిరోధక ప్రభావాన్ని కలిగిస్తుంది. దీని వాడకంతో ప్రాణాం తక వ్యాధి సంభవించ కుండా నిరోధిస్తుంది. బరువు తగ్గించే ప్రణాళికలో ద్రవ సమతుల్యత కీలకం. ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది.

తద్వారా శరీరంలోని ద్రవ స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది. లిచిలో ఉండే పెక్టిన్ అనే డైటరీ ఫైబర్ ఆరోగ్య కరమైన ప్రేగు కదలికలకు జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తుంది. దీనిలోని అధిక నీటి శాతం మలబద్ధకాన్ని నివా రిస్తూ, పెద్దప్రేగు క్యాన్సర్, పైల్స్ వంటి అనారోగ్యాల నుంచి రక్షిస్తుంది. ●

**చిట్కా :** గాఢమైన ఆకుపచ్చ రంగులో, మురికి లేకుండా ఉన్న ఆకులు ఎంచుకుంటే వంటకు మంచి రుచి వస్తుంది. పుదీనా ఆకులను నీటిలో కొద్దిసేపు నానబెట్టి బాగా కడగాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొద్దిగా నిమ్మరసం కలిపి గ్రైండ్ చేస్తే పుదీనా పేస్ట్ చట్నీలకు, కర్రీలకు బాగా సరిపోతుంది. పుదీనా ఆకులు బిర్యానీకి ప్రత్యేక సువాసన, రుచి ఇస్తాయి. చివర్లో కొద్దిగా వేసినా ఫ్రెష్ ఫ్లేవర్ వస్తుంది.



## బై పోలార్ కు ఔషధ సేవనం!

### వ్యథ

**ప్రశ్న:** మా అక్క వయస్సు 38 సంవత్సరాలు. 25 ఏళ్ల వయస్సులో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత 10 సంవత్సరాలుగా ఆమెకు బైపోలార్ డిసార్డర్ లక్షణాలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు తీవ్ర కోపంతో వస్తువులు పగులగొడుతుంది. మరికొన్ని సార్లు తనకు ఎవరూ లేరని, చనిపోవాలని ఏడుస్తుంది. తర్వాత మళ్లీ సాధారణంగా ఉంటుంది.



పెళ్లి తర్వాత ఈ సమస్య గుర్తించారు. సైకియాట్రిస్ట్ చూపించినప్పటికీ ఆమె మందులు వాడలేదు. ప్రస్తుతం పరిస్థితి కష్టంగా మారడంతో ఒక సైకాలజిస్ట్‌ను సంప్రదించాము. ఆయన 8 నెలల్లో పూర్తిగా తగ్గిస్తానని, నెలకు రూ. 60,000 ఫీజు కావాలని కోరారు. ఇది సాధ్యమేనా? ఆయన మాట నమ్మవచ్చా?

**– ఒక సోదరి, రాజమండ్రి**

**జవాబు:** అమ్మా, బైపోలార్ డిసార్డర్ ఒక దీర్ఘకాలిక మానసిక రుగ్మత. ఇందులో మానియా (అతి ఉత్సాహం, కోపం) మరియు డిప్రెషన్ (నిరాశ, నిస్పృహ) లక్షణాలు మారుమారుగా కనిపిస్తాయి. ఇది పూర్తిగా"నయం" అవుతుందని చెప్పడం కంటే, సరైన చికిత్సతో నియంత్రణలో ఉంచవచ్చని చెప్పడం వైద్యపరంగా సరైనది.

ఇది మాటలతో మాత్రమే తగ్గదు, సరైన మందులు వాడితేనే నియంత్రణలో ఉంటుంది. చికిత్స, కౌన్సెలింగ్ కలిపి చేస్తే కొంత మెరుగైన ఫలితాలు ఉంటాయి.

మీ వివరణను బట్టి, ఈ సమస్య ఆమెకు చాలా కాలంగా ఉండే అవకాశం ఉంది. మన సమాజంలో ఇలాంటి లక్షణాలను సాధారణ ప్రవర్తనా లోపంగా భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల ఆలస్యంగా గుర్తించబడుతుంది.

8 నెలల్లో పూర్తిగా నయం చేస్తాను" అనే హామీ వైద్యపరంగా విశ్వసనీయంగా లేదు. బైపోలార్ డిసార్డర్‌కు సాధారణంగా జీవితాంతం పర్యవేక్షణ మరియు నిర్వహణ అవసరం ఉంటుంది. ఈ పరిస్థితిలో తప్పనిసరిగా సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అవసరం. మందులు (మూడ్ స్టెబిలైజర్స్) చాలా కీలకం. సైకాలజిస్ట్ కౌన్సెలింగ్ సహాయకంగా ఉంటుంది కానీ మందులకు ప్రత్యామ్నాయం కాదు.


అలాగే నెలకు రూ. 60,000 ఫీజు చాలా అధికం. సాధారణంగా మంచి నిపుణుల వద్ద ఒక్క సెషన్‌కు రూ. 500–రూ. 3000 మధ్య ఖర్చవుతుంది.

మీరు ముందుగా ఒక అనుభవజ్ఞుడైన సైకియాట్రిస్ట్‌ను సంప్రదించండి. అవసరమైతే రెండో అభిప్రాయం తీసుకోండి. అసాధారణ హామీలను నమ్మకండి. శాస్త్రీయంగా నిరూపితమైన చికిత్సనే అనుసరించడం మంచిది. ●



డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి
సైకాలజిస్ట్

# తెర



## కేరళ సెన్సేషన్ వాలా 2 తెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించి, ఏకంగా రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరిన యువ తరం సినిమా వాలా 2 ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. షైన్ స్ట్రీక్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 24న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన యంగ్ సూపర్ హీరో తేజ సజ్జా మాట్లాడుతూ, మలయాళ నటీనటులకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఘనస్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. ఈ సినిమా ట్రైలర్‌లో ఎంత ఎనర్జీ ఉందో, చిత్ర బృందంలో కూడా అదే కనిపిస్తోంది. భాషా భేదం లేకుండా మంచి కథలను ఆదరించే తెలుగు ఆడియన్స్ మధ్య ఉండటం గర్వంగా ఉంది. నిర్మాత సాహు శంకర వరప్రసాదవంటి భారీ హిట్ తర్వాత ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మన ముందుకు తెస్తున్నారు. ఇది కూడా ఇక్కడ పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను.. అని అన్నారు. దర్శకుడు గోపీచంద్ మలినేని మాట్లాడుతూ, సినిమాలో బ్రదర్ సెంటిమెంట్ మరియు ఫ్రెండ్ షిప్ ఎమోషన్స్ అద్భుతంగా పండాయని ప్రశంసించారు. కేరళలో ఎటువంటి స్టార్ ఇమేజ్ లేని యువ నటులతో (హాషీర్, అలన్, అజిన్, వినాయక్) రూపొందిన ఈ సినిమా, అక్కడ ఇండస్ట్రీ హిట్ రేంజ్‌లో వసూళ్లు సాధించడం విశేషం.

## కమెడియన్ కాదు కింగ్



టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ కమెడియన్ సత్య హీరోగా, విలక్షణ దర్శకుడు రితేష్ రానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ మూవీ జెట్లీ. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మే 1న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం బుధవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌ను గమనిస్తే.. సినిమా అంతా క్విర్కీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగనున్నట్లు తెలుస్తోంది. ఇందులో సత్య జ్ఞాపకశక్తి కోల్పోయిన ఒక వింత వ్యక్తిగా కనిపిస్తున్నారు. తనను తాను ఒక పవర్‌ఫుల్ యాక్షన్ హీరోగా, కడప కింగ్‌గా ఊహించుకుంటూ ఆయన చేసే రచ్చ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. 15 వేల కోట్ల డీల్ చుట్టూ తిరిగే కథలో.. రియాలిటీకి, సత్య ఊహలకు మధ్య జరిగే కామెడీ యుద్ధమే ఈ జెట్లీ. సత్యకు తోడుగా వెన్నెల కిశోర్, వైవా హర్ష తమ మార్క్ కామెడీతో ట్రైలర్‌ను మరింత సందడిగా మార్చేశారు. హీరోయిన్ రియా సింగ్ గ్లామర్‌తో పాటు యాక్షన్ సీన్స్‌లోనూ ఆకట్టుకుంటోంది. రితేష్ రానా గత చిత్రాలైన మత్తు వదలరా, హ్యాపీ బర్త్‌డే తరహాలోనే ఈ సినిమాలో కూడా వైవిధ్యమైన స్క్రీన్ ప్లే ఉండబోతుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది.



## ముంబైలో షూట్ షురూ

భారతీయ సినీ ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ క్రేజీ కాంబినేషన్ పట్టాలెక్కింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం బుధవారం ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్, కుల్దీప్ రాథోడ్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు పవర్ ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ కథను వంశీ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. షూటింగ్ ప్రారంభం సందర్భంగా మేకర్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ముంబైలో వేసిన భారీ సెట్‌లో సల్మాన్ ఖాన్ తనదైన స్టైల్‌లో ఎంట్రీ ఇచ్చారు. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. జవాన్ వంటి భారీ విజయం తర్వాత నయనతార నటిస్తున్న మరో హిందీ ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సల్మాన్ ఖాన్, నయనతార (ప్రధాన పాత్రల్లో) నటిస్తుండగా వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (దిల్ రాజు, శిరీష్) నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ముంబైలో నెల రోజుల పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. 2027 ఈద్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. వంశీ పైడిపల్లి గత చిత్రాలైన మహర్షి, వారసుడు తరహాలోనే ఈ సినిమాలో కూడా బలమైన ఎమోషన్స్ ఉంటాయని, సల్మాన్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్లుగా పవర్ ఫుల్ డైలాగ్స్ ఉంటాయని సమాచారం. త్వరలోనే ఈ చిత్ర టైటిల్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు.

## కాన్స్ వేదికపై కన్నడ కిరణం



పిట్ట కొంచెం.. కూత ఘనం అనే సామెతను నిజం చేస్తూ, కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన యువ దర్శకురాలు కరెన్ క్షి తి సువర్ణ గ్లోబల్ సినీ వేదికపై సంచలనం సృష్టించింది. కేవలం 22 ఏళ్ల వయసులోనే ఆమె రూపొందించిన సెప్టెంబర్ 21 అనే స్వతంత్ర చిత్రం, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కాన్స్ చలన చిత్రోత్సవానికి ఎంపికైంది. అల్జీమర్స్ నేపథ్యంతో భావోద్వేగగా కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రం, అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న ఒక వృద్ధుడి చుట్టూ తిరుగుతుంది. ఈ వ్యాధి కేవలం బాధితుడిపైనే కాకుండా, అతన్ని సంరక్షి ంచే కుటుంబ సభ్యులపై చూపే మానసిక ప్రభావాన్ని దర్శకురాలు ఎంతో సున్నితంగా, భావోద్వేగంగా ఆవిష్కరించారు. యువతతో కూడిన టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేయడం విశేషం.

ఈ చిత్రంలో సీనియర్ నటీమణులు ప్రియాంకా ఉపేంద్ర, జరీనా వహాబ్ మరియు యువ నటుడు ప్రవీణ్ సింగ్ సిసోడియా కీలక పాత్రల్లో నటించారు.

పరిమిత వనరులతోనే అపారమైన విజన్‌తో కరెన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారు. మే 16న కాన్స్‌లోని ప్రఖ్యాత పాలైస్ థియేటర్‌లో ఈ సినిమా ప్రదర్శితం కానుంది.

అతి పిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకురాలిగా కరెన్ పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో మరియు చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. కంటెంట్ బలంగా ఉంటే ప్రపంచం తలొగ్గుతుందని ఈ యువ దర్శకురాలు నిరూపించి, భారతీయ చిత్ర పరిశ్రమ గర్వించేలా చేసింది. గ్లోబల్ వేదికపై ప్రదర్శన తర్వాత మరిన్ని దేశాల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు అంతర్జాతీయ పంపిణీదారులు ఆసక్తి చూపుతున్నారు.

## 24న పరమపద సోపానం



అర్జున్ అంబటి, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ పరమపద సోపానం. స్వయంభూ క్రియేషన్స్ బ్యానర్‌పై గణపర్తి నారాయణరావు, తేలప్రోలు ప్రసన్న నిర్మించిన ఈ చిత్రానికి నాగ శివ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఏప్రిల్ 24న థియేటర్లలోకి రాబోతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ దర్శకులు భీమనేని శ్రీనివాసరావు, వీర శంకర్, సముద్ర చిత్ర యూనిట్‌ను అభినందించారు. భీమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తన వద్ద పనిచేసిన ప్రసన్న నిర్మాతగా సక్సెస్ అవ్వాలని కోరుకున్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ.. అర్జున్ అంబటి నటన, లుక్స్ అద్భుతంగా ఉన్నాయని, త్వరలోనే అతను పెద్ద హీరో అవుతాడని ప్రశంసించారు. హీరో అర్జున్ అంబటి మాట్లాడుతూ.. లెజెండరీ డైరెక్టర్లు నా సినిమా ఈవెంట్‌కు రావడం ఆనందంగా ఉంది. ఇదొక మంచి థ్రిల్లర్ ప్రయత్నం. ఏప్రిల్ 24న ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించాలి అని కోరారు.చిత్ర దర్శకుడు నాగ శివ ఈ చిత్రాన్ని ఆసక్తికరమైన మలుపులతో తెరకెక్కించారని, దేవ్ అందించిన సంగీతం, ఈశ్వర్ విజువల్స్ సినిమాకు ప్రధాన బలమని చిత్ర యూనిట్ పేర్కొంది.

## మూడేళ్ల విరామం తర్వాత ..



మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ బాక్సాఫీస్ వద్ద మళ్ళీ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. విరూపాక్ష వంటి భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న తర్వాత, దాదాపు మూడేళ్లుగా వెండితెరపై కనిపించని తేజ్, ఇప్పుడు ఒక భారీ ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. బైక్ ప్రమాదం తర్వాత తన ఆరోగ్యంపై దృష్టి సారించిన సాయి ధరమ్ తేజ్, శారీరకంగా మరియు మానసికంగా పూర్తిస్థాయిలో సిద్ధమవ్వడానికి ఈ సుదీర్ఘ విరామం తీసుకున్నారు. సరిగ్గా విరూపాక్ష విడుదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, తన తదుపరి ప్రయాణంపై క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం తేజ్ తన కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సంబరాల ఏటి గట్టు చిత్రంలో నటిస్తున్నారు. దాదాపు ఏడాది కాలంగా ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా జరుగుతోంది. ఈ చిత్రం కోసం తేజ్ తన లుక్‌ను కూడా మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా విడుదల తర్వాతే తన తదుపరి చిత్రాలను పట్టాలెక్కించాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు. అభిమానులను ఉత్సాహపరిచే మరో విషయం ఏమిటంటే, తేజ్ చేతిలో ప్రస్తుతం వరుస ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా సుజిత్ సందీప్ దర్శకత్వంలో ఒక క్రేజీ ప్రాజెక్ట్ ఖరారైంది. వీటితో పాటు మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. సంబరాల ఏటి గట్టు రిలీజ్ అనంతరం ఈ సినిమాలపై అధికారిక ప్రకటనలు వెలువడనున్నాయి. మొత్తానికి, మూడేళ్ల నిరీక్షణ తర్వాత మెగా హీరో నుంచి బ్యాక్‌టుబ్యాక్ సినిమాలు రాబోతుండటంతో మెగా అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## మెట్రో స్టేషన్‌లో వెంకీ మామ యాక్షన్..



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఆదర్శ కుటుంబం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవల ఇండోర్ షెడ్యూల్ పూర్తి చేసిన చిత్ర బృందం, తాజాగా మలక్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఒక కీలకమైన ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించింది. ఈ సినిమాను పక్కా కామెడీయాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. చాలా కాలం తర్వాత ఈ క్రేజీ కాంబో సెట్స్ పైకి రావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వెంకటేష్ మార్క్ వినోదం ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని అక్టోబర్ నెలలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దసరా కానుకగా ఈ క్రేజీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# వీనస్ సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** తన కెరీర్‌లో ఏడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను గెలుచుకున్న మాజీ ప్రపంచ నంబర్ 1 వీనస్ విలియమ్స్ సంచలన ఓటమి చవిచూసింది. ఈ అనుభవజ్ఞురాలైన అమెరికన్ స్టార్ మాడ్రిడ్ ఓపెన్‌లో వరుసగా తన 10వ సింగిల్స్ మ్యాచ్‌లో ఓడిపోయింది. 45 ఏళ్ల విలియమ్స్, మాడ్రిడ్ ఓపెన్ మొదటి రౌండ్‌లో కైట్లిన్ క్వెవెడో చేతిలో 6-2, 6-4 తేడాతో ఓడిపోయి, వరుసగా 10 మ్యాచ్‌లలో ఓడిపోయిన మొదటి మాజీ నంబర్ వన్ క్రీడాకారిణిగా నిలిచింది. తన ప్రత్యర్థి పుట్టకముందే తన ఎనిమిది గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌లో ఆరింటిని గెలుచుకున్న 2010 ఫైనలిస్ట్ విలియమ్స్‌ను, వైల్డ్‌కార్డ్ క్రీడాకారిణి రెండవ సెట్‌లో 3-0 తో వెనుకబడినప్పటికీ ఓడించింది. ఈ ఏడాది ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌కు వీనస్ విలియమ్స్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించిందని నిర్వాహకులు ధృవీకరించారు. దక్షి ణ కాలిఫోర్నియా ఎడారిలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఈ అమెరికన్ క్రీడాకారిణి డబుల్స్‌లో కూడా పోటీపడనుంది. ఈ స్టార్ క్రీడాకారిణి చివరిసారిగా జూలై 2025లో వాషింగ్టన్ ఓపెన్‌లో తన తోటి అమెరికన్ క్రీడాకారిణి పేటన్ స్టెర్న్స్‌ను ఓడించి మ్యాచ్ గెలిచింది. అలాగే 2000, 2001, 2005, 2007, 2008లో ఈ ప్రతిష్టాత్మకమైన గడ్డి కోర్టులలో విజయం సాధించి, ఐదుసార్లు వింబుల్డన్ టైటిల్‌ను గెలుచుకుంది. అంతేకాకుండా వీనస్ 2000, 2001లో యూఎస్ ఓపెన్‌ను కూడా గెలుచుకుంది. ఒక గ్రాండ్ స్లామ్‌లో అత్యధిక సార్లు పాల్గొన్న రికార్డు ఆమె పేరిట ఉంది. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆమెకు 95వ టోర్నమెంట్.

ఆట

# శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం

## టోర్నీ నుండి వైదొలిగిన పాక్



**న్యూఢిల్లీ:** దశాబ్దం తర్వాత శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో డ్రా ఖరారు కాగా, పాకిస్థాన్ వైదొలిగింది. మే 24 నుండి జూన్ 7 వరకు గోవాలో జరగనున్న ఈ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌తో పాటు, డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, మాల్దీవులు కూడా చోటు దక్కించుకున్నాయి. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ దశాబ్ద కాలంలో తొలిసారిగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఫటోర్డాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆరు జట్లు ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడనున్నాయి. గ్రూప్ ఎలో నేపాల్, శ్రీలంక, భూటాన్, గ్రూప్ బిలో భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులు ఉన్నాయి. అయితే పాకిస్తాన్‌కు భారత్‌లో ఆడేందుకు అక్కడి ప్రభుత్వం నుండి అనుమతి లభించలేదు. దీంతో టోర్నమెంట్ నుండి పాకిస్థాన్ మహిళా జట్టు వైదొలగాల్సి వచ్చింది. ఇక ప్రతి గ్రూపు నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి, ఫైనలిస్టులను నిర్ణయించడానికి ఈ సెమీఫైనల్స్‌ను సింగిల్‌లెగ్ నాకౌట్ పద్ధతిలో ఆడతారు. కాగా గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఎఫ్‌సి ఆసియా కప్ 2026 తర్వాత, భారత్‌కు శాఫ్ ఛాంపియన్‌షిప్ మొట్టమొదటి పోటీ టోర్నమెంట్ కానుంది. పోటీలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్నప్పటికీ భారత్ గత రెండు ఎడిషన్లలో ఆధిపత్యం చెలాయించలేకపోయింది. 2022, 2024 లో బంగ్లాదేశ్, నేపాల్ జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. 2019లో జరిగిన ఫైనల్‌లో ఆతిథ్య దేశమైన నేపాల్‌ను 3-1 తేడాతో ఓడించి భారత్ చివరిసారిగా శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.



## బాక్సింగ్ టాప్స్ కోర్ గ్రూప్‌లో..

# సచిన్, ప్రీతి, అరుంధతి, ప్రియ

**న్యూఢిల్లీ:** నలుగురు భారత బాక్సర్లు ప్రీతి పవార్, ప్రియా, అరుంధతి చౌదరి మరియు సచిన్ సివాచ్ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ కోర్ గ్రూప్‌కు పదోన్నతి పొందారు. ఇటీవల ముగిసిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో పవార్, ప్రియా, చౌదరి స్వర్ణ పతకాలు సాధించగా, సివాచ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్న తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. టాప్స్ ఫ్రేమ్‌వర్క్ కింద అథ్లెట్ల ప్రదర్శనలను బుధవారం సమీక్షించిన 172వ మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆసియా ఛాంపియన్‌షిప్‌ల సమయంలో అర్హత సాధించిన పవార్, ఈ ఏడాది చివర్లో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ గేమ్స్, జపాన్‌లో జరగనున్న ఆసియా గేమ్స్ రెండింటిలోనూ పోటీపడనుంది. ఆమెతో పాటు జైస్మిన్, ప్రియా, అరుంధతి, సివాచ్ కూడా పాల్గొననున్నారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన అర్హత ప్రమాణాలను నెరవేర్చినందున, పవార్, ప్రియా మరియు శివాచ్ కూడా ఆసియా క్రీడల్లో పోటీపడనున్నారు. అంతేకాకుండా, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో వారి ప్రదర్శనల ఆధారంగా, ఎమ్‌ఒసి ఆదిత్య (65 కేజీలు), దీపక్ (70 కేజీలు), హర్ష్ (90 కేజీలు) అనే ముగ్గురు బాక్సర్లను టాప్ డెవలప్‌మెంట్ గ్రూప్‌లో చేర్చింది. నరేందర్ (+90 కేజీలు) టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్‌లో చేర్చబడ్డాడు, ఈ నెల ప్రారంభంలో ఉలాన్‌బాతర్‌లో జరిగిన మీట్‌లో హర్ష్ మరియు నరేందర్ కాంస్య పతకాలు సాధించగా, ఆదిత్య మరియు దీపక్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

# నేడు ఐపిఎల్ కీలక పోరు

## చెన్నై, ముంబై ఇండియన్స్‌కు డు ఆర్ డై.. ఒకరిపై ఒకరు గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన చెన్నై కేవలం రెండు విజయాలు మాత్రమే అందుకుంది. దీంతో ప్రస్తుతం 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటికే లీగ్ దశలో దాదాపుగా సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే మ్యాచ్ కీలకం కానుంది. సూపర్ కింగ్స్, ఇండియన్స్‌కు ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిలుతాయి.

కాగా ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 11 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో ఉంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లు 8 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. ఈ





ఇకపై ప్రతి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్‌కు అత్యంత కీలకం. ఒక్కో మ్యాచ్ ఓడిపోతే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23న వాంఖడేలో ముంబై ఇండియన్స్ పై గెలవడం తప్పనిసరి. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా చెన్నై సూపర్ కింగ్స్ లాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది.

తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి ముంబై 4 పాయింట్లతో తిరిగి పోటీలోకి వచ్చింది. ముంబై జట్టుకు మంచి కాంబినేషన్ ఉండటంతో బలంగా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంబై ఇండియన్స్‌కు కూడా సూపర్ కింగ్స్‌తో జరగనున్న పరిస్థితుల్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే ఇకపై తప్పనిసరిగా వరుస విజయాలు సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబైపై జరిగే మ్యాచ్‌లో గెలిస్తే చెన్నై 6 పాయింట్లకు చేరుకుని ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అదే సమయంలో ముంబై 4 పాయింట్ల వద్దే ఉంటుంది. ఓడిపోతే సీఎస్కే ప్లే ఆఫ్స్ ఆశలు ప్రమాదంలో ఉంటాయి.

ఈ కీలక సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎలా జట్టును నడిపిస్తాడో చూడాలి. మొత్తానికి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌కు ఈ మ్యాచ్ ఇది డూ ఆర్ డై పరిస్థితి అనే చెప్పాలి.



## టి20 మహిళా ర్యాంకింగ్స్‌లో..

# దుమ్ము రేపిన షెఫాలీ

### దిగజారిన స్మృతి



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్ షెఫాలీ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో దుమ్ము రేపింది. ఐసీసీ విడుదల చేసిన తాజా జాబితాలో షెఫాలీ (731) రెండు ప్లేస్లు ఎగబాకి ఆరో ర్యాంక్లో నిలిచింది. సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్ల సిరీస్లో భాగంగా ఆదివారం జరిగిన రెండో టీ20లో హాఫ్ సెంచరీ చేయడం ఆమెకు కలిసొచ్చింది. అలాగే వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (762) ఒక్క ప్లేస్ దిగజారి నాలుగో ర్యాంక్‌కు పడిపోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో స్మృతి 13, 12 రన్స్ మాత్రమే చేసింది. ఇక విండీస్ బ్యాటర్ హేలీ మాథ్యూస్ (767) మూడో ర్యాంక్‌కు ఎగబాకింది. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (639) రెండు ర్యాంకులు మెరుగుపడి 11వ స్థానంలో నిలవగా, జెమీమా రోడ్రిగ్స్ (637) 14వ ర్యాంక్‌నకు పడిపోయింది. జార్జియా వోల్ (815), బెత్ మూనీ (788), హేలీ మాథ్యూస్ (767) టాప్-3లో కొనసాగుతున్నారు. కాగా బౌలింగ్లో దీప్తి శర్మ (705) రెండు స్థానాలు కిందకు దిగి ఐదో ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. రేణుకా సింగ్ (699) నాలుగు ప్లేస్‌ను అరుంధతి రెడ్డి (665) మూడు స్థానాన్ని కోల్పోయి వరుసగా 9, 12వ ర్యాంక్‌ల్లో నిలిచారు. రాధా యాదవ్ (620) 20వ ర్యాంక్‌లో ఉంది.

## పశ్చిమాసియా ఎఫెక్ట్!

# నష్టాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, ఏప్రిల్ 22:** దేశీయ ఈక్విటీసూచీలు ఒక్కసారిగా నష్టాల్లోకి మళ్లాయి. ఇరాన్‌పై శాంతిచర్చలకు గడువు నిరవధిక పొడిగింపు, హార్ముజ్‌లో నౌకలపై దిగ్బంధం కొనసాగుతుందన్న ట్రంప్ ప్రకటనలు మార్కెట్లను కుంగదీసాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 756.84 పాయింట్లు క్షీణించి 78,516.49 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 198.50 పాయింట్లు క్షీణించి 24,378.10 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిచింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా 1.65 శాతం, 1.57శాం చొప్పున పెరిగాయి. ఇన్వెస్టర్లు వేచి చూసేధోరణి అవలంభించారు. హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్ 10.74శాతం భారీగా క్షీణిస్తే ఇన్ఫోసిస్ 3.38శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.52శాతం చొప్పున సూచీలో భారీ క్షీణతను ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.90శాతంపెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2440 కంపెనీలషేర్లుపెరిగాయి. 1838 కంపెనీల షేర్లు దిగజారాయి. మొత్తం 154 షేర్లు యదాతథంగా కొనసాగాయి. భారత్‌ప దేళ్ల బాండ్లరాబడులు 6.915 శాతంవద్దకు చేరాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి 93.78వద్ద కదలాడింది. అంతకుముందురోజు 93.44 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్లు రూ.1,53,190వద్ద రికార్డయింది. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు కూడా 0.21శాతం క్షీణించి 4.282వద్ద ముగిసింది. నిఫ్టీ ఐటిఊచీ 3.89శాతం క్షీణించింది. నాలుగోత్రైమాసిక ఫలితాలు క్షీణించడమే ఇందుకు కారణం. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 10.74శాతం, కోఫోర్జ్ 4.24శాతం, ఇన్ఫోసిస్ 3.38, ఎల్‌అండ్‌టి టెక్ సేవలు 3.11శాతం, ఎంఫసిస్ 3.02శాతం, టిసిఎస్ 2.88శాతం విప్రో 0.49శాతం చొప్పున క్షీణించాయి. ఒరాకిల్ ఫైనాన్షియల్స్ మాత్రం 2.51శాతంపెరిగింది. ఇక అద్వైత్ ఎనర్జీ ట్రాన్స్‌షన్స్ 2.20శాతం, అజంతా ఫార్మా 0.18శాతంపెరిగితే 360 వన్‌వామ్ 4.31శాతం క్షీణించింది. కేంద్రప్రభుత్వ సిఎంపిడిఐ సంస్థ 3.40శాతం హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ 1.65శాతం చొప్పున క్షీణించాయి. లూపిన్ 0.51శాతం,. ఎల్‌అండ్‌టి 1.32శాతం దిగువన నమోదయితే టాటాఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 1.17శాతంపెరిగింది. టెక్ మహీంద్ర 2.5శాతం పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.88శాతం క్షీణించాయి.

## ఎన్ఎస్ఇ వివాదాల సెటిల్‌మెంట్‌కు

# రూ.1800 కోట్లు

### సెబీ ఉన్నతస్థాయి ప్యానెల్ సిఫారసులు




**ముంబయి, ఏప్రిల్ 22:** దేశంలోని అతిపెద్ద ఈక్విటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ), మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మధ్య పదేళ్లుగాకొనసాగుతున్న చట్టపరమైన పోరాటం కొలిక్కివస్తోంది. సెబీ ఏర్పాటు చేసిన ఒక ఉన్నత స్థాయి ప్యానెల్, ఎన్ఎస్ఈపై ఉన్న పెండింగ్ వివాదాలు సెటిల్‌మెంట్‌కు సుమారు రూ. 1,800 కోట్లకు పైగా చెల్లించాలని సిఫార్సు చేసింది. గతంలో ఎన్ఎస్ఈ పాలనలో జరిగిన లోపాలు, ముఖ్యంగా ట్రేడింగ్ కోలొకేషన్ వివాదం వంటి అంశాల కారణంగా ఈ వివాదం తలెత్తింది. ఈ సమస్యల వల్లే ఎన్ఎస్ఈ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐపిఒ దాదాపు పదేళ్ల పాటు వాయిదా పడింది. ఈ తాజా సిఫార్సు అమలులోకి వస్తే, ఎన్ఎస్ఈ ఐపీఓ మార్గం సుగమం కావడమే కాకుండా, మార్కెట్ రెగ్యులేటర్‌తో ఉన్న విభేదాలు కూడా తొలగిపోయే అవకాశం ఉంది. ఈ కేసులను పరిష్కరించుకోవడానికి ఎన్ఎస్ఈ గతంలో రూ. 1,300 కోట్లను కేటాయించగా, ప్యానెల్ మాత్రం అంతకంటే ఎక్కువగా రూ. 1,800 కోట్లు చెల్లించాలని సూచించింది. పక్షం రోజుల క్రితం ఎన్ఎస్ఈ పంపిన సెటిల్‌మెంట్ ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత ప్యానెల్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియను అధికారికంగా ఖరారు చేసే ముందు, సెబీ ఒక డిమాండ్ లేఖను జారీ చేసే అవకాశం ఉంది. ఈ భారీ మొత్తం చెల్లింపు ద్వారా ఎన్ఎస్ఈ తనపై ఉన్న పాత మరకలను తుడిచేసుకుని, ఒక పారదర్శకమైన సంస్థగా ఐపీఓ వైపు అడుగులు వేయాలని భావిస్తోంది. మరోవైపు ఐపీఓ దిశగా ఎన్ఎస్ఈ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఐపీఓ కోసం ఏకంగా 20 బ్యాంకులని మర్చంట్ బ్యాంకర్లుగా నియమించుకోవడం ఎన్ఎస్ఈ ప్రాముఖ్యతను చాటిచెబుతోంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో దాదాపు 1.90 లక్షల మంది ఇన్వెస్టర్లున్నారు. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియ సజావుగా సాగితే, మే నెలాఖరు నాటికి ఎన్ఎస్ఈ తన ఆర్థిక ఫలితాలను ప్రకటించిన వెంటనే ఐపీఓ కోసం సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉందన్న అంచనాలు పెరిగాయి.




# ట్రెంట్ నికరలాభం రూ.455కోట్లు!

**ముంబయి, ఏప్రిల్ 22:** టాటాగ్రూప్‌లోని ట్రెంట్ సంస్థ నికరలాభాలు 30%పెరిగి రూ.455 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో ఆర్జించిన 350 కోట్లతోపోలిస్తే 30% పెరిగింది. నికరలాభాలు పెరగడంతో కంపెనీ ప్రతి ఈక్విటీ షేరుకు రూ.6 డివిడెండ్ ప్రకటించింది. 74 సర్వసభ్య సమావేశం ముగిసిన మూడోరోజునుంచి డివిడెండ్ చెల్లింపులు ప్రారంభిస్తామని వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 20.2%పెరిగి 4106 కోట్లనుంచి రూ. 4937 కోట్లకు పెరిగాయి. ఇక నిర్వహణ లాభాలు కూడా 40శాతం పెరిగాయి. 656 కోట్ల నుంచి రూ.919 కోట్లకు పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. ఎబిడిటా మార్జిన్ కూడా 16 నుంచి 18శాతానికి పెరిగింది. బోనస్ ఇష్యూను కూడాప్రకటించింది. 1:2 నిష్పత్తిలో షేర్లు జారీచేస్తోంది. ప్రతి రెండుషేర్లకు అదనంగా ఒకటి కేటాయిస్తుంది. అయితే వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది. ట్రెంట్ లాభాలు పెరగడంతో కంపెనీ షేర్లు ఒకటిశాతం పెరిగి 4434.50 గా ట్రేడ్ అయ్యాయి.

# 6నెలల్లోనే 26 లక్షలకోట్ల వృద్ధి

## భారత్‌లో భావితరం బిజినెస్ టైకూన్ల సంపద వృద్ధి!




**ముంబయి, ఏప్రిల్ 22:** భారత్‌కార్పొరేట్ రంగంలోని భావితరం బిజినెస్ టైకూన్‌లు 50 మంది కేవలం ఆరునెలల్లోనే తమ సంపదను రూ.26 లక్షలకోట్లు పెంచుకోగలిగారని ఎఎస్‌కె ప్రైవేట్ వెల్త్, హురూన్ ఇండియా సక్సెసర్స్ 50 సర్వేలో వెల్లడి అయింది. ఈ భావితరం 50 మంది బిజినెస్ దిగ్గజాలు తమ కుటుంబ సంస్థలను మరింతగా విస్తరించి సంపదను గణనీయంగా పెంచారు. దేశంలోని వారసత్వ వ్యాపారాలు కొత్త తరహా విస్తరణదిశగా వెళుతున్నట్లు తేలింది. మొత్తం రూ.26.3 లక్షలకోట్లు మార్కెట్ విలువలుపెరిగాయంటే వారి వ్యాపార సామ్రాజ్యాలు మరింత విస్తరించుకోగలిగినట్లు తెలుస్తోంది. 2020లో రూ.4.6 లక్షలకోట్లు ఉన్న ఈ మొత్తం విలువలు 2026 నాటికల్లారూ.30.9 లక్షలకోట్లకు సంస్థల మార్కెట్ విలువలు పెరిగాయని అంచనా. అంటే 6.7 రెట్లు సంపద సృష్టిజరిగిందని హురూన్ ఇండియా వెల్లడించింది. మొత్తం పదిమంది భావితరం వాణిజ్యవేత్తలు విస్తరణలో మరింత వేగంతో దూసుకుపోతున్నారు. వీరిలోజూపిటర్ వ్యాగన్స్ అధినేత వికాస్ లోహియా డిప్యూటీ ఎండిగా సంపదను 152.8 రెట్లు వృద్ధిచేసారు. అందరికంటే అగ్రస్థానంలో నిలిచారు. ఆయన నాయకత్వంతోకంపెనీ రూ.10,666 కోట్లు పెరిగిమొత్తం రూ.10,736 కోట్లకు చేరింది. ఆ తర్వాత తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ జెఎండి అమిత్ దహానుకర్, జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండి అభ్యుదయ్ జిందాల్‌లు తమతమ సంపదను 52.5 రెట్లు పెంచుకోగలిగారు. ఈ విస్తరణలో ఆటోమొబైల్, ఆటో విడిభాగాల రంగాలు అత్యధికంగా విస్తరించాయి. మొత్తం తొమ్మిది కంపెనీలు ఈ విభాగంలో ఉంటే హెల్త్‌కేర్ కంపెనీలు ఆరువరకూ ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువలు రూ.7.26 లక్షలు పెంచుకోగలిగాయి. ముంబయి, ఢిల్లీ నగరాల్లోనే వ్యాపారవేత్తలే ఎక్కువగా టర్నోవర్ పెంచుకోగలిగారు. ఈ రెండునగరాల్లో మొత్తం 12 కంపెనీల కేంద్రకార్యాలయాలున్నాయి. కార్పొరేట్ పరంగా 50 కంపెనీలు రూ.8.2లక్షలకోట్లు వార్షిక రాబడులు సాధించాయి. రూ.90,168 కోట్లు నికరలాభం ఆర్జించగలిగాయి. వార్షికవృద్ధి 14.4శాతంగా ఉంది. ఈ కంపెనీలు మొంగా 8.6 లక్షలమంది ఉద్యోగులతో సిఎస్ఆర్ కార్యకలాపాలకు ఈ 50 కంపెనీలు రూ.1028 కోట్లు అందిస్తున్నాయి. కంపెనీ విలువలు వృద్ధిచేయడంలో ఆదాని విభాగంలో కరన్ ఆదానికూడా రూ.2,67,525 కోట్లకు పెంచగలిగారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తతలే

# రెపోరేట్లకు గండి!

### ఆర్బీఐ ఎంపిసి మినిట్స్ విడుదల

**ముంబయి, ఏప్రిల్ 22:** రిజర్వుబ్యాంకు ఇటీవల నిర్వహించిన మానిటరీపాలసీ సమీక్షలో కమిటీ సభ్యులు పశ్చిమాసియా ఉద్రిక్తతలనే ఎక్కువగా పరిగణనలోనికి తీసుకోవాల్సి వచ్చింది. పశ్చిమాసియా సంక్షోభంతో ద్రవ్యోల్బణంపై ప్రభావం ఎక్కువ పడిందని ఎంపిసి సమీక్ష మినిట్స్ నివేదికల్లో వెల్లడి అయింది. ఎంపిసి మినిట్స్‌ను బుధవారం విడుదలచేసింది. భారత ఆర్థికవ్యవస్థపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రస్థాయిలో ఉందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఎగుమతులపరంగానే కాకుండా సంక్లిష్ట ఉత్పత్తుల సరఫరాపరంగాను, ఇంధనం, కమోడిటీ ధరలు, విదేశీ జమలు వంటి వాటితోపాటు గ్లోబల్ డిమాండ్‌కూడా రెపోరేట్లు యదాతథంగా కొనసాగించేందుకు దోహదంచేసిందని అభిప్రాయపడ్డారు. భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు గతనెలలో మరింతగా విస్తరించినందున వడ్డీరేట్లజోలికి వెళ్లకపోవడమే సముచితమని ఎంపిసి సమీక్షలో సభ్యులాంతా ఏకాభిప్రాయం వ్యక్తంచేసారు. సరఫరా అంతరాయాలు రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా పక్కన పెట్టాయని, దీనివల్ల వృద్ధిమాట అటుంచి ఎక్కువ సమస్యలు ఎదురయినట్లు ఆర్బీఐ మినిట్స్‌లో పొందుపరిచారు. ఈపరిస్థితులవల్ల ద్రవ్యోల్బణం మరింతపెరిగే ప్రమాదం ఉందని అందువల్లనే రెపోరేట్లు సవరణలు మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తం అయిందని నివేదికలో తెలిపారు. మూడురోజుల సమీక్షలో సెంట్రల్ బ్యాంకు తన రెపోరేట్లను స్థిరంగానే కొనసాగించింది. అప్రమత్తతతో వ్యవహరిస్తూ సవరణలపట్ల వేచిచూసే ధోరణి అనుసరించింది. ఆరునెలలుగా కొనసాగుతున్న ఇరాన్ వివాదంలో ఇంధన సరఫరా బ్రేక్‌డౌన్‌తోపాటు ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి కి బ్రేకులు వేసాయి. ఆరుగురుసభ్యులున్న ఎంపిసిలో అందరూ కూడా కొనుగోలురేటును 5.25శాతంవద్దనే ఉంచినట్లు తేలింది. రూపాయి క్షీణత, వాణిజ్య ఎగుమతులు క్షీణించడం వంటి వాటితో రెపోరేట్లలో వేచిచూసేధోరణి అనుసరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.